
అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 28-06-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 179 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50



ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ముర్ము.

ఫిరాయింపులకు ఆద్యుడు కేసీఆరే

ప్రభుత్వాన్ని కూల్చుతామని రంకెలేస్తే, గాలి కొదిలేస్తామా? : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- రాహుల్ హామీ 100 శాతం పక్కా
- విద్యా శాఖకు నేను ఫుల్ టైం మంత్రిని
- నిధులకోసం ప్రధానిని కలుస్తాం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్టీ ఫిరాయింపులకు కేసీఆరే ఆద్యుడని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని కూల్చుతామని రంకెలేస్తే, గాలికి వదిలేస్తామా? అని ప్రశ్నించారు. పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించడం కాంగ్రెస్‌కు వెన్నెతో పెట్టిన విద్య అని అన్నారు. అనుభవజ్ఞులైన మంత్రుల సహకారంతో, అద్భుతమైన పరిపాలన ప్రజలకు అందిస్తున్నా మన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి రాజకీయ ప్రేరేపిత కేసులు తెలంగాణలో లేవన్నారు. ఇతర రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలు, తమ పాలనలో ఉండవన్నారు. గురువారం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో 'వంద ఎలుకలు తిన్న పిల్లి, తీర్థయాత్రలకు పోయిందన్నట్టు' కేసీఆర్ తీరు ఉందన్నారు. ఈ విషయంలో కేసీఆర్‌కు సిగ్గుతో పాటు మతి కూడా తప్పిందన్నారు. ఇలాంటి ఫిరాయింపులకు పునాదులు వేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. తమ పార్టీకి చెందిన 61 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను తీసుకున్నారని ఫైర్ అయ్యారు. చేసిన తప్పులకు క్షమించమని తొలుత అమరవీరుల స్థూపం దగ్గరకు వచ్చి కేసీఆర్ ముక్కు మూడించులు అరిగేలా నేలకు రాయాలన్నారు. 100 రోజులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మనుగడ సాగించదని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు చెప్పారన్నారు. దానికి వంతపాడింది బీజేపీనే కదా అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చేస్తామని బీఆర్ఎస్, బీజేపీ రోడ్లపై రంకెలేస్తే, గాలికి వదిలేయాలా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో 35 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్, ఎంపీ ఎన్నికల్లో 16 శాతం ఓట్లకు పడిపోయిందన్నారు. 17 ఎంపీ స్థానాలు ఓడి, 8 సీట్లల్లో డిపాజిట్ కోల్పోయి, 14 స్థానాల్లో మూడో స్థానంలో నిలిచినా, కేసీఆర్‌కు ఇంకా కనువిప్పు కలగడం లేదన్నారు. బీఆర్ఎస్‌కు ఓట్లేయకపోవడం ప్రజల తప్పు అన్నట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కాంగ్రెస్‌ను

...6లో



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

గోతికాడి నక్కలకు.. అనుభవంతో రిప్లై ఇచ్చారు

దాదాపు 40 ఏండ్లుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నేతలకు జీవన్ రెడ్డి అండగా ఉంటూ వస్తున్నారని సీఎం అన్నారు. అయితే ప్రభుత్వం రైతులకు చేస్తోన్న రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలు, జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఈ జాయినింగ్ విషయంలో తమవైపు నుంచి సమన్వయం చేయడంలో లోపం, పీసీసీ నుంచి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. ఈ కారణంగా జీవన్ రెడ్డి మనస్తాపం చెందారన్నారు. ఈ గందరగోళాన్ని గుర్తించిన మంత్రి శ్రీధర్‌బాబు తక్షణమే జీవన్ రెడ్డితో చర్చించి సమస్య పరిష్కారానికి చొరవ చూపారన్నారు. మరోవైపు తెలంగాణ, కాంగ్రెస్ పార్టీ పట్ల జీవన్ రెడ్డికి ఉన్న కమిట్మెంట్, అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కేసీ వేణుగోపాల్, దీపా దాస్ మున్షి ఆయనతో మాట్లాడారన్నారు. అయితే జీవన్ రెడ్డి ఇష్యూతో కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం చేసేలా కొన్ని గోతికాడి నక్కలు ఎదురు చూశాయని విపక్ష పార్టీలపై ఫైర్ అయ్యారు. కానీ పార్టీ పట్ల ఉన్న చిత్తశుద్ధి, అనుభవంతో అలాంటి నక్కలకు జీవన్ రెడ్డి ఛాన్స్ ఇవ్వలేదన్నారు. జీవన్‌రెడ్డి గౌరవానికి భంగం కలగకుండా జగిత్యాల, కరీంనగర్ కు చెందిన పార్టీ కార్యకర్తలకు

...6లో

ఆ రెండు పోస్టులకు పోచారం, ఆకునూరి మురళి





- వ్యవసాయ కమిషన్ చైర్మెన్‌గా మాజీ స్పీకర్
- విద్యా కమిషన్ చైర్మెన్‌గా మాజీ ఐఏఎస్ 6లో..
- సీఎం రేవంత్ నిర్ణయం..అధిష్టానం ఆమోదముద్ర

ధరలు, నిరుద్యోగం ఊసే లేదు

రాష్ట్రపతి నోటా ఎమర్జెన్సీ .. విపక్షాల అభ్యంతరం

- ప్రసంగంలో సీఏఏకు సమర్థన
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆప్ ఎంపీల వాకౌట్
- నీట్ దోషులను శిక్షిస్తామని హామీ..

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గురువారం చేసిన ప్రసంగం పాత చింతకాయ పచ్చడిలా సాగింది. కొత్త ప్రభుత్వ విధానాలను మార్గనిర్దేశం చేసేలా ఉండాల్సిన ఈ ప్రసంగంలో నీట్ దోషులను శిక్షిస్తామనడం తప్ప కొత్తగా చెప్పిందేమీ లేదు. గత ఐదేండ్లుగా చెప్పినవే, మళ్లీ ఉద్ఘాటించారు. అధిక ధరలు, నిరుద్యోగం, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి వాటి గురించి ప్రస్తావించకుండా తన ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పలు చెప్పారు. ఎన్నికల్లో చర్చనీయాంశమైన అగ్నిపథ్ గురించి ఒక్క ముక్క కూడా ప్రస్తావించలేదు. పార్లమెంటు సక్రమంగా పని చేస్తే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, అప్పుడు ప్రభుత్వంపైనే కాకుండా యావత్ పార్లమెంటరీ వ్యవస్థపై కూడా విశ్వాసం ఉంటుందని, దేశ ప్రజల ఆకాంక్షలను పార్లమెంటు నెరవేరుస్తుందని ఆశిస్తున్నానని రాష్ట్రపతి పేర్కొన్నారు. కానీ, 17వ లోక్‌సభలో ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అనుమతించలేదనే విషయం ఆమెకు తెలియదని అనుకోలేం. ఎలాంటి చర్చ లేకుండా ఒకదాని తరువాత ఒక బిల్లును గిలెటెన్ చేసింది. ఒక దశలో రాహుల్ గాంధీ ఎంపీ పదవిని రద్దు చేసింది. సమావేశాల్లో హోం మంత్రి వివరణ కోరినందుకు 140 మంది ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలను సస్పెండ్ చేశారు. ఇదంతా మరచిపోయి పార్లమెంటు సక్రమంగా జరగాలని హితోపదేశం చేశారు.

నీట్‌పై ప్రతిపక్షాలు పార్లమెంటులో చర్చకు నోటీసులిచ్చిన నేపథ్యంలో రాష్ట్రపతి తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ "ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ నియామకాల్లో పారదర్శకత చాలా అవసరం. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఈ విషయంలో అక్రమాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం." అని ముక్తాయించారు. ఈ అఖిల భారత ప్రవేశ పరీక్షలో అవినీతిపై దేశం మొత్తం ఆందోళన

...6లో



ఆందోళన చేస్తున్న ఆప్ ఎంపీలు

ప్రజాప్రస్థానం ఆగలేదు

గొప్పలక్ష్యాలతో ముందుకు సాగాల్సి ఉంది : మాజీ సీఎం కేసీఆర్



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న గులాబీబాస్ కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో కోసం సాగుతున్న 25 ఏండ్ల ప్రజాప్రస్థానం ఇక్కడితో ఆగిపోదనీ, గొప్పలక్ష్యాలతో ముందుకు సాగాల్సి ఉందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గురువారం గజ్వేల్‌లోని కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో ఆయన్ను ఆర్మూర్, హుజురాబాద్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దాకా, కాంగ్రెస్ పాలనలో అన్నిరంగాల్లో ఆగమవుతున్న తెలంగాణను గాడిలో పెట్టేదాకా తన ప్రయాణం సాగుతుందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గత పథకాలు అందట్లేదని ప్రజలు వాపోతున్నారన్నారు. రాష్ట్రంలో పాలన గాడితప్పిందని విమర్శించారు. కొంతమంది నాయకులు

...13లో

విద్యుత్ కమిషన్‌పై కేసీఆర్ పిటిషన్‌కు ఓకే

- విచారణకు స్వీకరించిన హైకోర్టు ధర్మాసనం.. నేడు విచారణ 6లో..



జియో రీచార్జీ బాదుడు

- టారీఫ్ ప్లాన్లపై 25 శాతం పెంపు
- వినియోగదారులపై భారం

న్యూఢిల్లీ : ఊహించినట్లుగానే పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే రిలయన్స్ జియో రీచార్జీ ప్లాన్లను భారీగా పెంచింది. ముకేశ్ అంబానీకి చెందిన ఈ సంస్థ అట్టహాసంగా తొలుత ఉచితంగానే అపరిమిత డాటా పేరుతో మార్కెట్లోకి వచ్చింది. ఆ తర్వాత క్రమంగా మెల్లగా డబ్బులు వసూలు చేయడం ప్రారంభించింది. తాజాగా గురువారం జియో టారీఫ్ ప్లాన్స్ వ్యయాన్ని భారీగా పెంచుతూ

...13లో

బీడు భూములకు గోదావరి జలాలు

వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- సీతారామ ట్రయల్ రన్‌ను ప్రారంభించిన ప్రాజెక్టు సలహాదారు పెంటారెడ్డి



నవతెలంగాణ-అశ్వాపురం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బీడీ భూములకు గోదావరి జలాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అశ్వాపురం మండలంలోని భీమునిగుండం కొత్తూరు వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్ వన్ పంప్ హౌస్ వద్ద విద్యుత్ మోటర్‌ను తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో సీతారామ ప్రాజెక్టు సలహాదారులు పెంటారెడ్డి స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. దాంతో పంప్‌హౌస్‌లోని గోదావరి జలాలు కాలువలోకి పరుగులెత్తాయి. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో శ్రీరామచంద్రుడు ఆశీస్సులతో అహర్నిశలు శ్రమించి ప్రాజెక్ట్ ఏర్పాటుకు సహకరించిన అధికారులు, ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన అన్నదాతలకు ఆయన పాదాభివందనం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లోనే లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. సీతారామ ప్రాజెక్టు కాలువల ద్వారా ఏన్కూరు లింక్ కెనాల్, అదేవిధంగా వైరా లంక సాగర్ ప్రాజెక్టు ద్వారా మధ్యలో ఉన్న చెరువులన్నింటినీ నింపేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఏన్కూర్ మెయిన్ కెనాల్ పూర్తి చేసి

...13లో



18,942 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

- మల్టీజోన్-1లో 11,177 మంది, మల్టీజోన్-2లో 7,765 మందికి ప్రమోషన్లు
- భాషాపండితులు, పీఈటీల కలసాకారం
- ముగిసిన ప్రక్రియ

వివరాలు 5లో

పేపర్ లీకుల నుంచి నేర్వని పాఠాలు

బ్లాక్ లిస్ట్‌లో ఉన్న గుజరాత్ కంపెనీలకే కాంట్రాక్టులు

- బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాల తీరిది
- అభ్యర్థులు, మేధావులు, నిపుణుల ఆందోళన

మోడీ ప్రభుత్వ పాలనలో పేపర్ లీక్‌లతో ఉద్యోగార్థులు, విద్యార్థులు తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. అయితే, బీజేపీ ప్రభుత్వాలు మాత్రం గత పాఠాల నుంచి గుణపాఠాలను మాత్రం నేర్చుకోలేకపోతున్నాయి. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న గుజరాత్ కంపెనీలకే పరీక్షలకు సంబంధించిన కాంట్రాక్టులను కట్టబెడుతున్నాయి. అయితే, బీజేపీ ప్రభుత్వాల పనితీరును మాత్రం మేధావులు, నిపుణులు తీవ్రంగా తప్పుబడుతున్నారు.



(ఫైల్)

న్యూఢిల్లీ : పేపర్ లీకు లింకులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విస్తరించాయి. యూపీ పోలీసు కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో పేపర్ లీక్ అయిన నేపథ్యంలో గత వారం ఆ రాష్ట్ర ప్రభుత్వం అహ్మదాబాద్‌కు చెందిన ఎడ్యుటెస్ట్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌ను బ్లాక్ లిస్ట్ చేసింది. ఈ కంపెనీ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ స్కామ్‌లకు పాల్పడినట్టు ఒక ప్రయివేటు వార్త సంస్థ దర్యాప్తులో వెల్లడైంది. కాగా, సదరు ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ అయిన సురేశ్‌చంద్ర ఆర్య, సర్వదేశిక్ ఆర్యప్రతినిధి సభ అనే ప్రముఖ హిందూ సంస్థకు అధ్యక్షులకు బీజేపీ నాయకులతో మంచి

...13లో

బొలీవియాలో సైనిక కుట్రకు విఫలయత్నం!

- ఆ ప్రయత్నాలను నిర్వీర్యం చేశామని అధ్యక్షుడి ప్రకటన
- కొత్త మిలటరీ కమాండర్ నియామకం



వివరాలు 13లో

నిరుద్యోగులకిచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 13లో

ముస్లింలపై విద్వేషపూరిత మతోన్మాద దాడుల్ని అరికట్టాలి



- నిరసనలకు సీపీఐ(ఎం) పిలుపు

వివరాలు 3లో

వికలాంగుల కోసం ప్రత్యేక విద్యా పాలసీ

టీవీసీసీ చైర్మెన్ ముత్తినేని వీరయ్య వర్మ

- హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం : ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర సదస్సులో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల విద్య కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తామనీ, వారి హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య వర్మ తెలిపారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ)తెలంగాణ రాష్ట్ర కమిటీ, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బధిరుల ఆశాజ్యోతి, కవి, రచయిత హెలెన్ కెల్లర్ 144వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'వికలాంగుల విద్యా-స్థితిగతులు -ప్రభుత్వ పాత్ర' అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన రాష్ట్ర సదస్సును నిర్వహించారు. హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు రామిజా బీ మెమోరియల్ అవార్డ్స్-2024 పేరుతో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, కవులు, కళాకారులు, రచయితలైన 21మందికి అవార్డులను ప్రదానం చేశారు.ఈ ఈ కార్యక్రమంలో హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మెన్ పి ఉమర్ ఖాన్, సహారా డైరెక్టర్ శంకర్ మఠం, టీపీఎస్ఎల్‌పీఏ రాష్ట్ర అధ్యక్షులు నాగేందర్, కార్యదర్శి ఇమద్ ఖాన్ రూమన్, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్, ఎన్‌పీడీవో రాష్ట్ర అధ్యక్షులు నల్గొండ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జి వెంకట్‌రావు, మాట్లాడారు. ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ ప్రశ్నకు వజ్రాయుధం విద్యేనని చెప్పారు. ఉన్నత స్థానాన్ని పొందాలంటే చదువు అత్యంత అవశ్యకమని తెలిపారు. వికలాంగులకు గౌరవ ప్రదనమైన పెన్షన్‌ను అందించేందుకు కాంగ్రెస్ కృత నిశ్చయంతో ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కేసీఆర్ సర్వనాశనం చేశారని విమర్శించారు. వికలాంగులకు త్వరలోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. సంక్షేమంతో పాటు వారి అభివృద్ధి కోసం అందరూ గర్వించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వమైనా, మరెవరైనా వికలాంగుల పట్ల చూపించాల్సింది జాలి కాదనీ, వారి హక్కులను అమలు చేస్తే చాలని సూచించారు. వికలాంగుల సంఘం నాయకుడిగా గత ప్రభుత్వ పాలనలో ఎన్నో ధర్నాలు చేశాననీ, ప్రస్తుతం కార్పొరేషన్ చైర్మెన్ హోదాలో ఉన్న కాబట్టి.. ధర్నాలు చేయాల్సిన అవసరం లేకుండానే తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉమర్‌ఖాన్ మాట్లాడుతూ వికలాంగుల కోసం హెలన్ కెల్లర్ జీవితాంతం పని చేశారని వివరించారు. గొప్ప మానవతావాదని చెప్పారు. రాష్ట్రంలో 45వేల మంది చెవిటి, మూగ విద్యార్థులుంటే..వారిలో పదివేల మందికి మాత్రమే పాఠశాల విద్య అందుతుందని చెప్పారు. మిగతా వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సామాజిక బాధ్యతను విస్మరించిందనీ, ప్రస్తుత ప్రభుత్వం ఆ బాధ్యతను మరవొద్దని సూచించారు. చాలీచాలని జీతాలతో ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించలేకపోతున్నామని చెప్పారు. అడివయ్య మాట్లాడుతూ వికలాంగుల కోసం ప్రభుత్వమే ప్రత్యేక విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల విద్యా పరిరక్షణ కోసం ప్రత్యేక నోడల్ ఏజన్సీని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థల్లో సైన్ లాంగ్వేజ్, బ్రెయిలీ లిపిలో బోధించే ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాల స్థాయిలోనే వైకల్యం కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు సర్వే చేయాలనీ, సాధారణ విద్యార్థులతో వైకల్యం కలిగిన పిల్లలు కలిసిపోయే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆటీజం, సేరిబ్రల్ పాల్సీ, మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలనీ, ఇంటి వద్దనే విద్యా బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వికలాంగులకు సౌకర్యవంతంగా భవనాలను ఉంచాలనీ, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులు వారికి అనుకూలంగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె రాజు, కాశప్ప, మధుబాబు, అరిఫా, బి స్వామి, సహాయ కార్యదర్శులు ఉపేందర్, జె దశరథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు భుజంగరెడ్డి, ప్రకాష్, వెంకన్న, గౌతమ్, సత్యనారాయణలతో పాటు వివిధ జిల్లాల నాయకులు, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థ విద్యార్థులు పాల్గొన్నారు

నో బెయిల్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో : ముగ్గురు పోలీసు అధికారులకు కోర్టు షాక్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులైన ముగ్గురు పోలీసు అధికారులు డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలకు నాంపల్లి కోర్టు షాకిచ్చింది. వారికి బెయిల్ నిరాకరిస్తూ న్యాయమూర్తి గురువారం ఆదేశాలు జారీ చేశారు. గత రెండు నెలల క్రితం ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఇదే విభాగంలో అదనపు ఎస్పీలుగా పని చేసిన బుజంగరావు, తిరుపతన్నలకు బెయిల్‌ను మంజూరు చేయాలని కోరుతూ వారి తరఫు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. అంతేగాక, వీరికి బెయిల్‌ను మంజూరు చేయాలనీ, ఫోన్‌ట్యాపింగ్ కేసులో వీరి నేరాన్ని నిరూపించే ఆధారాలేవి కూడా దర్యాప్తు అధికారులు కోర్టుకు సమర్పించలేదని నిందితుల తరఫు న్యాయవాదులు వాదించారు. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితులైన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, మరో నిందితుడు ఐ న్యూస్ శ్రవణ్ కుమార్‌లు పరారీలో ఉన్నారనీ, ఈ సమయంలో ఈ ముగ్గురు నిందితులకు బెయిల్ లభిస్తే వెలుపలికి వచ్చి, ఆధారాలను తారుమారు చేసే అవకాశమున్నదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఈ మేరకు వాదనలు విన్న న్యాయమూర్తి ముగ్గురు నిందితులకు బెయిల్‌ను నిరాకరిస్తూ తీర్పునిచ్చారు.

నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలి

- తెలంగాణ నర్సెస్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ లో అసోసియేషన్ అడ్-హాక్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు సుజావతి, అధ్యక్షురాలు జయమ్మ ప్రధాన కార్యదర్శి మరియమ్మ, వైస్ ప్రెసిడెంట్ అది లక్ష్మి, లలిత, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్ రుడావత్, కోశాధికారి క్రిష్ణ తదితరులు పాల్గొని నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. 317 జీవోపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని బాధిత నర్సింగ్ ఆఫీసర్లకు న్యాయం చేయాలని కోరారు. ప్రమోషన్ల సీనియార్టీ లిస్టును త్వరగా ప్రకటించి ఆన్‌లైన్‌లో పెట్టాలనీ, ప్రతి జిల్లాకు ఒక డిస్ట్రిక్ట్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టును క్రియేట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. "ఏడీ (నర్సింగ్), డీడీ (నర్సింగ్) పోస్టు లను బలోపేతం చేస్తూ ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. పెరిగిన బోధనాస్పత్రుల్లో, టీవీవీపిలో క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలి. బోధనాస్పత్రుల్లో పెరిగిన పడకల సంఖ్య ఆధారంగా నర్సింగ్ ఆఫీసర్లు, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులను పెంచాలి. గురుకులలో పని చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలి..." అని తీర్మానించారు. 2021లో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలనీ, హెల్త్ కార్డులివ్వాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో బోధన కోసం సీనియార్టీ, రోస్టర్ పాయింట్ ఆధారంగా ప్రమోషన్ విధా నంలో నియామకాలు జరపాలని సూచించారు. ఇన్‌సర్వీస్ ఎడ్యుకేషన్‌లో అబ్బా యిలకు కూడా ఉన్నత విద్యకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న నర్సింగ్ సిబ్బందిని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. యూనిఫాం డ్రెస్‌కోడ్‌ను మార్చేందుకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. నర్సింగ్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించేందుకు గతేడాది వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు నర్సింగ్ ఆఫీసర్లు సోమేష్, పాండు, రవి నాయక్ పాల్గొన్నారు.

హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌పై దాడి

- ఖండించిన రవాణా శాఖ ఉద్యోగులు
- నేడు పెన్ డౌన్‌కు పిలుపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్‌పై గురువారం దాడి జరిగింది. కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లిన ఓ ఆటో రిక్షా యూనియన్ నాయకుడు కమిషనర్‌పై దాడి చేశాడు. వివరాల్లోకెళ్తే.. గురువారం మధ్యాహ్నం ఒక సమస్యపై విన్నవించడానికి ఓ ఆటో రిక్షా యూనియన్ నాయకుడు అమానుల్లాఖాన్ హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయానికి వచ్చాడు. లోపల చాంబర్‌లోకి వెళ్లి కమిషనర్ రమేష్‌కు ఆటో కార్మికుల సమస్యను తెలియజేశాడు. ఈ క్రమంలో ఏం జరిగిందో ఏమో ఒక్కసారిగా కమిషనర్‌పై అమానుల్లాఖాన్ దాడికి దిగాడు. దాంతో అతడిని ఉద్యోగులు పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు.

ఖండించిన రవాణా శాఖ ఉద్యోగులు

హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు రవాణా శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు రవీంద్ర కుమార్ తెలిపారు. కమిషనర్ చాంబర్‌లోకి చొరబడి రమేష్‌పై భౌతిక దాడి చేసిన ఆటో రిక్షా యూనియన్ నాయకుడు అమానుల్లాఖాన్‌ను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ అన్ని కార్యాలయాల్లో పెన్‌డౌన్ నిర్వహిస్తామని నాయకులు రవీంద్ర కుమార్, చంద్రశేఖర్ గౌడ్, శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ, అరుణేంద్ర ప్రసాద్, ఎంజులా రెడ్డి, శ్రీనివాస్ తదితరులు తెలిపారు. అలాగే, ఈ దాడిని తెలంగాణ గ్రూప్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, హన్మంతు నాయక్ కూడా తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

'గాంధీ'లో అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సుల విద్యార్థుల ధర్నా

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డితో ఎస్ఎఫ్ఐ నేతల చర్చలు పరిష్కారానికి హామీ



నవతెలంగాణ-బేగంపేట్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సుల విద్యార్థులు గురువారం గాంధీ మెడికల్ కళాశాలలో ధర్నా చేశారు. వీరికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నేతలు మాట్లాడుతూ.. గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాలలతో పాటు మరో 7 మెడికల్ కళాశాలల్లో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ 2023-2024 విద్యాసంవత్సరానికిగాను అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టిందని తెలిపారు. అయితే, ఏ సిలబస్ చదవాలి, పరీక్షలు ఎలా నిర్వహిస్తారనే విషయాలు ఏమీ విద్యార్థులకు చెప్పలేదన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు చెప్పే పాఠాలనే వీరికి చెప్పారన్నారు. కనీసం పరీక్షల ముందు కూడా ఎలాంటి సిలబస్ పెడతారో చెప్పకుండా నిర్వహించడం మూలంగా యూనివర్సిటీ పరిధిలో 866 మందికిగాను 25 మంది మాత్రమే పాసయ్యారని తెలిపారు. మిగతా విద్యార్థులు ఎందుకు ఫెయిలయ్యారో యూనివర్సిటీ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు నష్టపోకుండా గ్రేస్ మార్కులు కలిపి అందరినీ పాస్ చేయాలని కోరారు. కోర్సుల్లో పాస్ పర్సెంటేజ్ 50 శాతం కాకుండా 40 శాతానికి తగ్గించాలన్నారు. ఈ సంవత్సరం యూనివర్సిటీ అల్మనాక్ ప్రకటించి, స్పష్టతనిచ్చి పరీక్షలు నిర్వహించాలని కోరారు. ప్రతి విద్యార్థికీ న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే చలో హెల్త్ యూనివర్సిటీ నిర్వహిస్తామని హెచ్చరించారు. గాంధీ, ఉస్మానియా మెడికల్ కళాశాలల్లో సరైన వసతులు, తరగతి గదులు, హాస్టల్స్ సదుపాయాలు లేవని, వెంటనే సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ డా.రమేష్‌రెడ్డితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాల పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తామని.. మిగతావి యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, నాయకులు స్టాలిన్, శ్రీమాన్ అభిమన్యు, లక్ష్మణ్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

- మత విద్వేషాలు రెచ్చగొట్టి మోడీ మరోసారీ గద్దెనెక్కారు
- సీపీఐ(ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఆలిండియా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లక్షలాది మంది జీవితాలతో ఆడుకుంటున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ(ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆలిండియా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'నీట్ -యూజీ 2024' పరీక్షలో భారీ స్కాం జరిగిందని ఆధారాలతో సహా బయట పడ్డా కేంద్ర సర్కార్ తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. 67 మందికి 720 మార్కులకు గాను 720 మార్కులు ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు. పేపర్ లీకైందని ఆరోపణలు ఎదుర్కొంటున్న గుజరాత్, హర్యానా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కేసులు నమోదైనా కేంద్రం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతాంగ పోరాటానికి తలొగ్గి వ్యవసాయ ఉత్పత్తుల ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన మోడీ సర్కార్ ఇప్పటి వరకు ఆ హామీల అమలుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. గిట్టుబాటు ధరలపై పార్లమెంట్‌లో చట్టం తేవాలని డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా జులై 6న దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ కొత్తగా అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరారు. విధివిధానాల పేరుతో కాలయాపన చేయకుండా రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని సూచించారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలనీ, ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూంలను పేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు కెజి.రాంచందర్, కె.రమ, ఎం.హుస్సేన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సూర్యం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలి

- హైకోర్టులో వాదనలు

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా ప్రజాక్షేత్రంలో గెలిచి కాంగ్రెస్ చేరిన ఖైరతాబాద్, భద్రాచలం, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, కడియం శ్రీహరిలపై పార్టీ పిరాయింపుల చట్టం కింద చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్ వేసిన వ్యాజ్యాలను గురువారం హైకోర్ట విచారించింది. తదుపరి విచారణ జులై 3న చేస్తామని జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. సీనియర్ అడ్వొకేట్ సి. అర్యమ సుందరం వాదన చేయరాదని ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి కోరారు. అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. సుందరం వాదిస్తూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్పీకర్‌కు ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా స్పీకర్ చర్యలు తీసుకోవాలన్నారు. స్పీకర్‌కు గత మార్చి 18న ఫిర్యాదు చేశామని, ఆ తర్వాత నెల 10వ తేదీన హైకోర్టులో రిట్ పిటిషన్ వేశామని, ఇప్పటి వరకు స్పీకర్ పార్టీ పిరాయింపుదారులకు నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. స్పీకర్ స్థానంలో ఉన్న వాళ్లు రాజ్యాం విధులను నిర్వహించాలన్నారు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ అందినట్లు నిర్ధారణ అయిన 3 నెలలు దాటాకు కూడా నోటీసు ఇవ్వలేదన్నారు.

ఉప సభాపతి ఎన్నిక జరిగేనా ?

తుది నిర్ణయం స్పీకర్‌దే

- పట్టువీడని ప్రతిపక్షం

న్యూఢిల్లీ : లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ముగిసింది. ఇక ఇప్పుడు అందరి దృష్టీ ఉప సభాపతి పదవి పైనే కేంద్రీకృతమై ఉంది. దీనికోసం ప్రతిపక్షాలు మొదటి నుండీ పట్టుపడుతున్నాయి. అధికార ఎన్డీఏతో సంప్రదింపులు జరిపాయి. కానీ మోడీ ప్రభుత్వం ససేమిరా అనడంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్పీకర్ పదవికి పోటీ చేశాయి.

ఇప్పుడు మరోసారి డిప్యూటీ స్పీకర్ పదవిపై చర్చ మొదలైంది. పార్లమెంటరీ సంప్రదాయం మేరకు ఆ పదవి తమకు కేటాయించాలని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. స్పీకర్ పదవికి పోటీ పడిన సీనియర్ నేత కె.సురేష్‌నే ఉప సభాపతి పదవి కోసం బరిలో నిలపాలని యోచిస్తోంది. డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండానే 17వ లోక్‌సభ పదవీకాలం ముగిసింది. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఇదే వ్యూహాన్ని అనుసరించవచ్చునని ప్రతిపక్షం అనుమానం వ్యక్తం చేస్తోంది. ఒకవేళ డిప్యూటీ స్పీకర్ పదవికి ఎన్నిక జరిగితే ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నుండి అభ్యర్థిని పోటీకి నిలిపే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఉప సభాపతి పదవిపై స్పీకర్ కొద్ది రోజుల్లో ఓ నిర్ణయం తీసుకోవచ్చు. అసలు ఉప సభాపతి ఉండాలా అవసరం లేదా అనేది ఆయనే ముందుగా నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.



పోటీకి సై

ఇప్పటి వరకూ డిప్యూటీ స్పీకర్ పదవిపై ప్రతిపక్షాలతో చర్చలు జరపలేదని, దీనిపై ఓ నిర్ణయానికి వచ్చిన తర్వాతే ఎన్డీఏ-ఇండియా బ్లాక్ మధ్య సంప్రదింపులు జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ మాత్రం డిప్యూటీ స్పీకర్ పదవి కోసం పట్టు సడలించకూడదని నిర్ణయించుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 93ని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ప్రస్తావిస్తూ లోక్‌సభ సాధ్యమైనంత త్వరగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను ఎన్నుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఈ రెండు పదవుల్లో ఏదైనా ఒకటి ఖాళీ అయితే దానికి ఎన్నిక నిర్వహించాలని తెలిపారు.

అందువల్ల తాము ఉప సభాపతి పదవిని తప్పనిసరిగా కోరతామని అన్నారు. ఈ పదవికి బీజేపీ అభ్యర్థి పోటీ చేస్తారా లేక దాని మిత్రపక్షానికి చెందిన అభ్యర్థి పోటీ చేస్తారా అనే దానితో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

ఎందుకు ఓటింగ్ కోరలేదంటే...

స్పీకర్ ఎన్నిక కోసం ప్రతిపక్షం ఎందుకు ఓటింగుకు పట్టుబట్టలేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిపై జైరాం రమేష్ వివరణ ఇస్తూ 'ఓటింగ్ జరగాలని మేము ఎన్నడూ కోరుకోలేదు. ఓటింగ్ కోసం మేము ఎలాంటి వ్యూహాలు రూపొందించుకోలేదు. సూత్రప్రాయంగా పోటీ చేయాలన్నదే మా అభిమతం. ప్రతిపక్షాలకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలన్నదే మా డిమాండ్. అయితే ప్రభుత్వం అంగీకరించకపోవడంతో వాతావరణం వేడెక్కింది' అని చెప్పారు. కాగా స్పీకర్ ఎన్నిక ముగిసిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ నేత కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ తాము ఓటింగ్‌కు డిమాండ్ చేశామని, కానీ ప్రభుత్వం అంగీకరించలేదని తెలిపారు. పార్లమెంట్ లోపల ప్రతిపక్షాల గొంతుక కూడా వినాలని ప్రభుత్వానికి సందేశం ఇచ్చేందుకే పోటీ చేశామని ఇండియా కూటమి భాగస్వామ్యపక్షమైన ఆర్ఎస్పీ తెలిపింది. ఈ విషయాన్ని మరింత ముందుకు తీసికెళ్లే ఉద్దేశమేదీ తమకు లేదని ఆ పార్టీ నేత ప్రేమచంద్రన్ చెప్పారు. ప్రతిపక్షాలు ఓటింగ్‌కు పట్టుపట్టలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు.

నిర్దిష్ట గడువేదీ లేదు

ఉప సభాపతి ఎంపికకు సంబంధించి నిర్దిష్టమైన గడువు ఏదీ లేదు. 12వ లోక్‌సభలో ఈ పదవికి పద్మనాథ్ మహమ్మద్ సయీద్‌ను ఎంపిక చేయడానికి 270 రోజుల సమయం తీసుకున్నారు. 11వ లోక్‌సభలో సూరజ్ భాన్‌ను ఎన్నుకోవడానికి 52 రోజులు పట్టింది. 14వ లోక్‌సభలో చరణ్‌జిత్ సింగ్ అతావల్, 15వ లోక్‌సభలో కరియా ముండాను ఎన్నుకోవడానికి కేవలం ఏడు రోజుల సమయం మాత్రమే తీసుకున్నారు. 2014లో తంబిదురైని 71 రోజుల తర్వాత ఉప సభాపతిగా ఎన్నుకున్నారు.



రాహుల్ చేతిలో రెడ్ బుక్

ఎన్నికల ప్రచారం నుంచి లోక్‌సభలో ప్రమాణం వరకూ బుల్లి రాజ్యాంగం

- ఈ పుస్తకం ప్రింటింగ్ వెనుక !

న్యూఢిల్లీ : మన రాజ్యాంగం గురించి వినే ఉంటాం. అంబేద్కర్ రచించినదని చెప్పుకుంటుంటాం. అయితే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ... చేతిలో బుల్లి రాజ్యాంగంతో ప్రత్యక్షమయ్యారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం నుంచి లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేసే వరకూ ఆ రెడ్‌బుక్ ఆయన చేతిలోనే ఉంది. దేశప్రజలంతా ఆ పుస్తకాన్ని చూడడం ఇదే మొదటిసారి.

ఈ రాజ్యాంగ పుస్తకాలను రాహుల్ గాంధీ పలువురికి అందజేశారు కూడా. మోడీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేయడం ఖాయమంటూ తన చేతిలో ఉన్న పుస్తకాన్ని చూపుతూ ప్రచారం చేశారు. ప్రతిపక్షాలన్నీ కూడా దీన్ని ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చుకున్నాయి. అయితే ఈ బుల్లి రాజ్యాంగానికి లక్నోతో ప్రత్యక్ష సంబంధం ఉంది.

లక్నోకు చెందిన ఈస్టర్న్ బుక్ కంపెనీ (ఈబీసీ) ప్రచురించిన ఈ లెదర్‌తో కప్పబడిన ఈ ఎరుపు పుస్తకం పాకెట్ ఎడిషన్ మేధో సంపత్తి హక్కులను పొందింది. అంటే పుస్తకం పరిమాణం, శైలి, రంగు, ఫాంట్ కాపీ చేయబడదు. ఇది ప్రపంచంలోని అనేక లైబ్రరీలలో కూడా ఉంది. రాజ్యాంగం యొక్క 624 పేజీల పాకెట్ ఎడిషన్ 'బైబిల్ పేపర్'పై ముద్రించబడింది. ఈ పాకెట్ పరిమాణం పొడవు 20 సెం.మీ కాగా వెడల్పు 9 సెం.మీ.

బైబిల్ పేపర్‌పై ముద్రణ


అంతర్జాతీయ నాణ్యత, ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీపడకుండా జేబులో పట్టే సైజులో 624 పేజీల ఈ పుస్తకాన్ని ముద్రించడం తమకు సవాల్‌గా మారినట్టు ఈస్టర్న్ బుక్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ సుధీర్ కుమార్ చెప్పారు. ఇందుకోసం ఆ సంస్థ పరిశోధనల అనంతరం బైబిల్ పేపర్‌పై ముద్రించింది. చాలా చక్కని పేజీలు ఉన్నప్పటికీ, ఇది బలంగా ఉంది. అలాగే, ద్విపార్శ్వ ముద్రణలో ముద్రించిన పదాలు ఇతర వైపు నుండి చూడవు. ఎనిమిది లక్షలకు పైగా పదాలతో కూడిన ఈ పుస్తకాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా బైబిల్ వంటి మందపాటి కాగితంపై ముద్రించారు.

ఈస్టర్న్ బుక్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ... "రాజ్యాంగం యొక్క ఈ పాకెట్ ఎడిషన్‌కు ఈబీసీ మాత్రమే ప్రచురణకర్త. గత మూడు నెలల్లో దాదాపు 5000 కాపీలు అమ్ముడయ్యాయి. దీని మొదటి ఎడిషన్ 2009 సంవత్సరంలో ప్రచురించ బడింది. అప్పటి నుంచి 16 సంచికలు ప్రచురించబడ్డాయి. దీని ముందుమాటను మాజీ అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ రాశారు. అందమైన, ప్రామాణికమైన ఈ రాజ్యాంగ పుస్తకం ప్రతి భారతీయుడి జేబులో ఉండాలి" అని అన్నారు.

ఉద్యోగాలకు ఎసరు

ప్రత్యామ్నాయ ఇంధన వనరులతో ఇబ్బందులు

న్యూఢిల్లీ : బొగ్గుకు బదులుగా ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగిస్తుండడంతో వేలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. మరోవైపు ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. బొగ్గుపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని ప్రభుత్వం చాలా కాలంగా భావిస్తోంది. ఫలితంగా బొగ్గు గనులపైనే ఆధారపడిన సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ పరిణామం ఆర్థిక అస్థిరత్వానికి దారితీయడం ఆందోళన కలిగిస్తోంది.



బొగ్గు గనుల్లో దీర్ఘకాలం పని చేసే కార్మికులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, చర్మ వ్యాధులకు గురవుతున్నారని నేషనల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఐ) తాజా అధ్యయనం తెలిపింది. అయితే బొగ్గుకు బదులు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లడం వల్ల కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికులు, వాటిపై ఆధారపడి జీవించే వారు ఉపాధిని కోల్పోయి వీధిన పడుతున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతులకు చెందిన వారిపై తీవ్రమైన ప్రభావం పడుతోంది.

ఆరోగ్య సమస్యలూ వస్తున్నాయి

ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పత్తి కారణంగా 41.5 శాతం ఓబీసీ కుటుంబాలు, 23 శాతం ఎస్టీ కుటుంబాలు, 17 శాతం ఎస్సీ కుటుంబాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయని ఎన్ఎఫ్ఐ అధ్యయనం చెప్పింది.

ఆయా వర్గాల ప్రజలు ఇప్పటికే సమాజంలో అనేక అవరోధాలు ఎదుర్కొంటున్నారు. వారిలో నిరక్షరాస్యుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. వారి పిల్లల్లో చాలా మంది ప్రాథమిక విద్య దశను దాటలేకపోతున్నారు. పారిశ్రామికాభివృద్ధి జరిగిన ప్రాంతాలతో పోలిస్తే బొగ్గు ఉత్పత్తిపై ఎక్కువగా ఆధారపడుతున్న ప్రాంతాల్లో ప్రజల ఆదాయం తక్కువగా ఉంటోందని ఎన్ఎఫ్ఐ అధ్యయన సహ రచయిత పూజా గుప్తా తెలిపారు. బొగ్గు గనులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధిని చూపాలని, పర్యావరణ పునరుద్ధరణపై దృష్టి సారించాలని, బొగ్గు గనుల తవ్వకంపై ఆధారపడిన వారందరూ ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మళ్లేలా మార్గం సుగమం చేయాలని అధ్యయనం సూచించింది.

భారత్‌లో కష్టాల్లో టీవీ, రేడియో పరిశ్రమలు

- సమస్యను ట్రాయ్ పరిష్కరించాలి : నిపుణులు

న్యూఢిల్లీ : టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) ఇటీవల జాతీయ ప్రసార విధానంపై సిఫారసులను ప్రచురించింది. టీవీ ప్రసార పరిశ్రమకు మౌలిక సదుపాయాల హోదా కల్పించడం వంటి దీర్ఘకాల పరిశ్రమ డిమాండ్లను అంగీకరించింది. ఈ సిఫారసులు వ్యూహాత్మక రంగాలపై పరిశ్రమ వీక్షణలకు అనుగుణంగా ఉన్నప్పటికీ, వారసత్వ మీడియాను (లెగసీ మీడియా) అతిగా నియంత్రించటం, మరింత సమకాలీన ఆన్‌లైన్ స్ట్రీమింగ్ మార్కెట్‌లో పాత నిబంధనలను పరిష్కరించటంలో అవి విఫలమవుతున్నాయి. పర్యవసానంగా, మీడియా క్షీణతను తగ్గించటం, ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌ను ముందుకు తీసుకెళ్లటంలో వారు విఫలమయ్యే అవకాశం ఉన్నదని నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సంప్రదింపులు జరిపినా ప్రసారం కోసం ప్రత్యేక విధాన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించటానికి ట్రాయ్ వాటాదారుల నుంచి ఇన్‌పుట్‌లను కోరింది. టీవీ, రేడియో పరిశ్రమలను 'లెగసీ బ్రాడ్‌కాస్ట్ మీడియా' అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి నుంచి ఇది కోలుకోలేదు. 2020 నుంచి 2022 వరకు, చెల్లింపు చందాదారులు 13 కోట్ల నుంచి 12 కోట్లకు పడిపోయారు.

గాజాలో 24 గంటల్లో 47మంది పాలస్తీనియన్ల మృతి


- సుజయె ప్రాంతాన్ని ఖాళీ చేయాలని మిలటరీ ఆదేశాలు
- ఎటువైపు వెళ్ళాలో దిక్కు తోచని స్థితిలో ప్రజలు

గాజా : గాజాలో ఇజ్రాయిల్ సైన్యం సాగిస్తున్న దాడుల్లో గత 24గంటల్లో 47మంది పాలస్తీనియన్లు మరణించారు. 52మంది గాయపడ్డారు. తాజాగా గాజా నగరంలోని సుజయె ప్రాంతం నుండి ప్రజలను తక్షణమే ఖాళీ చేయాల్సిందిగా సైన్యం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అక్కడ గల పాలస్తీనా కుటుంబాలు ఎక్కడకు వెళ్ళాలో దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఇప్పటికే ఇజ్రాయిల్ ట్యాంకులు సుజయె ప్రాంతంలోకి వచ్చేశాయని, పారిపోతున్న ప్రజలపై భీకరంగా దాడులకు దిగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గత రాత్రంతా ఈ ప్రాంతంపై బాంబు దాడులు కొనసాగాయి. దాంతో గాయపడిన వారిని ఆస్పత్రులకు తీసుకెళ్ళేందుకు కూడా సహాయక సిబ్బందికి సాధ్యం కాలేదని పాలస్తీనా వర్గాలు చెప్పాయి. ఒకపక్క సరైన ఆహారం లేక కరువుతో అల్లాడుతుంటే మరోపక్క ట్యాంకులు, విమానాలతో ఇలా ప్రజలను వేటాడుతున్నారని, ఈ యుద్ధం ముగిసే ఆశ కను చూపు మేరలో కనబడడం లేదని స్థానికుడు ఒకరు వ్యాఖ్యానించారు. అత్యంత ప్రమాదకరమైన యుద్ధ జోన్‌గా సుజయె మారబోతోం దంటూ తక్షణమే ఖాళీ చేయాలని సైన్యం నుండి ఆదేశాలు వచ్చాయి. ఏ ఏ ప్రాంతాలు ప్రమాదకరంగా మారతాయో తెలియచేస్తూ ఇజ్రాయిల్ ఆర్మీ ఒక మ్యాప్‌ను కూడా ప్రచురించింది. దాంతో కుటుంబాలకు కుటుంబాలు గాజా దక్షిణ ప్రాతానికి తరలి వెళుతున్నాయి. దాడులు ప్రారంభమైన తొలినాళ్ళలో ఇజ్రాయిల్ మిలటరీ సుజయె ప్రాంతం నుండే పనిచేసేది. తిరిగి కొత్త ఆపరేషన్లను ఇక్కడ నుండి ప్రారంభిం చాలని మిలటరీ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటివరకు గాజాలో 37,765 మంది మరణించగా, 86,429మంది మరణించారు. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ దాడుల్లో కనిపించ కుండా పోయిన వేలాది మంది పిల్లల మృతదేహాలు ఆ శిధిలాల కిందే సమాధి అయి పోయాయని యునిసెఫ్ డిప్యూటీ చీఫ్ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి తెలియచేశారు.

భారత్ హిందూ రాష్ట్రం కాదు

ఎన్నికల ఫలితాలు దీనినే స్పష్టం చేశాయి

- ధనికులు, పేదల మధ్య అంతరం పెరుగుతోంది
- ఈ క్యాబినెట్ పాత దానికి నకలే
- విచారణ లేకుండానే జైళ్లలో నిర్బంధం
- భారతీయ గుర్తింపును నిర్లక్ష్యం చేస్తున్నారు : నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్



కొల్‌కతా : భారతదేశం 'హిందూ రాష్ట్రం' కాదని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిరూపించాయని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ వ్యాఖ్యానించారు. విచారణ జరపకుండా ప్రజలను కటకటాల వెనుక ఉంచడం బ్రిటీష్ కాలం నుండీ కొనసాగుతోందని, కాంగ్రెస్ పాలనలో కంటే బీజేపీ ప్రభుత్వ హయాంలోనే ఈ ధోరణి అధికంగా ఉన్నదని ఆయన చెప్పారు. కొల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆయన ఓ బెంగాలీ న్యూస్ ఛానల్ ప్రతినిధితో మాట్లాడారు. 90 సంవత్సరాల వయసు కలిగిన ఆర్థికవేత్త అమర్త్యసేన్ బుధవారం సాయంత్రం అమెరికా నుండి కొల్‌కతా వచ్చారు. 'ఎన్నికలు జరిగిన ప్రతిసారీ మార్పు కన్పించాలని మనం కోరుకుంటాం. బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో విచారణ లేకుండా ప్రజలను జైళ్లలో నిర్బంధించడాన్ని మనం చూశాం. ధనికులు, పేదల మధ్య అంతరం పెరిగిపోయింది. అది ఇప్పుడు మరింత పెరిగింది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది' అని అమర్త్య తెలిపారు. భారత్ లౌకిక దేశమని, దీనికి లౌకిక రాజ్యాంగం ఉన్నదని, కాబట్టి దేనినైనా అంగీకరించే రాజకీయ లక్షణం ఉండాలని ఆయన అన్నారు. భారత్‌ను హిందూ రాష్ట్రంగా మార్చాలన్న ఆలోచన సరైంది కాదని అమర్త్య అభిప్రాయపడ్డారు. కేంద్రంలో కొత్తగా ఏర్పడిన క్యాబినెట్ పాత మంత్రి మండలికి నకలేనని అమర్త్యసేన్ వ్యాఖ్యానించారు. 'మంత్రులు అవే శాఖల్లో కొనసాగుతున్నారు. కొద్దిపాటి మార్పులు మినహా రాజకీయంగా శక్తివంతులైన వారు ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నారు' అని చెప్పారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను అమర్త్య గుర్తు చేసుకుంటూ అప్పుడు బ్రిటీష్ పాలనలో ఎలాంటి విచారణలు జరపకుండానే ప్రజలను కారాగారాల్లో బంధించే వారని తెలిపారు. 'నేను యువకుడిగా ఉన్నప్పుడు నా బంధువులు అనేక మంది ఎలాంటి విచారణను ఎదుర్కోకుండానే జైలుకు వెళ్లారు. స్వేచ్ఛావాయువులు పీల్చుకున్న దేశంలో ఇలా జరగకూడదని మేము ఆశించాం. అయితే ఈ ధోరణిని అడ్డుకోవడంలో విఫలమైన నాటి కాంగ్రెస్‌ను కూడా నిందించాల్సి ఉంటుంది. వారు దానిని మార్చలేకపోయారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఇది మరింతగా ప్రబలిపోయింది' అని వివరించారు. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించినప్పటికీ ఫైజాబాద్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ కోల్పోవడంపై అమర్త్య మాట్లాడుతూ దేశం యొక్క నిజమైన గుర్తింపును మరుగుపరచేందుకు ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. 'భారత్‌ను హిందూ రాష్ట్రంగా చిత్రీకరించేందుకు బాగా డబ్బు ఖర్చు చేసి రామమందిరాన్ని నిర్మించడం మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాకూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లు జన్మించిన ఈ దేశంలో జరిగి ఉండకూడదు. నిజమైన భారతీయ గుర్తింపును నిర్లక్ష్యం చేసేందుకు జరిగిన ప్రయత్నంగా దీనిని భావించాలి. దీనిని మార్చాల్సి ఉంది' అని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని, ప్రాథమిక విద్య, ప్రాథమిక ఆరోగ్య రక్షణ వంటి రంగాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అమర్త్యసేన్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఐదేండ్లు గడిచినా.. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో మోడీ సర్కారు విఫలం

న్యూఢిల్లీ: మోడీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో విఫలమైంది. ఐదేండ్లు గడిచినా ఇంకా పూర్తి కావటానికి గడువు లేకుండా ప్రణాళికా దశలోనే ఉన్నదని ఒక ఆంగ్ల వార్త కథనం వెల్లడించింది. రూ. 13,500 కోట్ల ప్రాజెక్ట్‌లో ఎక్కువ భాగం ప్రారంభ ప్రణాళిక ప్రకారం మార్చి 2024 నాటికి పూర్తి కావాల్సి ఉన్నది. అయితే దాని పూర్తి తేదీ 2027 తర్వాత పొడిగించవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్రం నిర్దేశించిన "కఠినమైన సమయపాలన" ప్రకారం.. కొత్త పార్లమెంటు భవనం నిర్మాణం, సెంట్రల్ విస్టా అవెన్యూని పునరుద్ధరించటం, కామన్ సెంట్రల్ సెక్రెటేరియట్ (6 అంతస్తులతో కూడిన 10 భవనాల సెట్) నిర్మాణం (51 కేంద్ర మంత్రిత్వ శాఖల ఉద్యోగుల కోసం ఆధునిక కార్యాలయ స్థలాలు) మార్చి 2024 నాటికి పూర్తి చేయాలని గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అక్టోబర్ 2019లో ఒక ప్రకటనలో ఆదేశించింది. ప్రతిపాదిత సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రధానమంత్రి నివాస సముదాయం, ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్, ఉప రాష్ట్రపతికి అధికారిక నివాసం ఉన్నాయి. అదే సమయంలో, ఈ ఏడాది మార్చిలో ప్రారంభమైన సీసీఎస్ 10 (10 భవనాలలో ఒకటి) పనులు టెండర్ డాక్యుమెంట్ ప్రకారం జూన్ 2026 నాటికి పూర్తవుతాయని తెలుస్తున్నది. "మొత్తం పనిలో దాదాపు 45-50 శాతం వచ్చే ఏడాదికి పూర్తయ్యే అవకాశం ఉన్నది. ప్రాజెక్ట్ చాలా పెద్దది. భూమి పరిస్థితి, అవసరానికి అనుగుణంగా ప్రణాళికను మార్చవలసి ఉంటుంది. ప్రణాళిక ఇంకా అభివృద్ధి చెందుతున్నది" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ముస్లింలపై విద్వేషపూరిత మతోన్మాద దాడుల్ని అరికట్టాలి

నిరసనలకు సీపీఐ(ఎం) పిలుపు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి దేశంలో పలు ప్రాంతాల్లో ముస్లింలపై ఏక రీతిన పెద్దయెత్తున జరుగుతున్న దాడులను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఎద్దులను రవాణా చేస్తున్న ముగ్గురు ముస్లిం యువకులను ఆవుల స్మగ్లర్లుగా ముద్ర వేసి గో గూండాలు కొట్టి చంపేశారు.. అలీగఢ్‌లో దొంగతనం చేశాడన్న ఆరోపణలపై ఓ ముస్లింను ఇదే విధంగా కొట్టి చంపేశారు.

మధ్యప్రదేశ్‌లోని మండాలాలో ఫ్రిజ్‌లో గొడ్డు మాంసం ఉన్నట్లు వార్తలు వచ్చిన 24 గంటల్లోనే ముస్లింలకు చెందిన 11 ఇళ్లుధ్వంసం చేశారు.

లక్నోలో ముస్లింలు ఎక్కువగా వుండే అక్బర్‌నగర్‌లో రివర్ ఫ్రంట్ నిర్మాణం పేరుతో ఇండ్లను బుల్డోజర్లతో కూల్చేయడంతో వెయ్యి కుటుంబాల దాకా



వీధిపపడ్డాయి.. గుజరాత్ వడోదరలో ముఖ్యమంత్రి గృహ నిర్మాణ పథకం కింద అల్పాదాయ వర్గ గృహ సముదాయంలో ముస్లిం మహిళకు ఫ్లాట్ కేటాయించినందుకు ఆ దగ్గరలో ఉన్న హిందువులు బహిరంగంగానే నిరసన తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని నహన్‌లో . ఈద్ అల్ అదా సందర్భంగా ఆవును బలి ఇచ్చారని ఆరోపిస్తూ ముస్లింల దుకాణాన్ని లూటీ చేసి, ధ్వంసం చేశారు. గో వధకు పాల్పడ్డారంటూ కేసు కూడా పెట్టారు ఈ విధంగా 16 మంది షాపు యజమానులు బలవంతంగా దుకాణాలు వీడి పారిపోయేలా చేశారు.. ఢిల్లీలోని సంగమ్ విహార్‌లో ఓ ప్రార్థనా స్థలానికి సమీపంలో గో కళేబరం దొరికిందంటూ హిందూత్వ సంస్థల సభ్యులు ఉన్మాదపూరిత ప్రసంగాలు చేయడంతో అక్కడ నివాసం వుంటున్న వారు భయంతో పారిపోతున్నట్లు వార్తలొచ్చాయి. . ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బలు తగిలినప్పటి నుంచి మతోన్మాద దాడులు మరింత ముమ్మరమయ్యాయి.. . బీజేపీ, హిందూత్వ మతోన్మాద శక్తులు మతపరమైన సమీకరణ కోసం ఉన్మత్తపూరిత దాడులతో పేట్రేగి పోతున్నాయి. ఈ మీతోన్మాద శక్తుల కుతం త్రాలు, కుటిల పన్నాగాల పట్ల అత్యంత అప్రమత్తంగా వుండాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తన అన్ని శాఖలకు పిలుపు నిచ్చింది. వాతావరణాన్ని చెడగొట్టేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేసే ఇటువంటి విషపూరితమైన దాడులకు, చేష్టలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పొలిట్‌బ్యూరో కోరింది.

మైనారిటీలపై పెరుగుతున్న ద్వేషపూరిత ప్రసంగాలు

- భారత్‌లోని పరిస్థితులపై యూఎస్ సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ ఆందోళన

న్యూఢిల్లీ : భారత్‌లోని మైనారిటీల పట్ల అనుసరిస్తున్న విధానాల పట్ల యూఎస్ సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ వర్గానికి వ్యతిరేకంగా మత మార్పిడి నిరోధక చట్టాలు, ద్వేషపూరిత ప్రసంగాలు, గృహాలు, ప్రార్థనా స్థలాల కూల్చివేతలలో పెరుగుదల ఉన్నదని ఆయన అన్నారు. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై వార్షిక స్టేట్ డిపార్ట్‌మెంట్ నివేదికను విడుదల చేసిన సందర్భంగా బ్లింకెన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కూడా మత స్వేచ్ఛను రక్షించటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని అన్నారు. "భారత్‌లో మత మార్పిడి నిరోధక చట్టాలు, ద్వేషపూరిత ప్రసంగాలు, మైనారిటీ విశ్వాస వర్గాల సభ్యుల గృహాలు, ప్రార్థనా స్థలాల కూల్చివేతలకు సంబంధించిన పెరుగుదలను చూస్తున్నాం. అదే సమయంలో,



ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కూడా మత స్వేచ్ఛను రక్షించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు" అని ఆయన అన్నారు. "దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలలో 10 రాష్ట్రాలు అన్ని మతాలకు సంబంధించి మత మార్పిడులను నియంత్రించే చట్టాలను కలిగి ఉన్నాయి.


వీటిలో కొన్ని రాష్ట్రాలు వివాహం కోసం బలవంతపు మత మార్పిడులకు వ్యతిరేకంగా ప్రత్యేకంగా జరిమానాలు విధిస్తున్నాయి" అని అంతర్జాతీయ మత స్వేచ్ఛపై 2023 నివేదిక భారత్‌లోని పరిస్థితులపై పేర్కొన్నది. మతపరమైన మైనారిటీ గ్రూపులకు చెందిన కొందరు సభ్యులు హింస నుంచి వారిని రక్షించటానికి, మతపరమైన మైనారిటీ సమూహాల సభ్యులపై నేరాలను పరిశోధించటానికి, వారి మతం, విశ్వాస స్వేచ్ఛను రక్షించటానికి ప్రభుత్వ సామర్థ్యాన్ని, సుముఖతను సవాలు చేశారు.

సంపాదకీయం

అసాంజే - ముగింపు కాదు, ఆరంభం!

వికీలీక్స్ సంస్థ స్థాపకుడు, అమెరికా వంచన, దుర్మార్గాలను సాధికారికంగా బయటపెట్టి పెను సంచలనం సృష్టించిన జూలియన్ అసాంజే పద్నాలుగు సంవత్సరాల తరువాత ప్రవాసం, నిర్బంధం నుంచి విడుదలయ్యాడు. ఇది హర్షించాల్సిన పరిణామం. అమెరికా సర్కార్‌తో కుదిరిన రాజీలో భాగంగా తన మీద మోపిన గూఢచర్య నేరారోపణను అసాంజే అంగీకరించాడు. దానికి గాను ఐదేండ్ల జైలు శిక్షను విధించారు. అయితే బ్రిటన్‌లో ఇప్పటికే అంతకంటే ఎక్కువ కాలం జైల్లో ఉన్నందున శిక్షా కాలం పూర్తయినట్లు పరిగణించి వెంటనే విడుదల చేశారు. మాతృభూమి ఆస్ట్రేలియా గడ్డ మీద అడుగు పెట్టాడు. చీమకూడా చొరరాని, గాలి శబ్దాన్ని కూడా పసిగట్టి పహారా కాసే ఏర్పాట్లున్న అమెరికా నిఘా యంత్రాంగం నుంచి కూడా మిలియన్ల కొద్దీ రహస్య ఫైళ్లను కూడా జర్నలిస్టులు తలచుకొంటే ఎలా సంపాదించగలరో ప్రపంచానికి చాటాడు. అసాంజే చేయని నేరాన్ని అంగీకరించటం ద్వారా లొంగిపోయి విడుదలయ్యాడని కొందరు భావిస్తుండగా ఆస్ట్రేలియా ప్రభుత్వం ఒక యోధుడిగా స్వాగతం పలికింది. అతనేమీ వీరుడు కాదు, క్షమాభిక్ష, రాజీ ద్వారా విడుదలైన ఒక సామాన్యుడు అన్నవారు, అసాంజే రాజీపడ్డాడు తప్ప లొంగిపోలేదనే అభిప్రాయం కూడా ఉంది.

> అసాంజేను విడుదల చేయాల్సిందిగా ఐరోపాతో సహా అనేక దేశాలు, సంస్థల నుంచి అమెరికా ప్రభుత్వం నానాటికీ ఒత్తిడి పెరుగుతున్న పూర్వరంగంలో జో బైడెన్ రాజీకి అంగీకరించాల్సి వచ్చింది. అసాంజే ప్రస్తావన వచ్చినపుడల్లా అమెరికా ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడిందా? అని నూతన తరాలు తెలుసుకొనేందుకు తోడ్పడింది. అది మరింత నష్టదాయకంగా మారింది. రెండవది రహస్యం అన్న పత్రాలను ముద్రించినందున లేదా ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో ఉంచినందున జరిగిన నష్టం ఏమిటో రుజువు చేసేందుకు అమెరికా వద్ద ఎలాంటి సాక్ష్యాలు లేవు. కేసును విచారించిన న్యాయమూర్తి కూడా అదే చెప్పాడు.




తొలుత తన మీద నేరం మోపిన అమెరికాలోని వర్జీనియాలో కాకుండా అమెరికా కామన్‌వెల్త్‌లోని పశ్చిమ పసిఫిక్ సముద్రంలోని ఉత్తర మరియానా దీవుల్లో తనపై విచారణ జరపాలని అసాంజే విధించిన షరతును జో బైడెన్ సర్కార్ అంగీకరించింది. తద్వారా తాను అమెరికా గడ్డమీద కాలుమోపననే మాటను నెగ్గించుకున్నాడు. అసాంజే చర్యల వలన ఎందరికో ముప్పు ఏర్పడిందని, ఎంతో నష్టం జరిగిందని, అతనికి 175 సంవత్సరాల శిక్ష పడుతుందని ఊరూ వాడా నానా యాగిచేసిన అమెరికా చివరకు నేరం చేసినట్లు అంగీకరిస్తే చాలు వదిలేస్తామని చెప్పింది. ఈ ఉదంతాన్ని మరోసారి అధ్యక్ష పదవికి పోటీపడుతున్న డోనాల్డ్ ట్రంప్ ఎలా ఉపయోగించుకుంటాడో చూడాల్సి ఉంది. ఈ ఉదంతంలో ఎవరికి తోచిన భాష్యం వారు చెప్పటానికి అవసరమైన అంశాలు ఉన్నాయి. ప్రపంచంలో రాజీపడిన అనేక ఉదంతాల్లో ఇది ఒకటి. రాజీ పడిన ప్రతిదీ తప్పు కాదని చరిత్ర రుజువు చేసింది. అందువలన వాటిని పరిగణనలోకి తీసుకోవటం తప్ప అంతకు మించి ఆలోచించాల్సిన అవసరం లేదు.

ప్రపంచంలో అనేక మంది జర్నలిస్టులు సంచలనాత్మక అంశాలను బయటపెట్టారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు. నిజానికి వారి వెనుక ఎందరో ఉన్నారు. అలాంటి వారికి విశ్వాసం కలిగించటమే సదరు జర్నలిస్టుల ప్రత్యేకత అని చెప్పక తప్పదు. చెల్సియా మానింగ్ అనేక అమెరికా మిలిటరీ అధికారిణి ద్వారా రహస్య పత్రాలు అసాంజే ఆధ్వర్యంలోని సంస్థకు చేరాయి. ఈ అంశం వెలుగులోకి వచ్చిన తరువాత ఆమె మీద కేసులు మోపి 35 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తే అధ్యక్షుడిగా బరాక్ ఒబామా దాన్ని ఏడు సంవత్సరాలకు తగ్గించటంతో 2017లో జైలు నుంచి విడుదలైంది. తరువాత ఏడాది పాటు జైలు శిక్ష, జరిమాన చెల్లించటానికి సిద్ధపడింది తప్ప అసాంజేకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పేందుకు ఆమె నిరాకరించింది. అసాంజేను విడుదల చేయాల్సిందిగా ఐరోపాతో సహా అనేక దేశాలు, సంస్థల నుంచి అమెరికా ప్రభుత్వం నానాటికీ ఒత్తిడి పెరుగుతున్న పూర్వరంగంలో జో బైడెన్ రాజీకి అంగీకరించాల్సి వచ్చింది. అసాంజే ప్రస్తావన వచ్చినపుడల్లా అమెరికా ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడిందా? అని నూతన తరాలు తెలుసుకొనేందుకు తోడ్పడింది. అది మరింత నష్టదాయకంగా మారింది. రెండవది రహస్యం అన్న పత్రాలను ముద్రించినందున లేదా ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో ఉంచినందున జరిగిన నష్టం ఏమిటో రుజువు చేసేందుకు అమెరికా వద్ద ఎలాంటి సాక్ష్యాలు లేవు. కేసును విచారించిన న్యాయమూర్తి కూడా అదే చెప్పాడు.

తన భర్త కేసుకు సంబంధించిన వివరాలను సమాచార స్వేచ్ఛ హక్కు కింద అమెరికా నుంచి సంపాదించి లోకానికి వెల్లడించాల్సిందిగా అసాంజే సతీమణి స్టెల్లా యావత్ జర్నలిస్టులకు విజ్ఞప్తి చేసింది. కేసు నడిచినంత కాలం భర్తతో పాటు నిలిచిన ధీరవనితగా ఆమె చరిత్రకెక్కినందుకు అమెను అభినందించాల్సిందే. తన భర్త నేరాన్ని అంగీకరించారంటే దాని అర్థం జర్నలిజానికి కట్టుబడి ఉన్నందుకే అన్నారు. ఈ కేసులో జర్నలిజాన్ని ఒక నేరంగా మార్చింది, వార్తల సేకరణ, ప్రచురణను నేరంగా పరిగణించిందన్న వాస్తవాన్ని గ్రహించి కేసు తీరుతెన్నులను బహిర్గత పరచాలని ఆమె విజ్ఞప్తి చేసింది. అసాంజే ఉదంతంతో పరిశోధనాత్మక జర్నలిజం ఆగదు, తమ పాలకుల దుర్మార్గాలను వెల్లడించాలని చిత్తశుద్ధితో కోరుకొనేవారికీ కొదవ ఉండదు. అదేమీ దేశద్రోహం కాదు, ప్రజల పక్షాన నిలవటమే. ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దారుణాలను వికీలీక్స్ బయటపెట్టింది. తరువాత సాగిన వాటిని వెలువరించేందుకు ప్రతి ఒక్క జర్నలిస్టూ అసాంజేగా మారాల్సిన అవసరం ఉంది.

రామాయణంలో బుద్ధుణ్ణి ఎందుకు తిట్టారు?



డాక్టర్ దేవరాజు మహారాజు

ఉత్తర భారతదేశంలోని ఖుషీనగర్ సమీపంలో సాధారణ శకానికి ముందు 483 లేదా 400 BCEలో బుద్ధుడు తన ఎనభయ్యవ యేట మహా పరినిర్వాణం చెందాడు. ప్రస్తుతం ఇది ఉత్తర ప్రదేశ్‌లోని గోరక్‌పూర్ జిల్లాలో ఉంది. అక్కడ ఆయన స్మృతి చిహ్నంగా పడుకుని ఉన్న బుద్ధ విగ్రహం ఏర్పాటు చేశారు. తర్వాత కాలంలో ఆ విగ్రహం స్ఫూర్తితోనే పాలకడలిలో విష్ణుమూర్తి పవళించి, ఉండడాన్ని రూపొందించుకున్నారు. ఒక్కొక్కటిగా 'అవతారాల'న్నీ ఆ తర్వాతే వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా ఉన్న బుద్ధ విగ్రహాల్ని మార్చి మార్చి, హిందూ దేవుళ్లను చేసుకున్న విషయాలు తేట తెల్లమయ్యాయి. అయ్యప్ప అయినా, బాలాజీ అయినా, పండరినాథుడైనా - నాశనం చేసిన బుద్ధ విగ్రహాలే! బౌద్ధారామాల్ని మార్చి ఆలయాలు చేసుకున్న ఘన చరిత్ర దాచేస్తే దాగేది కాదు గదా? ఈ విషయాల్ని దేశ ప్రజలు గుర్తించారు. గుర్తుంచుకున్నారు. ప్రతి విషయాన్ని ఆ కోణంలో విశ్లేషిస్తున్నారు. సృష్టి జరిగినప్పుడే ఆ దేవ దేవుడు దిగి వచ్చి వేదాలు, పురాణాలు, పవిత్ర గ్రంథాలు అన్నీ మనిషికి ఇచ్చి వెళ్ళాడు - అనేది అబద్ధమని తేలిపోయింది. బౌద్ధ సాహిత్యంలో హిందూ దేవీ దేవతల్ని దూషించడం లేదు. హిందువుల పవిత్ర గ్రంథం రామాయణంలో బుద్ధుణ్ణి దూషించడం ఉంది. అంటే హిందువుల రామాయణ రచనకు ముందే బుద్ధుడు ఈ నేల మీద పుట్టి, బుద్ధిజాన్ని ప్రచారం చేశాడనీ ఒప్పుకున్నట్టే కదా? కుట్రలు, దొంగతనాలు తప్పక బయటపడతాయి.

అసలు రాముడు ముందుగా బోధిసత్వుడైనప్పుడు, రామాయణంలో మళ్లీ బుద్ధుణ్ణి తిట్టాల్సిన అవసరమేమొచ్చింది? - అనేది ప్రశ్న! అయితే జవాబు సులభంగా దొరకదు, కొంచెం లోతుగా పరిశీలించాలి. కలుషితమై ఉన్న మెదళ్లను శుభ్రం చేసుకుని, కొత్తగా ఆలోచిస్తేనే విషయం బోధపడుతుంది! జంబూ ద్వీపమని పిలవబడ్డ ఈ భరతఖండంలో సమ్యక్ సభ్యత వర్ధిల్లుతూ ఉండేది. తర్వాత క్రమంగా అది ఆసియా ఖండమంతా వ్యాపించింది. ఆ తర్వాత యూరప్, అమెరికాల దాకా పాకింది. బుద్ధుని జాతక కథల్ని ఆసియా దేశాలన్నీ స్వీకరించాయి. అనువాదాలతో వాటిని తమ స్వంతం చేసుకున్నాయి. వాటిలో దశరథ జాతక కథ ఒకటి. ఇది సుత్తపిటకలోని ఖుద్దక నికాయలో 461వ జాతక కథ. దీనిలో కథా నాయకుడు బోధిసత్వుడైన రాముడు. అన్ని కథల వలెనే ఈ కథ కూడా ఇతర బౌద్ధ దేశాలకు వెళ్లింది. మార్పులు చేర్పులతో అది 'రామాయణం'గా మారింది. ఆయనం అంటే పథం - మార్గం అని అర్థం. బోధిసత్వుడైన రాముడి మార్గం లేదా పథం అని అర్థం చేసుకోవాలి. అందరికి అందరూ ఆ కథను వారికి ఇష్టమైన రీతిలో పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేసుకున్నారు.

> ఈ దేశంలోని చార్వాక, బౌద్ధ, జైన, ఆలోచనా విధానాల్ని ధ్వంసం చేసి, తమదైన బ్రాహ్మణవాదాన్ని ప్రవేశపెట్టి, శతాబ్దాలుగా జనాన్ని హింసిస్తున్నదెవరూ? దేవుడు, దెయ్యం, జన్మ, పునర్జన్మ, శాంతి, పూజ, బలి వంటి మూఢనమ్మకాల్ని ప్రవేశపెట్టి, ప్రజల్ని మానసిక బానిసలుగా మార్చి పనిచేయకుండా సుఖపడుతున్నది ఎవరూ? శ్రమకూ, చెమటకూ విలువ లేకుండా చేసిందెవరూ? ప్రపం చంలో ఎక్కడా లేని సమస్యల్ని సృష్టించిన ఈ దోషుల్ని ఊరికే వదిలేస్తామా? వీరి అప్రకటిత అధికారాల్ని సాగనిస్తామా? వారి కుళ్లు ఆలోచనల్ని కుళ్లబొడవమా? ప్రపంచ పౌరులంతా సమానులే - అన్న విషయం చెప్పి, ఒప్పించి ఒక విలువైన మానవవాద ప్రపంచాన్ని తీర్చిదిద్దుకోవాలి! ఊరికే ఆలోచిస్తూ కూర్చోవడం కూడా కాదు, ఇక ఆ దిశలో తక్షణం కార్యోన్ముఖులు కావడం అవసరం! అవసరం కాదు, అత్యవసరం!!

ఉదాహరణకు ఇండోనేషియాలో యోగేశ్వర్ రచనగా "రామాయణ్ క కావిన్"గా వెలువడింది. కంపూచియాలో "రామకీర్తి", థాయ్‌ల్యాండ్‌లో "రామ్ కీ యేన్స్" లావోస్‌లో "రామ్ జాతక్" బర్మా (మయన్మార్)లో "రామ్ వత్థ్య", మలేషియాలో "హికాయత్ సేరీ రామ్", ఫిలిప్పిన్స్‌లో "మహ లాదియా లావణ్", టిబెట్‌లో "రామ్‌కథ" చైనాలో "దశరథ కథనమ్" ఇంకా "అనామక్ జాతకమ్" మంగోలియా వారి "రామ్ కథ", జపాన్ వారి "రామ్ కథ", శ్రీలంక "రామ్ కథ", నేపాల్ వారి "భామా భక్తకృత రామాయణ్", ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, మలేషియా దేశాలలో బుద్ధుణ్ణి ఇస్లామీకరణ చేసుకుంటే - భారతదేశంలో అదే బుద్ధుణ్ణి బ్రాహ్మణీకరించుకున్నారు. బోధిసత్వుడైన రాముడి కథ ఇస్లాం దేశాలలో ఎక్కువగా మార్పుకు లోను కాలేదు. కానీ, భారత దేశంలో మాత్రం రాముడి వ్యక్తిత్వమే పూర్తిగా మార్చేశారు. బోధిసత్వుడైన రాముణ్ణి హింసాత్మక రాముడిగా మార్చుకున్నారు. భారత దేశం నుండి ఇతర దేశాలకు వెళ్లిన బౌద్ధ జాతక కథలు ముఖ్యంగా రాముడి కథ - కొద్ది మార్పులకు మాత్రమే లోనయ్యింది. పైగా రాముడు 'బోధిసత్వుడ'న్న విషయాన్ని ఎవరూ మార్చలేదు. ఇప్పటికీ ప్రపంచ దేశాల్లోని రామాయణాల్లో రాముడు బోధిసత్వుడే! ఇక్కడ భారతదేశంలో మాత్రం రాముణ్ణి బ్రాహ్మణవాదిగా చూపించడానికి నానా తంటాలు పడ్డారు.

వాల్మీకి రాయాయణం ఆయోధ్యకాండ 108వ సర్గలో బుద్ధుణ్ణి దూషించడం కూడా జరిగింది, జాగ్రత్తగా గమనించండి.

యధాహి చోర: సతథాహి బుద్ద్
స్థథాగత నాస్తిక్ మంత్ర్ విద్వీ

ఎలాగయితే, దొంగకు దండన అవసరమవుతుందో, అదే విధంగా వేదాలను వ్యతిరేకించే బుద్ధుడు ఇంకా అతని అనుచరులు, బౌద్ధమతావలంబికులు దండనీయులవుతారు. బోధిసత్వుడి స్ఫూర్తితో సృష్టించుకున్న రాముడి వ్యక్తిత్వాన్ని మార్చి వేయడమే కాకుండా, బుద్ధుడు వేదాలను దేవుణ్ణీ నిరాకరించాడన్న నెపంతో, అక్కసు వెళ్లబోస్తూ దూషించారు కూడా! అలాగే, ఇంకా చూడండి

తస్మాద్ధి య: శక్యతమ్: పూజానాం
సనాస్తికె నాభీ ముఖో బుద్ధస్యతూ 135॥

తథాగత్ (నాస్తిక విశేషణం) ఇంకా నాస్తిక్ (చార్వాక్)లను కూడా ఇదే క్రమంలో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రజాక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాజుద్వారా దొంగలకు ఎలాంటి శిక్షలు ఇప్పిస్తామో, నాస్తికులకు కూడా అలాంటి శిక్షలే ఇప్పించాలి. ఈ విషయంతో సంబంధం లేని నాస్తికుల పట్ల - పండితులైన బ్రాహ్మణులు ఎప్పుడూ నిర్లిప్తంగా ఉండకూడదు. వదిలేయకూడదు - అని బ్రాహ్మణవాదులకు ఈ శ్లోకంలో ఒక హెచ్చరిక ఉంది.



> ఒక నాటి సంస్కృతులన్నీ బుద్ధుని కాలం నాటి శ్రమన సంస్కృతితో ముడిపడి ఉన్నవే! ఆ విషయం బ్రాహ్మణార్యులు గ్రహించరు. కాలక్రమంలో నశించిపోయిన మానవ నాగరికతలు, సభ్యతలు, చిహ్నాలు పట్టించుకోరు. అవసరం లేకపోయినా ప్రతి విషయంలోనూ దూరి, తమ వైదిక సంస్కృతిని జొప్పిస్తుంటారు. అందువల్ల, ఈ మనువాదుల దాడి ఈనాటిది కాదు. దాన్ని తిప్పికొట్టాల్సిన తరుణం ఆసన్నమైంది! మన భారతదేశంలో హైందవ మత బోధకులు ప్రచారం చేసిన రామాయణాన్ని మనం బాగా జీర్ణించుకుని ఉన్నాం కాబట్టి, విషయం ఆ కోణంలోంచి చూడొద్దు. మనం మాట్లాడుతున్నది బౌద్ధ సాహిత్యంలోని దశరథ జాతక కథ గురించి బోధిసత్వుడైన రాముడి గురించి అంటే, బుద్ధుడి గురించే - ఆ విషయం గుర్తుపెట్టుకోవాలి. సజీవంగా తిరుగాడిన బుద్ధుణ్ణి స్ఫూర్తిగా తీసుకుని, విష్ణుమూర్తిని, అతడి అవతారాలను సృష్టించుకున్నారన్న విషయం ముందు అర్థం చేసుకోవాలి.

సృష్టించుకున్న రాముడి పాత్ర గొప్పతనం చాటుకోవడానికి - కొన్ని శతాబ్దాలకు ముందు వాస్తవంగా జీవించిన బుద్ధుణ్ణి దూషించడం ఎందుకూ? వాల్మికి రామాయణం అయోధ్యకాండలో తమ రాముణ్ణి పొగడుతూ పొగడుతూ మధ్యలో ఇలా బుద్ధుణ్ణి తిట్టడం కనిపిస్తుంది. ఒక నాటి సంస్కృతులన్నీ బుద్ధుని కాలం నాటి శ్రమన సంస్కృతితో ముడిపడి ఉన్నవే! ఆ విషయం బ్రాహ్మణార్యులు గ్రహించరు. కాలక్రమంలో నశించిపోయిన మానవ నాగరికతలు, సభ్యతలు, చిహ్నాలు పట్టించుకోరు. అవసరం లేకపోయినా ప్రతి విషయంలోనూ దూరి, తమ వైదిక సంస్కృతిని జొప్పిస్తుంటారు. అందువల్ల, ఈ మనువాదుల దాడి ఈనాటిది కాదు. దాన్ని తిప్పికొట్టాల్సిన తరుణం ఆసన్నమైంది! మన భారతదేశంలో హైందవ మత బోధకులు ప్రచారం చేసిన రామాయణాన్ని మనం బాగా జీర్ణించుకుని ఉన్నాం కాబట్టి, విషయం ఆ కోణంలోంచి చూడొద్దు. మనం మాట్లాడుతున్నది బౌద్ధ సాహిత్యంలోని దశరథ జాతక కథ గురించి బోధిసత్వుడైన రాముడి గురించి అంటే, బుద్ధుడి గురించే - ఆ విషయం గుర్తుపెట్టుకోవాలి. సజీవంగా తిరుగాడిన బుద్ధుణ్ణి స్ఫూర్తిగా తీసుకుని, విష్ణుమూర్తిని, అతడి అవతారాలను సృష్టించుకున్నారన్న విషయం ముందు అర్థం చేసుకోవాలి.

బుద్ధుడు జ్ఞాన సముపార్జన కోసం రాజ్యం, అంత:పురం, సుఖసంతోషాలు వదిలి అడవికి వెళ్లాడు. ఈ ప్రపంచానికి దు:ఖ విముక్తి కలిగించడానికి, దానికి మార్గం కనుక్కోవడానికి వెళ్లాడు. సృష్టించుకున్న రాముడు తండ్రి మాట మీద అడవికి వెళ్లాడు. ప్రపంచం గానీ, జనం గానీ ఆయన దృష్టిలో లేరు. ఒక ధ్యేయమేదీ లేదు. వాస్తవానికీ కల్పనకూ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. భార్యాబిడ్డల్ని సురక్షితంగా అంత:పురంలో ఉంచి బుద్ధుడు సమస్య పరిష్కారం కోసం అడవికి వెళ్లాడు. తనతో పాటు భార్యను అడవుల్లో తిప్పి, తనే సమస్యల్లో పడ్డాడు-దేవుడైన రాముడు. పైగా, తాను సురక్షితంగా అంత:పురంలో ఉండి, భార్యను అడవికి పంపించాడు. అమానవీయ, అనైతిక ప్రవర్తనలకు చిలువను పలువలుగా వ్యాఖ్యానాలు చెప్పుకుని వైదిక మత ప్రభోదకులు తమ రామాయణం ఒక గొప్ప పవిత్ర గ్రంథమనే భ్రమ కల్పించారు. అందుకు మూలమైన బుద్ధుణ్ణి బుద్ధుడి, జీవితాన్ని దాచేశారు. ఈ దేశ మూలవాసుల్ని ఎలా దోచేశారో - అదే సూత్రం బౌద్ధ సాహిత్యానికి, బౌద్ధ విశ్వవిద్యాలయాలకూ వర్తింపజేశారు. హాయిగా సహజంగా జీవన విలువలతో ఉన్న ఒక మహా మానవుడి కథను మార్చి మార్చి దేవుడి కథగా తిరగరాసుకుని పాపం బ్రాహ్మణార్యులు తరించిపోయారు.

ఇరాన్ ప్రాంతం నుండి వలస వచ్చిన ఆర్యులు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి తాము పవిత్రులమని, ఉన్నతులమని, బ్రాహ్మణార్యులమని ప్రకటించుకున్నారు. మనుస్మృతి, పురాణాలతో సహా అన్ని సంస్కృత గ్రంథాలూ రాసుకున్నారు. వాటితో దేశంలో వర్ణవ్యవస్థను సుస్థిరం చేశారు. వలస రావడం తప్పుకాదు. ఈ భూభాగం మీద స్థిర నివాసాలను ఏర్పరుచుకోవడం తప్పుకాదు. ఆఫ్రికాలో మొదలైన ఆది మానవ జాతులు ప్రపంచ వ్యాప్తంగా వలసలు వెళ్లాయని ఆధునిక జన్యుశాస్త్రం ధృవీకరించింది. మూలవాసులని ఎవరినైతే అంటున్నామో - వారు కూడా అంతకు ముందు ఆ మహా మానవ వలసల ఒరవడిలో తరలి వచ్చినవారే. అయితే, దుర్మార్గమేమంటే - తమను తాము స్థిర పరుచుకోవడానికి అంతకు ముందున్న సంస్కృతుల్ని, జీవన విధానాల్ని, నాగరికతల్ని భాషల్ని ధ్వంసం చేయడం దుర్మార్గం! తమ అబద్ధాలకు, కుట్రలకు, కుతంత్రాలకు పవిత్రను ఆపాదించడం, తమను తాము దైవాంశ సంభూతులమని ప్రచారం చేసుకోవడం దౌర్జన్యం!! ముందుగా వచ్చి, హాయిగా స్థిరపడి, వ్యవసాయం, పశుపోషణ అభివృద్ధి చేసుకుని, సాంకేతిక పరిజ్ఞానం సాధించిన సింధూ ప్రాంత ప్రజల్ని దోచుకుని, నాశనం చేసి వెళ్లగొట్టింది ఎవరూ? తర్వాత కాలంలో వలస వచ్చిన బ్రాహ్మణార్యులే కదా? ఈ దేశంలోని చార్వాక, బౌద్ధ, జైన, ఆలోచనా విధానాల్ని ధ్వంసం చేసి, తమదైన బ్రాహ్మణవాదాన్ని ప్రవేశపెట్టి, శతాబ్దాలుగా జనాన్ని హింసిస్తున్నదెవరూ? దేవుడు, దెయ్యం, జన్మ, పునర్జన్మ, శాంతి, పూజ, బలి వంటి మూఢనమ్మకాల్ని ప్రవేశపెట్టి, ప్రజల్ని మానసిక బానిసలుగా మార్చి పనిచేయకుండా సుఖపడుతున్నది ఎవరూ? శ్రమకూ, చెమటకూ విలువ లేకుండా చేసిందెవరూ? ప్రపంచంలో ఎక్కడా లేని సమస్యల్ని సృష్టించిన ఈ దోషుల్ని ఊరికే వదిలేస్తామా? వీరి అప్రకటిత అధికారాల్ని సాగనిస్తామా? వారి కుళ్లు ఆలోచనల్ని కుళ్లబొడవమా? ప్రపంచ పౌరులంతా సమానులే - అన్న విషయం చెప్పి, ఒప్పించి ఒక విలువైన మానవవాద ప్రపంచాన్ని తీర్చిదిద్దుకోవాలి! ఊరికే ఆలోచిస్తూ కూర్చోవడం కూడా కాదు, ఇక ఆ దిశలో తక్షణం కార్యోన్ముఖులు కావడం అవసరం! అవసరం కాదు, అత్యవసరం!!

- కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్రవేత్త
(మెల్బోర్న్ నుంచి)

ప్రజల ఆహార అవసరాలు తీరడానికి వ్యవసాయం తప్పనిసరి. మనదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వ్యవసాయ యోగ్యమైన భూమిని కలిగి ఉంది. దేశ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జనాభాలో యాభై శాతానికి పైగా జీవనోపాధిని కలిగిస్తుంది. యాభై ఎనిమిది శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయమే ఆధారం. దేశ జీడీపీలో వ్యవసాయ వాటా సుమారు పద్దెనిమిది శాతం. దేశం శ్రామిక శక్తిలో యాభై యెనిమిది శాతం ఈ రంగంలోనే ఉన్నారు. ఆహార పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలు వ్యవసాయం నుండే లభిస్తున్నాయి. అధిక జనాభాతో అభివృద్ధి చెందుతున్న మన దేశంలో ప్రజల ఆహార భద్రతను నిర్ధారించడంలోను, పరిశ్రమలు సేవారంగాల వృద్ధికి వ్యవసాయానిది ముఖ్యపాత్ర. కానీ నేడు దేశంలో వ్యవసాయం పర్యావరణ, ఆర్థిక, సంస్థాగత, సాంకేతికతపరంగా సవాళ్లను ఎదుర్కొంటోంది.

ప్రపంచీకరణ వలన రైతు ఆదాయం తగ్గింది. దేశంలోని చాలా ప్రాంతాలలో సాగువిధానాలు ప్రాచీన పద్ధతిలోనే కొనసాగిస్తున్నారు. నాణ్యమైన విత్తనాల కొరత పెద్ద సమస్యగా మారింది. దేశంలోని దాదాపు అరవై ఐదు శాతం వ్యవసాయం రుతుపవన వర్షపాతంపై ఆధారపడి ఉంది. వాతావరణ మార్పులు అస్థిర రుతుపవనాలకు కారణమవుతున్నాయి. వర్షపాతంలో హెచ్చుతగ్గులు కరువులు లేదా వరదలకు దారితీస్తున్నాయి. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా అస్థిరత్వానికి గురవుతోంది. దేశంలో గణనీయమైన సంఖ్యలో చిన్న, సన్నకారు రైతులున్నారు. తరతరాలుగా కుటుంబ సభ్యుల మధ్య జరిగిన భూవిభజన వలన, జనాభా ఒత్తిడి కారణంగా,

సాగుకు సవాళ్లెన్నో..?



చిన్న రైతులు అప్పులు తీర్చుకోవడానికి తమ భూమిలో కొంత భాగాన్ని అమ్ముకోవడం వలన సాగుభూమి చిన్న కమతాలుగా మారిపోతున్నాయి. ఇంకా ఇవి ఛిన్నాభిన్నంగా ఉండటం వలననీటిపారుదల సరిగా జరగడం లేదు. యాంత్రీకరణకు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించడానికి ఆటంకం కలుగుతోంది. ఇది పంటల ఉత్పాదకతను తగ్గిస్తోంది. భూమి పరిమాణం చాలా తక్కువగా ఉన్నప్పుడు సాగు ఆర్థికంగా ఉండదు. భూ వనరులపై అధిక జనాభా ఒత్తిడి కారణంగా వర్షాధార ప్రాంతాలు, ముఖ్యంగా పొడి భూములు తక్కువ దిగుబడిని ఎదుర్కొంటున్నాయి. వరి, గోధుమలు, పత్తి, నూనె గింజలతో సహా భారతీయ పంటల దిగుబడులు అంత ర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి.

మానవ కార్యకలాపాల వల్ల వర్షాధార ప్రాంతాలు కూడా నేల కోతను క్షీణతను ఎదుర్కొంటోంది. ఒకే పంటను పదే పదే సాగుచేయడం వల్ల నేల పోషకాలును కోల్పోయి నిస్సారంగా మారింది. చాలా ప్రాంతాలలో సాగునీరు కోసం భూగర్భజలాలను అధికంగా వాడడం వల్ల తాజా భూగర్భజల స్థాయిలు క్షీణించాయి. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరతో పాటుగా లేబర్ ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. పంట పెట్టుబడికి రైతులు అధిక వడ్డీకి రుణాలు తెస్తున్నారు. పంట నష్టపోవడం, పంటలకు గిట్టుబాటుధర లేకపోవడం, అధిక ఖర్చులు వలన సగానికి పైగా వ్యవసాయ కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. వాణిజ్యపంటలు సాగుచేసే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. కరువు, పంట నష్టాలు వలన అప్పుల ఊబిలో కూరుకుపోయి ఒక్కోసారి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నాణ్యమైన ఎరువులు ఉపయోగించ పోవడం వలన నిస్సారమైన నేల పంట ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దీనివల్ల దిగుబడి తగ్గి వ్యవసాయ ఉత్పాదకత తగ్గుతోంది. అసమర్థమైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలు ధరల అస్థిరతకు దారితీస్తాయి. సరైన నిల్వ, రవాణా సౌకర్యాలు లేకపోవడం వలన రైతులు వెంటనే తక్కువ ధరకే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. నేరుగా మార్కెటింగ్ విధానం లేకపోవడం వలన వచ్చే ఆదాయంలో కొంత భాగం మధ్యవర్తుల పాలవుతున్నది. ప్రస్తుతం ఉన్న పంటల విధానం కొన్ని ప్రధాన పంటల వైపు మాత్రమే మొగ్గుచూపే విధంగా ఉన్నాయి. పంటలలో వైవిధ్యం లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం తెగుళ్లు, వ్యాధులు, మార్కెట్ ఒడిదుడుకుల బారినపడుతోంది. సాగులో ఆధునిక సాంకేతికలు అమలు పరచడం లేదు.

భారతీయ వ్యవసాయం సవాళ్లను పరిష్కరించ డానికి బహుముఖ విధానం అవసరం. వ్యవసాయ పనితీరును మెరుగు పరచడం, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధికి భరోసా ఇవ్వడానికి ఈ సవాళ్లను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత. సమర్థవంతమైన నీటిపారుదల పద్ధతులు, వర్షపునీటి సంరక్షణను అమలు చేయాలి. తీవ్రమైన వాతావరణ సంఘటనల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి. ఆహారోత్పత్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు నిర్ణయించే ఆహార ధాన్యాల ధరలకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా వారు సహేతుకమైన ఆదాయాన్ని పొందేలా చూడాలి. పారదర్శక సరసమైన ధరల విధానాలను ఏర్పాటు చేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నేరుగా విక్రయించే ఏర్పాటు చేయాలి. అధునాతన వ్యవసాయ సాంకేతికతలు అందిపుచ్చుకోడానికి డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించాలి. భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి కేంద్రం ప్రధానంగా స్వామినాథన్ కమిషన్‌ను అమలు చేయాలి. అప్పుడే రైతుల జీవనోపాధి మెరుగుపడే అవకాశం ఉంటుంది.

- డిజె మోహన రావు, 9440485824

'ఏరా బాబూ ఎలా ఉన్నావ్..?'

చెరుకూరి సత్యనారాయణ

"మలినమంటనట్టి మానవతావాది
కల్తీలేని శుద్ధ కమ్యూనిస్టు
వరగగాడ్యుడయిన కొరటాల మరణము
లేశమైన తీర్చలేని లోటు"

సుప్రసిద్ధ సినీ నిర్మాత, దర్శకులు, సహజకవి మల్లెమాల గారు 01 జులై 2006న కొరటాల సత్యనారాయణ గారు చనిపోయిన సమయంలో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించినప్పుడు ఆశువుగా చెప్పిన పద్యమిది. కొరటాల ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో పరిచయం అక్కర్లేని పేరు. కమ్యూనిస్టు నాయకుడు, ఉద్యమ రూపకర్త. ప్రజా ప్రతినిధిగానూ సేవలందించిన నేత. భౌతికంగా మనకు దూరమై పద్దెనిమిదేండ్లు గడుస్తున్నా 'ఏరా బాబూ ఎలా ఉన్నావ్?'అనే ఆయన ఆత్మీయమైన పిలుపు ఇంకా సజీవంగానే ఉంది. కొరటాల వర్ధంతి సందర్భంగా నా అనుభవాలు కొన్ని...

గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉండి నక్సల్ చీలికతో కకావికలమైన పార్టీని పునర్నించటంలో పుతుంబాక వెంకటపతి గారితో కల్సి దీర్ఘకాలంలో ఆ పనిని ఫలవంతం చేశాడు కొరటాల. 1991-97 మధ్యకాలంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటి సభ్యులుగా వుంటూ ఆ తర్వాత పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా కీలక బాధ్యత నిర్వహించారు. 29 సంవత్సరాల వయసులో తెనాలి పార్లమెంటు నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కేవలం 1388 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1962లో వేమూరు, 1978లో రేపల్లె నియోజక వర్గాల నుండి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు.

ఇక్కడ పాత కామ్రేడ్స్ చెప్పిన ఒక విషయం చెప్పాలి. తెనాలి తాలూకా గ్రామాల్లో మన పార్టీ కంటే కృషికార లోక్‌పార్టీకి విజయావకాశాలు బాగా వున్నాయనే వాతావరణం ఏర్పడటంతో కాంగ్రెసును ఓడించాలనే అభిప్రాయం గల మన పార్టీ శ్రేణులు కొందరు కె.ఎల్.పి. అభ్యర్థికి ఓటు వేశారట. తీరా లెక్కింపు తర్వాత ఫలితాలు చూస్తే కాంగ్రెసు అభ్యర్థి కొత్త రఘురామయ్యకు 103126 ఓట్లు రాగా, కొరటాల గారికి 101738 ఓట్లు వచ్చాయి. రంగా గారి కే.ఎల్.పి. అభ్యర్థి శీరం వెంకట సుబ్బారావుకి కేవలం 54909 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ కారణంగా రఘురామయ్య గెల్చి మూడు దశాబ్దాలు ఎంపీగా, కేంద్రమంత్రిగా పనిచేశాడు.

నేను గుంటూరు జె.కె.సి కాలేజిలో 1970లో ఇంటర్మీడియట్‌లో చేరాను. జూనియర్ ఇంటర్ అయిపోయి వేసవి సెలవుల అనంతరం కాలేజికి వెళ్లగానే నన్ను కాలేజి నుండి తొలగిస్తున్నట్లు ఆఫీసుకొచ్చి టీసీ తీసుకోమని నోటీస్ పెట్టారు. దాన్ని వెనక్కు తీసుకొనేట్లు నేను చేసిన ప్రయత్నాలన్నీ పని చేయకపోవటంతో విషయాన్ని కొరటాల గారి దృష్టికి తీసుకెళ్లాను. వెంటనే ఆయన అప్పటి వేమూరు స్వతంత్ర పార్టీ ఎమ్మెల్యే యడ్లపాటి వెంకటరావుతో మాట్లాడి ఆయన్ను పిలిపించి నన్ను తీసుకొని స్వతంత్ర పార్టీ నాయకులు ఆ కళాశాల కమిటి ఛైర్మన్, పార్లమెంట్ మాజీ సభ్యులు అయిన జాగర్లమూడి చంద్రమౌళి గారి దగ్గరకు తీసుకెళ్లారు. విషయం విన్న చంద్రమౌళి గారు ఫోన్‌లో ప్రిన్సిపల్ రోశయ్య గారితో మాట్లాడి మరుసటి రోజు కాలేజికి వెళ్లి జాయిన్ అవమని చెప్పారు. కాలేజి కమిటి అధ్యక్షుడికిచ్చిన మాట ప్రకారం నన్ను చేర్చుకోవటానికి ప్రిన్సిపాల్ నిరాకరించాడు.



కమ్యూనిస్టులు నా కాలేజిలో ఉండటానికి వీల్లేదని హుంకరించాడు. గత్యంతరం లేక హిందూ కాలేజిలో చేరి నా చదువు కొనసాగించాను.

ఆ తర్వాత 1975లో సీపీఐ(ఎం) నాయకులు పోపూరి రామారావు గారి అమ్మాయి అరుణతో నా వివాహం జరగటంతో కొరటాల గారితో నా పరిచయం మరింత చిక్కబడింది. మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత 1987లో మండలాధ్యక్షుడిని ప్రత్యక్షంగా ఎన్నుకొనే విధంగా ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఎడ్లపాడు మండలాధ్యక్షునిగా మా మామ పోపూరి రామారావు సీపీఐ(ఎం) అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ మద్దతుతో పోటీ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి బావమరిది కాంగ్రెసు అభ్యర్థిగా నిలవటంతో ఈ ఎన్నిక రాష్ట్రస్థాయిని ఆకర్షించింది. ఆ ఎన్నికని పర్యవేక్షించటానికి కొరటాల గారు ఎడ్లపాడు వచ్చారు. నేను గుంటూరు నుండి నా మిత్రుని కారు తీసుకొని వెళ్లాను. ఆ కారులో ఎన్నికల రోజు నేనూ, కొరటాల గారు మండలంలోని అన్ని గ్రామాలూ తిరిగాం. బ్యాలెట్ పెట్టెలు బావిలో వేయటంతో చంఘిస్‌ఖాన్ పేట అనే గ్రామంలో మరుసటి రోజు రీ పోలింగ్‌కి దారితీసింది. కొరటాల గారు ఎడ్లపాడులో ఆగిపోయారు. ఆరోజు నేనూ, కొరటాల మరికొంతమంది స్థానిక నాయకులతో కలిసి ఆ గ్రామానికి బయలు దేరాము. కొద్దిదూరం వెళ్లిన తర్వాత అప్పటి సీపీఐ(ఎం) శాసనసభ్యులు పుతుంబాక వెంకటపతి గారికి ఒక విషయం చెప్పాల్సిందిగా నన్ను కారు దిగి వెనక్కి ఎడ్లపాడు వెళ్లి ఫోను చేయమన్నాడు. (ఆ రోజుల్లో సెల్‌ఫోన్లు లేవు) వారు ఆ గ్రామానికి వెళ్లటం కోసం ముందుకు వెళ్లారు. కాని దారి మధ్యలో కాంగ్రెసు గుండాలు కారుని ఆపి దాన్ని ధ్వంసం చేసి కొరటాల గారిని, ఆయనతో వున్న మిగిలిన వ్యక్తుల్ని ఒక ట్రాక్టర్‌పై ఎక్కించుకొని కిడ్నాప్ చేసి తీసుకెళ్లి సొలస అనే గ్రామంలో ఒక ఇంటిలో నిర్బంధించారు.

ఈ విషయం తెలిసి వేల సంఖ్యలో ప్రజలు బోయపాలెం గ్రామం సెంటర్‌లో పోగయ్యారు. పూర్తి సాయుధ సరంజామాతో వందల సంఖ్యలో కార్యకర్తలు ఉన్నా ముందుకు పోలేకపోయాం. కారణం కొరటాల గారు వారి ఆధీనంలో వున్నారు. ఈలోగా శాసనసభ్యులు పుతుంబాక గారు ముఖ్యమంత్రి దృష్టికి విషయం తీసుకెళ్లటంతో ఆయన జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించగా గుంటూరు నుండి పోలీసు బలగాలు పెద్దఎత్తున బయలుదేరాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెసు గుండాలు కొరటాల గారిని, ఇతరుల్ని పక్క గ్రామం వరకు తీసుకొచ్చి వదిలేశారు. అంతకుముందు తిమ్మాపురం అనే గ్రామంలో మన పోలింగ్ ఏజెంట్‌ని కొరటాల - స్థానిక కాంగ్రెసు శాసనసభ్యుని సమక్షంలో కాంగ్రెసు వారు పోలింగ్‌బూత్‌లో నుండి గెంటి వేయటంతో కొరటాల గారు ఆ ఎమ్మెల్యేతో గొడవ పడ్డాడు. కిడ్నాప్ సమయంలోనూ తాను నిబ్బరంగా వుండి సహచరులకు ధైర్యం చెప్పిన తీరు వారంతా ఆశ్చర్యంతో చెప్పారు. మల్లెమాల గారన్నట్లు ఆయన మరణం "లేశమైనా తీర్చలేని లోటు".

> ఆరోజు నేనూ, కొరటాల మరికొంతమంది స్థానిక నాయకులతో కలిసి ఆ గ్రామానికి బయలు దేరాము. కొద్దిదూరం వెళ్లిన తర్వాత అప్పటి సీపీఐ(ఎం) శాసనసభ్యులు పుతుంబాక వెంకటపతి గారికి ఒక విషయం చెప్పాల్సిందిగా నన్ను కారు దిగి వెనక్కి ఎడ్లపాడు వెళ్లి ఫోను చేయమన్నాడు. (ఆ రోజుల్లో సెల్‌ఫోన్లు లేవు) వారు ఆ గ్రామానికి వెళ్లటం కోసం ముందుకు వెళ్లారు. కాని దారి మధ్యలో కాంగ్రెసు గుండాలు కారుని ఆపి దాన్ని ధ్వంసం చేసి కొరటాల గారిని, ఆయనతో వున్న మిగిలిన వ్యక్తుల్ని ఒక ట్రాక్టర్‌పై ఎక్కించుకొని కిడ్నాప్ చేసి తీసుకెళ్లి సొలస అనే గ్రామంలో ఒక ఇంటిలో నిర్బంధించారు.

(జులై 1 కొరటాల వర్ధంతి)

త్వరలో కొత్త రేషన్ కార్డులు..

- ఇందిరమ్మ ఇండ్లనూ అందిస్తాం : సంగారెడ్డి జిల్లా జెడ్పీ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిద్దిపేట

కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లాంటి పథకాలు త్వరలో అమలు చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి సంఘంలో జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఇలాగే ప్రజా జీవితంలో కొనసాగి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇప్పటికే రైతులకు రుణమాఫీ చేయడానికి కేబినెట్ నిర్ణయం తీసుకుందని, ఇక.. విద్య, రైతాంగ, వైద్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 26 వేల స్కూళ్లకు రూ.1100 కోట్లతో అభివృద్ధి పనులు చేసి, మౌలిక వసతులు కల్పించినట్టు చెప్పారు. ఐదేండ్లు ప్రజా జీవితంలో గడిపిన జడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్, జడ్పీటీసీ, ఎంపీపీలు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ వైస్ చైర్మెన్, జడ్పీటీసీ, ఎంపీపీలను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్తప్రభాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి. ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, కలెక్టర్ మను చౌదరి సన్మానించారు.

బాలికపై కానిస్టేబుల్ లైంగికదాడి

- పోక్సో చట్టం కింద కేసు నమోదు
- నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-రాజేంద్రనగర్

బాలికకు మాయమాటలు చెప్పి ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడిన కానిస్టేబుల్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


(ఫైల్)

ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. కేసుకు సంబంధించిన వివరాలను రాజేంద్రనగర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ నాగేంద్రబాబు మీడియాకు వెల్లడించారు. బుద్వేల్ ప్రాంతానికి చెందిన ప్రదీప్.. 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. ప్రస్తుతం శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్నారు. కాగా, బుద్వేల్ ప్రాంతానికి చెందిన ఓ బాలికతో అతనికి ఓ చర్చిలో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో.. ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి బాలికపై ప్రదీప్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ బాలిక పెండ్లి చేసుకోవాలని అడగ్గా.. తనకు సంవత్సరం క్రితమే పెండ్లి అయిందని ప్రదీప్ చెప్పడంతో ఆ బాలిక ఖంగుతింది. ఆ బాలికతో శారీరకంగా కలిసి ఉన్నప్పుడు ప్రదీప్ ఫొటోలు, వీడియోలు తీశాడు. వాటిని చూపించి బాలికను బెదిరించి.. ఆమెపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇటీవల ఆ బాలిక జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గురువారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రదీప్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అతనిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి

- ఆడపిల్ల అని రెండుసార్లు అబార్షన్ చేయించిన భర్త!
- రెండోసారి వికటించి తల్లీ మృతి

నవతెలంగాణ-సూర్యాపేట



ప్రయివేటు ఆస్పత్రుల కాసుల కక్కుర్తి.. పుత్రుడే కావాలన్న మూర్ఖపు తండ్రి దుర్మార్గానికి ఆడ పసిగుడ్డు రెండు సార్లు తల్లి గర్భంలోనే చిదిమేయబడింది.. ఆ తండ్రి చదువు లేని వ్యక్తి కాదు.. పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందాడు.. మొదటిసారి లింగనిర్ధారణ పరీక్ష ద్వారా ఆడపిల్ల అని తెలుసుకుని గుట్టుచప్పుడు కాకుండా భ్రూణహత్యకు పాల్పడిన ఆ తండ్రి రెండోసారీ యత్నించాడు. ఏడు నెలల గర్భంతో ఉన్న భార్యకు అబార్షన్ చేయించగా.. పసిగుడ్డుతోపాటు తల్లీ ప్రాణం విడిచింది. ఈ విషయం తెలిసి బాధితురాలి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలో జరిగింది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం, వెన్నారం గ్రామ పంచాయతీ రాముతండాకు చెందిన సుహాసిని(26)కి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఎంజి నగర్ తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఐదేండ్ల కిందట వివాహం జరిగింది. హరిసింగ్ నెల రోజుల కిందటే ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సుహాసిని మూడోసారి గర్భవతి కాగా.. స్కానింగ్ తీయించి లింగ నిర్ధారణ పరీక్షలో ఆడ శిశువు అని తేలడంతో భర్త అబార్షన్ చేయించాడు. మళ్లీ గర్భం దాల్చగా.. స్కానింగ్ తీయించాడు. ఆడపిల్లని మరోసారి నిర్ధారణ కావడంతో అబార్షన్ కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో డాక్టర్ సలహా తీసుకున్నాడు. ఈ పరిస్థితిలో అబార్షన్ చేసినా, డెలివరీ చేసినా తల్లీబిడ్డ ఇద్దరికీ ప్రమాదమని డాక్టర్లు చెప్పినట్టు తెలిసింది. కానీ, వెనక్కి తగ్గని ఆ తండ్రి ఏడో నెల గర్భవతి అయిన సుహాసినిని హుజూర్‌నగర్ ప్రాంతంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ అబార్షన్ చేయించాడు. అందుకు దీంతో సుహాసిని పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కోదాడ, ఆ తర్వాత ఖమ్మం, అటు నుంచి సూర్యాపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే బాధితురాలు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. విషయం సుహాసిని పుట్టింటి వారికి చెప్పకుండా గురువారం మృతదేహాన్ని ఎంజీనగర్ తండాకు తీసుకొచ్చాడు. ఈ విషయంపై చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు మృతురాలి కుటుంబ సభ్యులు వెళ్లగా.. సూర్యాపేట టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని పంపించారు. సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు. ఆగ్రహించిన మృతురాలి కుటుంబ సభ్యులు టౌన్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. దాంతో పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారని బాధితులు తెలిపారు.

విద్యుద్ఘాతంతో ఇద్దరు మృతి

- తీగ దండంపై టవల్ తీస్తుండగా.. నకిరేకల్ మండలంలో ఘటన



(ఫైల్)

నవతెలంగాణ -నకిరేకల్

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం, ఓగోడు గ్రామంలో ఒకరిని రక్షించబోయి మరొకరు.. విద్యుద్ఘాతంతో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన గురువారం రాత్రి 7గంటలకు జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓగోడు గ్రామానికి చెందిన మాధ వీరేందర్(35) స్నానం చేశాక తీగ దండంపై ఆరేసిన టవల్‌ను తీసుకోబోతుండగా కరెంట్ షాక్ తగిలింది. దాంతో కేకలు వేయడంతో పక్కనే నివాసముంటున్న తన మేనమామ భూపతి జానయ్య(45) వచ్చి కర్రతో తీగ దండాన్ని కొట్టాడు. తీగ తెగి జానయ్యపై పడటంతో ఆయన కూడా విద్యుద్ఘాతానికి గురయ్యాడు. వెంటనే ఇద్దరిని నకిరేకల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఇద్దరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భూముల విలువ 50 నుంచి 60శాతం పెంపు?

- 29న ఆమోదించనున్న ప్రతిపాదనలు
- ధరల పెంపుతో రూ.8 వేల కోట్లకు పైగా అదనపు ఆదాయం
- రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపైనా కసరత్తు
- రెండూ ఒకేసారి పెంచితే ప్రజల రియాక్షన్ ఎలా ఉంటుందో?
- రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు



తుది దశకు పెంపుదల ప్రక్రియ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడ గ్రామంలో గతంలో ఎకరాకు రూ.7 లక్షల 50 వేలున్న మార్కెట్ విలువను 11 లక్షల 25 వేలకు, కిషన్ గూడ గ్రామంలోని 117 సబ్‌డివిజన్‌లో ఎకరాకు రూ. 42లక్షల నుంచి రూ. 63లక్షలకు, అదే గ్రామంలోని 118 సబ్‌డివిజన్‌లోఎకరాకు రూ.49 లక్షల నుంచి రూ. 73 లక్షల 50 వేలకు పెంచేందు మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీ ప్రతిపాదించింది. దేవతాబౌలి గ్రామంలో ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.42 లక్షలుగా ప్రాథమికంగా నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ పెంపుపై సర్కార్ సూచనలకనుగుణంగా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీలు సగటున 50 నుంచి 60 శాతం పెంపుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. రాష్ట్రంలోని 143 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రూపొందించిన ప్రతిపాదనలను ఈ నెల 29 సదరు కమిటీలు ఆమోదించనున్నాయి..

తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 2021 జులైలో ఒక సారీ, 2022 ఫిబ్రవరిలో రెండో సారీ భూములు, భవనాల మార్కెట్ ధరలను ప్రభుత్వం పెద్ద ఎత్తున పెంచింది. రాష్ట్రం ఏర్పడక ముందున్న ధరలతో, రెండు సార్లు పెంచిన సగటుతో పోల్చితే వ్యవసాయ భూముల ధరలు గరిష్ఠంగా 150 శాతం పెరగగా, స్థిరాస్తి భూముల ధరలు 100శాతం, అపార్ట్‌మెంట్ ధరలు 50 నుంచి 80 శాతం వరకు పెరిగాయి. ఫలితంగా సర్కార్‌కు పెద్ద మొత్తంలో ఆదాయం పెరిగింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.5,243.28 కోట్లుగా ఉన్న ఆదాయం రూ.7,000ల కోట్లకు పైగా అదనంగా పెరిగి 2021-22 ఏడాదిలో రూ.12,372.73 కోట్లకు చేరింది. అనంతరం 2022లో రెండోసారి పెంచిన భూముల ధరలతో రూ.3,000ల కోట్ల వరకు అదనంగా ఆదాయం వచ్చింది. వాస్తవానికి ప్రతిఏడాది మార్కెట్ ధరలు సమీక్షించి సవరించేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంది. కాని గత సర్కార్ ఎన్నడూ ఆ పని చేయలేదు. ఫలితంగా మార్కెట్లో పెరుగుతున్న ధరలకు సర్కార్ నిర్ణయించిన ధరలకు మధ్య వ్యత్యాసం క్రమంగా పెరుగుతూ వస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం భూముల ధరలను పెంచాలని నిర్ణయం తీసుకుంది. అందుకనుగుణంగా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఆర్డీవో చైర్మెన్‌గా, సబ్‌రిజిస్ట్రార్ కన్వీనర్‌గా ఐదుగురు సభ్యులతో ఏర్పాటైన కమిటీలు క్షేత్ర స్థాయిలో రాష్ట్ర మంతా పర్యటించి భూముల విలువ పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. ఈ నెల 29న పెంపుపై తయారు చేసిన ప్రతిపాదనలను ఆమోదించి, జులై ఒకటి నుంచి 15 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. మార్పులు చేర్పులనంతరం ఆగస్టు ఒకటి నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి.

రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా 2021 నుంచి వస్తున్న ఆదాయ వివరాలు

2020-21లో	రూ.5,243.28 కోట్లు
2021-22 లో	రూ.12,372.73 కోట్లు
2022-23లో	రూ.14,291 కోట్లు
2023-24 లో	రూ.14,295 కోట్లు
2024-25లో	లక్ష్యం.. రూ. 22 వేల కోట్లు

రిజిస్ట్రేషన్ ఫీజు పెంపుపైనా సమాలోచనలు

రాష్ట్రంలో భూముల ధరలతోపాటు స్టాంపులు రిజిస్ట్రేషన్ ఫీజును 2021లో పెంచారు. 4 శాతం ఉన్న ఫీజును 5.5 శాతంగా పెంచారు. అనంతరం మరోసారీ 2 శాతం పెంచారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ఫీజు మొత్తంగా 7.5 శాతానికి చేరుకుంది. ఇందులో 5.5 శాతం స్టాంప్ డ్యూటీ కాగా, 0.5 శాతం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, 1.5 శాతం రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్నారు. ఆగస్టు ఒకటి నుంచి భూముల ధరలను పెంచాలని నిర్ణయించిన ప్రభుత్వం పనిలో పనిగా రిజిస్ట్రేషన్ చార్జీలను సైతం పెంచితే ఎలా ఉంటుందనే విషయాన్ని అధ్యయనం చేస్తున్నది. రెండింటి ధరలు ఒకేసారీ పెంచితే ప్రజల నుంచి ఎమైనా వ్యతిరేకత వస్తుందా అనే అంశాన్ని సైతం పరిశీలిస్తున్నట్టు సమాచారం. గతంలో 2021లో భూముల ధరలతో పాటు రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా పెంచారు. అదే పద్ధతిని ప్రస్తుతం అమలు చేయాలని భావిస్తున్నది. అయితే ఇందుకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ముఖ్యమంత్రితో చర్చించి త్వరలో చార్జీల పెంపుపైనా ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆగస్టు కన్నా ముందే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం

- అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా అమలు చేస్తాం
- బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టింది
- వేల కోట్లు అప్పు తెచ్చి మిషన్ భగీరథ చేపట్టినా నీళ్లు లేవు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కొత్తగూడెంలో కిన్నెరసాని తాగునీటి పథకానికి శంకుస్థాపన
- మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, పొంగులేటి హాజరు



నవతెలంగాణ- కొత్తగూడెం

ఆగస్టు కన్నా ముందే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా అమలు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.42వేల కోట్లు అప్పు తెచ్చి మిషన్ భగీరథ చేపట్టిందని, అయినా ఇంటింటికి తాగు నీటిని ఇవ్వలేకపోయిందని తెలిపారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకం కింద ఏర్పాటు చేయనున్న కిన్నెరసాని తాగునీటి జలాల పథకానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో భట్టి మాట్లాడారు. పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించిందని ఆరోపించారు. రెండు లక్షల రైతు రుణమాఫీని ఆగస్టు.. అంతకన్నా ముందే చేసి చూపిస్తామని తెలిపారు. రైతు భరోసా విషయంలో అభిప్రాయాలు సేకరించి, విధి విధానాలు రూపొందించి, అసెంబ్లీలో చర్చకు పెట్టిన అనంతరం చట్టం చేసి కచ్చితంగా రైతులకు అందజేస్తామన్నారు. ప్రణాళికాబద్ధంగా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, త్వరలో సీతారామ ప్రాజెక్టు నుంచి నీళ్లను పంటపొలాలకు పారిస్తామని తెలిపారు. కొత్తగూడెం పట్టణం, ఆలేరు నియోజకవర్గానికి తాగునీటి సరఫరాకు రూ. 150 కోట్లు చొప్పున ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. కొత్తగూడెంలో కావలసినంత స్థలం, నీరు, బొగ్గు అందుబాటులో ఉన్నందున సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. కొత్తగూడెం- పాల్వంచ రెండు పట్టణాలు కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డు నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయిందని తెలిపారు. కొత్తగూడెంలో ఐటీ హబ్ నిర్మాణానికి కావలసిన స్థలం ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యంతో చర్చిస్తామని చెప్పారు.

ప్రతి ఇంటికీ నీరు అందిస్తాం : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

కొత్తగూడెం పట్టణంలో రూ.124 కోట్లతో చేపట్టిన ప్రతి ఇంటికీ మంచినీరు అందించే పథకాన్ని ఐదు నెలల్లో పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. డ్రయినేజీలు నిర్మిస్తామన్నారు. కొత్తగూడెం ఆస్పత్రిలో గర్భిణీలు ఇబ్బందులు పడటం తెలుసుకొని ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఎయిర్ కండిషన్స్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తన దృష్టికి వచ్చిన జిల్లా సమస్యలన్నింటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా పరిష్కరించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.

బీఆర్ఎస్ నీటి సమస్యకు పరిష్కారం చూపలేదు : మంత్రులు పొంగులేటి, తుమ్మల

కొత్తగూడెం పట్టణంలో ఉన్న తాగునీటి సమస్యకు గత ప్రభుత్వం పరిష్కారం చూపలేదని మంత్రులు తమ్ముల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గోదావరి నీటితో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేస్తే గత ప్రభుత్వం రాజకీయ, ధన లబ్ది కోసం దొరికిన కాడికి అప్పులు చేసి కనీసం ఒక ఎకరానికి కూడా సాగునీరు అందించలేదని విమర్శించారు. కొత్తగూడెం వయా తొర్రూర్-ఇల్లందు మీదుగా వలిగొండకు జాతీయ రహదారి మంజూరు అయి.. సగం టెండర్లు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగతావి త్వరలో పూర్తి చేస్తామన్నారు. కొత్తగూడెం జిల్లాను పామాయిల్ సాగుకు కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

సభాధ్యక్షులు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. జిల్లా తాగునీటి సమస్యల పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి, మంత్రులు జిల్లాకు విచ్చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మున్సిపల్ చైర్మెన్ కాపు సీతాలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, మాజీ ఎంఎల్‌సీ బాలసాని లక్ష్మీ నారాయణ, డీసీసీబీ చైర్మెన్ కొత్వాల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే. సాబీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌ను నియమించాలి

- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ - బోనకల్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌ను నియమించాలని, ప్రమోషన్ల అనంతరం ఖాళీగా ఉన్న పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని జానకీపురం, రావినూతల, బోనకల్ ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో అలుగుబెల్లి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కంటే ప్రస్తుత ప్రభుత్వం కొంత పర్వాలేదన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు రాష్ట్రంలో ముగ్గురు ఉన్నారని, వారి పనితీరు ఎలా ఉందో ఉపాధ్యాయులు అంచనా వేసుకోవాలని కోరారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన దగ్గర నుంచి నిత్యం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నానన్నారు. శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతుకని వినిపిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, దాని బలోపేతానికి ఉపాధ్యాయులతో పాటు సమాజం కూడా బాధ్యత వహించాలని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్టు తెలిపారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, పాఠశాలలో ఖాళీలను భర్తీచేయాలని కోరారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు వివిధ రకాల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నర్సిరెడ్డికి అందజేశారు. బోనకల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉపాధ్యాయులూ వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చావ దుర్గాభవాని, జిల్లా నాయకులు రమాదేవి, జిల్లా కోశాధికారి వల్లకొండ రాంబాబు, నాయకులు సదాబాబు, ఎన్ వీరబాబు, బోనకల్ మండల అధ్యక్ష కార్యదర్శులు భూపతి ప్రీతం, గుగులోతు రామకృష్ణ, బీసీ వెల్ఫేర్ రాష్ట్ర నాయకులు లెనిన్ స్టన్, శివకృష్ణ, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, మండల కమిటీ సభ్యులు పి.నరసింహరావు, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

18,942 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

- మల్టీజోన్-1లో 11,177 మంది, మల్టీజోన్-2లో 7,765 మందికి ప్రమోషన్లు
- భాషాపండితులు, పీఈటీల కల సాకారం
- ముగిసిన ప్రక్రియ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ గురువారంతో ముగిసింది. సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) బదిలీల ప్రక్రియ కొనసాగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 18,942 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. దీంతో పదోన్నతులు పొందిన వారంతా ఆనందోత్సాహంలో ఉన్నారు. 20 ఏండ్లుగా సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), భాషా పండితులు (ఎల్పీ), వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు (పీఈటీ) ఎదురుచూస్తున్న పదోన్నతుల కల ఇప్పుడు సాకారమైంది. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనంత సంఖ్యలో ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. ప్రజాప్రభుత్వంలో చారిత్రక నిర్ణయం తీసుకుని ఉపాధ్యాయులకు అందలం చేశామని ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సముచిత రీతిలో వ్యవహరించిందని పేర్కొంది. పదోన్నతులకు అడ్డంకిగా మారిన చట్టపరమైన వివాదాలను పరిష్కరించడంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడంతో అర్హులైన వేలాది మంది ఉపాధ్యాయులు ప్రమోషన్లకు నోచుకోలేదని తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ మంత్రిగానూ బాధ్యతలు నిర్వహిస్తుండడంతో ఈ అంశంపై ఆయన ప్రత్యేక శ్రద్ధ కనపర్చారని పేర్కొంది. సీఎం చొరవతో హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఉన్న చట్టపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో పదోన్నతులకు మార్గం సుగమమైంది. ఫలితంగా 18,942 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. మల్టీజోన్-1లో 11,177 మంది, మల్టీజోన్-2లో 7,765 మంది ప్రభుత్వ స్థానిక సంస్థల పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి.

వివాదరహితంగా పదోన్నతుల నిర్వహణ

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. అయినా ఎక్కడా వివాదాలకు తావు ఇవ్వలేదు. మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తి పారదర్శకతతో చేయడంపై ఉపాధ్యాయ సంఘాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. తమ అర్హతకు తగినట్టు పదోన్నతులు దక్కడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, అదనపు సంచాలకులు కె లింగయ్య, ఇతర అధికారులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టాన్ని, శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడంతోపాటు సముచిత రీతిలో గౌరవించడంతో ఉపాధ్యాయులు రెట్టించిన ఉత్సాహంతో విద్యా బోధన చేపట్టే అవకాశమున్నది. ఫలితంగా ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల్లో విద్యా నాణ్యత స్థాయి మరింత పెరగనుంది.

భాషాపండితుల హర్షం

20 ఏండ్ల కలను సాకారం చేసి పదోన్నతులు కల్పించటం పట్ల ఆర్‌యూపీపీటీఎస్ హర్షం ప్రకటించింది. పదోన్నలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, విద్యాశాఖ అధికారులకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు, కోశాధికారి కట్టా గిరిజారమణశర్మ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనలో మరింత శ్రద్ధతో ముందుకుసాగుతామని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో భాషలను బలోపేతం చేయాల్సిన అవసరముందనీ, ఎల్పీ వ్యవస్థను ప్రవేశపెట్టి అక్కడ తెలుగు, హిందీ పండిత పోస్టులను సృష్టించి నియమించాలని కోరారు. భాషలను భాషా పండితులతో బోధించజేయాలని సూచించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్‌ఏ హిందీ పండితులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని తెలిపారు. రాష్ట్రంలోని ఓరియెంటల్ కళాశాలను పునరుద్ధరించి నియామకాలను చేపట్టి భాషలకు గౌరవాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగుకు వారానికి తొమ్మిది పీరియడ్లు, హిందీకి ఆరు పీరియడ్లు కేటాయించాలని కోరారు.

రాష్ట్రంలో ఉపాధ్యాయ పదోన్నతుల వివరాలు

జోన్	కేటగిరి	యాజమాన్యం	పదోన్నతుల సంఖ్య
మల్టీజోన్ 1	ఎస్జీటీ నుంచి ఎస్‌ఏ	ప్రభుత్వ, స్థానిక సంస్థలు	10,083
మల్టీజోన్ 2	ఎస్జీటీ నుంచి ఎస్‌ఏ	స్థానిక సంస్థలు	5,962
మల్టీజోన్ 2	ఎస్జీటీ నుంచి ఎస్‌ఏ	ప్రభుత్వ	1,027
మల్టీజోన్ 2	ఎస్‌ఏ నుంచి హెచ్‌ఎం	స్థానిక సంస్థలు	776
మల్టీజోన్ 1	ఎస్‌ఏ నుంచి హెచ్‌ఎం	స్థానిక సంస్థలు	995
మల్టీజోన్ 1	ఎస్‌ఏ నుంచి హెచ్‌ఎం	ప్రభుత్వ	99
మొత్తం పదోన్నతులు			18,942

జిల్లాల వారీగా ప్రమోషన్లు (ఎస్జీటీ నుంచి ఎస్‌ఏకు)

జిల్లా	పదోన్నతులు	జిల్లా	పదోన్నతులు
ఆదిలాబాద్	445	మెదక్	597
కొమరంభీమ్ ఆసిఫాబాద్	340	సిద్దిపేట	679
మంచిర్యాల	458	జనగామ	434
నిర్మల్	416	యాదాద్రి భువనగిరి	496
నిజామాబాద్	833	మేడ్చల్ మల్కాజిగిరి	302
జగిత్యాల	682	హైదరాబాద్	749
పెద్దపల్లి	368	వికారాబాద్	581
జయశంకర్ భూపాలపల్లి	277	మహబూబ్‌నగర్	497
భద్రాద్రి కొత్తగూడెం	694	జోగులాంబ గద్వాల	298
మహబూబాబాద్	517	వనపర్తి	390
వరంగల్	434	నాగర్ కర్నూల్	550
హన్మకొండ	475	నల్లగొండ	897
కరీంనగర్	504	సూర్యాపేట	614
రాజన్న సిరిసిల్ల	394	ఖమ్మం	954
కామారెడ్డి	787	ములుగు	229
సంగారెడ్డి	774	నారాయణపేట	407
మొత్తం	18,942		

విద్యుత్ కమిషన్‌పై కేసీఆర్ పిటిషన్‌కు ఓకే

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రేవంత్‌రెడ్డి సర్కార్ గత ప్రభుత్వ విద్యుత్‌రంగ నిర్ణయాలపై విచారణకు నియమించిన జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి ఏకసభ్య కమిషన్ ఏర్పాటును సవాలు చేస్తూ మాజీ సీఎం కే చంద్రశేఖరావు (కేసీఆర్) హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌ను ధర్మాసనం విచారణకు అనుమతించింది. శుక్రవారం ఈ పిటీషన్‌పై వాదనలు వింటామని తెలిపింది. కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిలో జస్టిస్ నరసింహారెడ్డిని వ్యక్తిగత ప్రతివాదిగా చేర్చడంపై రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపింది. పిటీషన్‌కు నెంబర్ ఇవ్వలేదు. దీనికి ఫైలింగ్ నెంబర్ ఇవ్వాలా వద్దా అనే అంశంపై గురువారం చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. మాజీ సీఎం కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఆదిత్య సొంధీ వాదనలు వినిపించారు. ఈనెల 19న జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి కమిషన్ తమ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. విద్యుత్ కొనుగోళ్లలో ఎక్కడా అవకతవకలు జరగలేదని కేసీఆర్ తన పిటీషన్‌లో పేర్కొన్నారు. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి ప్రెస్ మీట్ పెట్టి వివరాలు వెల్లడించంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తప్పు చేసిందనీ, దానివల్ల ప్రభుత్వంపై మోయలేని భారం పడిందంటూ ఆ ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడించారని వాదించారు. ఇప్పటికే గత ప్రభుత్వ ఒప్పందంపై జస్టిస్ నర్సింహారెడ్డి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నదనీ, ఈ దశలో నిష్పాక్షిక విచారణ సాగుతుందన్న నమ్మకం లేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సెక్షన్ 8బీ కింద నోటీసులు ఇవ్వడం కూడా చట్ట ప్రకారం సరికాదని చెప్పారు. కమిషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లోనే లోపాలున్నాయని వాదించారు. సోంది వాదనలపై అడ్వకేట్ జనరల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరం పైనే వాదనలు చెప్పాలని, మెరిట్స్ అవసరం లేదని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చుతూ నెంబర్ కేటాయించాలని ఆదేశించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ప్రత్యేక పరిస్థితుల్లో వాదనలకు అనుమతి ఇచ్చినట్టు ధర్మాసనం పేర్కొంది.

బొగ్గు నిల్వలు మెయింటెన్ చేయండి

- టీజీజెన్‌కో అధికారులకు ఇంధనశాఖ కార్యదర్శి రొనాల్డ్‌రోస్ ఆదేశాలు



ఇంధనశాఖ కార్యదర్శికి రొనాల్డ్‌రోస్‌కు అభినందనలు తెలుపుతున్న విద్యుత్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుదుత్పత్తి కేంద్రాల్లో సరపడా బొగ్గు నిల్వలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంధనశాఖ కార్యదర్శి రొనాల్డ్‌రోస్ టీజీజెన్‌కో అధికారులను ఆదేశించారు. గురువారంనాడిక్కడి విద్యుత్‌సౌధలో ఆయన జెన్‌కో, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్, సరఫరా స్థితిగతుల్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యుత్‌శాఖలో కొనసాగుతున్న వివిధ పనులు, ప్రాజెక్టుల వివరాలపై సమీక్ష చేశారు. 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌నూ సమీక్షించారు. క్షేత్రస్థాయి సిబ్బందిలో ఆత్మవిశ్వాసం,క్రమశిక్షణ పెంపొందించేలా పని ప్రణాళికలు ఉండాలని చెప్పారు. విద్యుత్ ఇంజినీర్లు ఎలాంటి ఎమర్జెన్సీ వచ్చినా క్షణాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐఏఎస్ అధికారి రొనాల్డ్‌రోస్ బుధవారం ఇంధనశాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

సెక్రెటరీకి విషెస్ చెప్పిన అసోసియేషన్ నేతలు

ఇంధనశాఖ కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రొనాల్డ్‌రోస్‌ను తెలంగాణ విద్యుత్ ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు అభినందించారు. బుధవారం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్ నెహ్రూ, ఎన్ భాస్కర్ రొనాల్డ్‌రోస్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యుత్‌రంగ ఉద్యోగులు, ఇంజినీర్ల సమస్యల్ని క్లుప్తంగా ఆయనకు వివరించారు. ఉద్యోగ సంఘాలతో పూర్తిస్థాయిలో భేటీ అయ్యి వారి సమస్యల్ని విని, పరిష్కరించే దిశగా కృషి చేస్తాననీ ఈ సందర్భంగా ఇంధనశాఖ కార్యదర్శి తెలిపినట్టు వారు చెప్పారు.

కేసీఆర్‌కు ఫిరాయింపులపై మాట్లాడే అర్హత లేదు : గజ్జల కాంతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు లేదని కాంగ్రెస్ నేత గజ్జల కాంతం విమర్శించారు. పార్టీ ఫిరాయింపులను తొలుత ప్రోత్సహించిందని బీఆర్ఎస్సేనని గుర్తు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యేలందరినీ బీఆర్ఎస్ ప్రభుత్వ క్యాబినెట్‌లో చేర్చుకోలేదా? సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కూడా కాంగ్రెస్ నుంచి వెళ్లిన వారే కదా? అని ప్రశ్నించారు. గంపగుత్తగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకునేటప్పుడు ఫిరాయింపుల చట్టం గురించి మర్చిపోయారా? అని ప్రశ్నించారు. సీబీఐ, ఈడీ రంగంలోకి దిగడం, కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడం దాదాపు ఖాయమైందన్నారు.

శాస్త్రీయంగానే నీటి వనరుల "వినియోగం"

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

శాస్త్రీయ ప్రణాళికల ఆధారంగా నీటి వనరులను వినియోగించాలని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి డాక్టర్ రాజీవ్‌గౌబా అభిప్రాయపడ్డారు. నీటి వనరులను జియో ట్యాగింగ్ చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఈమేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం జలశక్తి అభియాన్‌పై అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకులు, కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గౌబా మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అన్నీ నీటి వనరుల వివరాలను కూడా సిద్ధం చేయాలని అన్నారు. ఉపాధి హామి పథకం, కాంపా, ఫైనాన్స్ కమిషన్ తదితర పథకాల కింద లభించే నిధులను నీటి సంరక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని సూచించారు.

పార్టీ ఫిరాయింపులకు ఆద్యుడు కేసీఆరే

(మొదటిపేజీ తరువాయి)

ఓడించడం కోసం, గంపగుత్తగా బీజేపికి ఓట్లు వేశారని విమర్శించారు. కేటీఆర్ నియోజకవర్గంలో బీజేపీ మొదటి స్థానంలో, సిద్దిపేటలో బీజేపీ, కాంగ్రెస్‌కు సమానంగా ఓట్లు ఎలా వచ్చాయో పరిశీలిస్తే అర్థం అవుతుందన్నారు. మొన్నటి వరకు ఎమ్మెల్యేలను గేట్ల లోపలికి రానియ్యని కేసీఆర్, ఇప్పుడు పిలిచి భోజనాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీ పోయి మోడీ కాళ్లు పట్టుకుంటాం. కడుపుల దూరుతాం. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడతాం' ఇదే కదా కేసీఆర్ దిక్కుమాలిన ఆలోచన అని మండిపడ్డారు.ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ, రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఆహ్వానిస్తే రాలేదన్నారు. అవతరణ దినోత్సవాల్లో ప్రతిపక్ష నేతగా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కోరేందుకు కేసీఆర్‌కు సిగ్గుండాలని దుయ్యబట్టారు. దేశంలో ఎక్కడైనా ఇలాంటి సంప్రదాయం ఉందో ఆయనే చెప్పాలన్నారు. అదే పదేండ్లలో ప్రతిపక్ష నేతలను ఏనాడైనా సీఎం కేసీఆర్ పిలిచారా? అని ప్రశ్నించారు. ఏమాత్రమైనా ఉద్యమ నేతగా కేసీఆర్‌కు సోయి ఉండి ఉంటే, పదేండ్ల ఉత్సవాల్లో హుందాగా హాజరయ్యేవారని అన్నారు. స్వార్థం, దోపిడీ, తన కుటుంబానికే అన్ని ఉండాలనేది కేసీఆర్ కోరికని తెలిపారు. ఇవి ఎల్లకాలం వాళ్లను బతికించవని విమర్శించారు.

రాహుల్ గాంధీ హామీ 100 శాతం పక్కా

ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తెలంగాణ ఇస్తానని 2004లో కరీంనగర్‌లో ఇచ్చిన హామీని సోనియా గాంధీ నిలబెట్టుకున్నారని సీఎం గుర్తు చేశారు. అలాగే రాహుల్ గాంధీ హామీ ఇచ్చారంటే, అది 100 శాతం అమలవుతుందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతు రుణమాఫీ చేస్తానని రాహుల్ హామీ ఇచ్చారని, అందులో భాగంగానే దాదాపు రూ.31 వేల కోట్లతో ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయాలని నిర్ణయించుకుందని అన్నారు. ఇందుకోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని, పాలనను గాడిలో పెట్టామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక క్రిస్మస్, రంజాన్, శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి వచ్చాయని, అయితే ఇప్పటి వరకు చిన్న సంఘటన జరగకుండా శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నట్లు వివరించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఏపీలో 40, 50 మంది అధికారులను బదిలీ చేస్తే, తెలంగాణ లో ఏ చిన్న బదిలీ లేదన్నారు. ఎన్నికల నిర్వహణలో బీఆర్ఎస్‌తో పాటు రాజకీయ ప్రత్యర్థులు కూడా తమపై ఎలాంటి ఆరోపణ చేయలేకపోయారన్నారు. వచ్చే నెల 7తో తన పీసీసీ పదవీకాలం ముగుస్తున్నందున ఆలోపే నూతన పీసీసీ అధ్యక్షుడిని నియమించాలని పార్టీ అధ్యక్షుడు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను కోరినట్లు తెలిపారు

విద్యా శాఖకు నేను ఫుల్ టైం మంత్రిని

మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగా తానేమి ఫాంహౌజ్‌లో పడుకొని ప్రభుత్వాన్ని నడపడం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర విద్యా శాఖకు తాను ఫుల్ టైం మంత్రినని చెప్పారు. రాష్ట్రంలో ఏ శాఖ ఖాళీగా లేదని, అన్ని శాఖలకు సమర్థవంతమైన మంత్రులు ఉన్నారని అన్నారు. పక్క రాష్ట్రాలైన ఏపీ, కర్నాటకలోని మంత్రులు నిర్వహిస్తోన్న శాఖలు, తెలంగాణ రాష్ట్ర మంత్రుల పనితీరును పోల్చి చూడాలన్నారు. ఎవరైనా తెలంగాణ కన్నా ముందుంటే, బాగా పాలన చేస్తే చెప్పాలని సవాల్ విసిరారు. తమ లాగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతుల కోసం కేంద్రం మంత్రులను బీజేపీ పాలిత సీఎంలు, మంత్రులు కలవడం లేదన్నారు. బేషజాలానికి పోకుండా ప్రతి మంత్రిని కలిసి రాష్ట్రానికి సహకారం అందించాలని కోరుతున్నామన్నారు. రాజకీయ పార్టీలు నడిపే మీడియా సంస్థలు, ఆ పార్టీల ప్రయోజనాల కోసం, పూర్తిస్థాయి మంత్రులు లేరంటూ విష ప్రచారం చేయడం వల్ల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. తన వద్ద ఉన్న విద్యా శాఖలో క్రియాశీలక మంత్రిగా సమర్థవంతంగా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్, ఇంజినీరింగ్, నీట్ పరీక్షలు, డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉన్నామా? అని ప్రశ్నించారు. విద్యా శాఖలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా తమ పాలనలో ఎక్కడైనా లోపాలు జరిగితే చెప్పాలని సవాల్ విసిరారు. ఏపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంసెట్ ఫలితాలను కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. క్యాలెండర్ ఇయర్‌ను అమలు చేసేలా నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. ఇక ఇప్పటి వరకు రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని సీఎం స్పష్టత ఇచ్చారు. కానీ, పలు మీడియా సంస్థలు, మంత్రి వర్గ విస్తరణ చర్చలు చేసి, శాఖలు కేటాయించి, ప్రమాణ స్వీకారానికి ముహుర్తాలు పెట్టారని చురకలంటించారు.

త్వరలో ప్రధానిని కలుస్తాం

కొత్త ప్రభుత్వం పెట్టే బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించేందుకు కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. త్వరలోనే ప్రధాని, హోంమంత్రిని కలవనున్నట్టు చెప్పారు. రాష్ట్రం హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలను కొనసాగించాలని తమ ప్రభుత్వం అనుకుంటుందని తెలిపారు. 'ఇప్పుడు పరిపాలన చేసే సమయం కాబట్టి వచ్చే బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయించాలని అందరినీ కలుస్తాం. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలపై త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసుకుని, కేంద్రం నుంచి నిధులు, అనుమతులు, ఏపీతో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తాం. చంద్రబాబుతో వీలైనమేరకు సమస్యలను సానుకూలంగా పరిష్కరించు కుంటాం. కేంద్రం వల్ల కూడా కాకపోతే సమస్యల పరిషారానికి కోర్టులున్నాయి. పక్కరాష్ట్రం అభివృద్ధి చెందితే అసూయపడం. మా రాష్ట్ర అభివృద్ధికి అలసత్వం ప్రదర్శించం' అని తేల్చి చెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణాన్ని చేస్తున్నామని, రాష్ట్రాన్ని ఒక రోల్ మోడల్ స్టేట్‌గా తీర్చిదిద్దుతామని సీఎం అన్నారు. దానికోసం రాష్ట్ర పురోగతికి రోజుకు 18 గంటలు కష్టపడుతున్నట్లు చెప్పారు. విద్యుత్తు కొనుగోళ్ల మీద విచారణ కమిషన్‌ను తాము ప్రతిపాదించలేదని, జగదీశ్‌రెడ్డి విద్యుత్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాది నిర్మాణానికి అసెంబ్లీలో విసిరిన సవాల్‌ను స్వీకరించినట్లు చెప్పారు. విచారణ కమిషన్ కోసం సిట్టింగ్ జడ్జిని కేటాయించాలని హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను అడిగితే రిటైర్డు జడ్జిని నియమించుకోవచ్చని అన్నారని చెప్పారు. కమిషన్ ఏర్పాటు తర్వాత మూడు నెలలు దాకా టీఆర్ఎస్, కేసీఆర్ ఏం మాట్లాడలేదని, కేసీఆర్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని లేఖ రాగానే ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. విచారణ కమిషన్ వేయడం తప్పా? కేసీఆర్‌ను వివరణ ఇవ్వాలని అడిగినందుకు తప్పుపడుతున్నారా? జస్టిస్ నరసింహారెడ్డిని తప్పుపడుతున్నారా? అనేది బీఆర్ఎస్ నేతలు స్పష్టత ఇవ్వాలన్నారు. జస్టిస్ నరసింహారెడ్డి లోపాలు ఏమైనా ఉంటే కేసీఆర్ విచారణకు వెళ్లి అనుభవాన్ని, అద్భుతంగా వాదించుకోవచ్చు కదా అని అన్నారు. వారు కోరుకుంటే లైవ్ టెలికాస్ట్‌కు ప్రభుత్వం కూడా కమిషన్‌కు విజ్ఞప్తి చేస్తుందన్నారు.

గోతికాడి నక్కలకు..

అనుభవంతో రిప్లై ఇచ్చారు

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి ఇబ్బంది కలగకుండా పార్టీ చర్యలు చేపడుతుందని హామీ ఇచ్చారన్నారు. ఈ విషయంలో పీసీసీ చీఫ్, సీఎంగా అధిష్టానం ఆదేశాలను పాటిస్తానని స్పష్టం చేశారు. రుణమాఫీ, ప్రభుత్వ పాలనతో జీవన్ రెడ్డి అనుభవాన్ని ఉపయోగించు కుంటామన్నారు. నేతల్లో చిన్న చిన్న విభేదాలు ఉన్నా... ఆఖరుకు కాంగ్రెస్ పార్టీనే తమలో ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

సింగరేణికే 15 బ్లాకులు కేటాయించాలి

- సకల జనుల సమ్మె తరహాలో ఉద్యమం
- ప్రయివేటు సంస్థలకు లాభాలు తప్ప దేశ ప్రయోజనాలు పట్టవు
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు
- ఎస్‌వీకే ఆధ్వర్యంలో 'ఎవరి కోసం బొగ్గుగనుల వేలం' వెబినార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో గుర్తించిన 15 బొగ్గు బ్లాకులనూ సింగరేణి సంస్థకే కేటాయించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సకల జనుల సమ్మె తరహాలో ఉద్యమం చేయాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. దీనికి కారణం మీరంటే మీరు అని నిందలు మోపుకోవడానికి పరిమితం కావొద్దని సూచించారు. బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ అన్ని పార్టీలు, కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకుని సింగరేణిపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బొగ్గు బ్లాకుల వేలం ఎవరి కోసం అనే అంశంపై ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ అధ్యక్షతన వెబినార్ నిర్వహించారు. అందులో నరసింహారావు మాట్లాడుతూ.. కార్పొరేట్లకు మరింత సులువుగా బొగ్గు బ్లాకులు దక్కేలా ఎమ్ఎమ్‌టీఆర్ యాక్టు రద్దు చేసి కమర్షియల్ మైనింగ్ సిస్టమ్‌ను మోడీ సర్కారు తీసుకొచ్చిందన్నారు. 550 బ్లాకులను గుర్తించి కార్పొరేట్లకు కట్టబెట్టే పనికి పూనుకున్నదనీ, అందులో భాగంగానే బ్లాకుల వేలం ప్రక్రియ జరుగు తున్నదని విమర్శించారు. మోడీ సర్కారు, రాష్ట్రంలోని అప్పటి కేసీఆర్ ప్రభుత్వ అండదండలతో కోయగూడెం బ్లాకును అరబిందో ఫార్మా దక్కించుకున్నదని విమర్శించారు. పది నుంచి 15 ఏండ్ల కాల వ్యవధిలో సింగరేణి సంస్థకు కేటాయించిన బొగ్గు నిల్వలు అయిపోతాయనీ, బ్లాకులు లేకపోతే సింగరేణి మనుగడ ఏంటని ప్రశ్నించారు. సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వానిది కాదా? వేలం ప్రక్రియలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎందుకు పాల్గొన్నారు? సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనాలని ఆదేశాలివ్వడమేంటి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సింగరేణి సంస్థ రూ.3,500 నుంచి రూ.4 వేలకు చొప్పున టన్ను బొగ్గు ఇస్తున్నదనీ, దీని ద్వారా రాష్ట్ర ప్రజలపైనా, పరిశ్రమలపైనా తక్కువ విద్యుత్ భారం పడుతున్నదనీ, రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం సాధ్యమవు తున్నదని వివరించారు. ఏపీ ప్రభుత్వానికి బొగ్గు అవసరమైతే అదానీ సంస్థ ద్వారా రూ.18 వేల టన్ను చొప్పున కొనుగోలు చేసేలా మోడీ ప్రభుత్వం ఒప్పందం కుదిర్చిందని విమర్శించారు. ప్రయివేటు సంస్థలు తమ లాభాల కోసం పనిచేస్తాయి తప్ప వాటికి ప్రజా ప్రయోజనాలు పట్టవని విమర్శించారు. ఇండోనేషియా నుంచి తక్కువ క్వాలిటీ బొగ్గు తీసుకొచ్చి దాని నాణ్యతను మూడు రెట్లు పెంచి అదానీ సంస్థలు కొన్ని వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 9 ఏండ్లలో 50 వేల కోట్ల రూపాయలను సింగరేణి ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రయివేటు సంస్థలు తీసిన బొగ్గును, లాభాలను లెక్కల్లో చూపెడుతున్నాయా? లక్ష టన్నులు తీసి రూ.50 వేల టన్నులు కూడా తీయడం లేదని చెప్పడం లేదా? అని ప్రశ్నించారు. సింగిల్ విండో పద్ధతిలో ప్రయివేటు సంస్థలకు అన్ని అనుమతులూ ఒకే సారి ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం నైనీ బ్లాకు విషయంలో సింగరేణికి అలా ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. బ్లాకులు కేటాయించకపోవడం వల్ల ఒక్క సింగరేణి కార్మికులకు, పెన్షనర్లకు మాత్రమే కాదు రాష్ట్ర ప్రజలందరికీ నష్టమేనని చెప్పారు.

ఆ రెండు పోస్టులకు పోచారం, ఆకునూరి మురళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ కమిషన్, విద్యా కమిషన్లను ఏర్పాటు చేస్తామంటూ గతంలో ప్రకటించిన సీఎం రేవంత్.. అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వాటికి చైర్మెన్లుగా ఆయా రంగాల్లో నిష్ణాతులైన వ్యక్తులను నియమించాలని ఆయన యోచిస్తున్నారు. వ్యవసాయ కమిషన్‌కు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని, విద్యా కమిషన్ చైర్మెన్‌గా మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళిని ఎంపిక చేసేందుకు సీఎం ఇప్పటికే నిర్ణయించినట్టు సమాచారం. ఆ మేరకు ఆయన కాంగ్రెస్ అధిష్టానానికి సమాచారాన్ని చేరవేసి, ఒప్పించినట్టు తెలిసింది. ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి... పార్టీలో ఇటీవలి చేరికలు, అదే సమయంలో అంతర్గతంగా నెలకొన్న సమస్యలపై ఏఐసీసీ పెద్దలతో చర్చలు జరిపిన సంగతి విదితమే. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం పార్టీలో చేరిన మాజీ స్పీకర్, బాల్కొండ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించినట్టు సమాచారం. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేసిన ఆయన స్వయంగా వ్యవసాయదారుడనే విషయాన్ని రేవంత్ ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ఆయనకు ఆ రంగంలో ఉన్న అపార అనుభవం, రాజకీయంగా ఉన్న సీనియార్టీ రీత్యా మంత్రి పదవినిచ్చి గౌరవించాలనే భావన ఉన్నప్పటికీ...అదే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నేత సుదర్శన్‌రెడ్డిని కాదని, పోచారానికి మంత్రిపదవినివ్వటం నైతికంగా సరైంది కాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పని చేసిన సుదర్శన్‌రెడ్డి... తెలంగాణ వచ్చిన తర్వాత ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్‌నే అంటిపెట్టుకుని ఉన్నారని ఆయన గుర్తు చేశారు. అందువల్ల ఆయనకే మంత్రి పదవిని కట్టబెట్టాలని అధిష్టానాన్ని కోరారు. ప్రతిగా వ్యవసాయ కమిషన్ చైర్మెన్ పోస్టును పోచారానికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు విద్యారంగంపై అపార అనుభవమున్న విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళిని విద్యా కమిషన్ చైర్మెన్‌గా నియమిస్తే ఆ రంగానికి న్యాయం జరుగుతుందంటూ సీఎం కాంగ్రెస్ అధిష్టానానికి వివరించారు. ఈ నేపథ్యంలో త్వరలోనే ఆయా కమిషన్లను ఏర్పాటు చేయనున్నారని ఉన్నతాధికారులు తెలిపారు.

హెచ్‌సీయూ వీసీని తొలగించాలి

- ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థుల డిమాండ్
- విద్యార్థి నాయకులపై కక్షపూరిత చర్యల పట్ల ఆగ్రహం
- రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- దిష్టిబొమ్మలు దహనం



నవతెలంగాణ-హిమాయత్ నగర్/విలేకరులు

హెచ్‌సీయూలో విద్యార్థి సంఘం నాయకుల అక్రమ సస్పెన్షన్‌పై రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వీసీని తొలగించాలంటూ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై నిరంతర అలుపెరగని పోరాటాలు చేయడం.. ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి గెలుపును ఓర్వలేకే విద్యార్థి నాయకులను సస్పెండ్ చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ వీసీ దిష్టిబొమ్మలు దహనం చేశారు.ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నారాయణగూడ చౌరస్తా వద్ద హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు లెనిన్ గువేరా మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడితో పాటు మరో నలుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారని, ఐదుగురికి రూ.10,000 వేల చొప్పున జరిమానా విధించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఫెలోషిప్, హాస్టల్ సమస్యలపై శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై వీసీ నిరంకుశంగా వ్యవహరించడమే కాకుండా.. సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే సస్పెండ్ నిర్ణయాన్ని, పది వేల ఫైన్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో వీసీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమాన్, స్టాలిన్, లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు సహన, రాజేష్, భగత్ తదితరులు పాలొన్నారు.అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న హెచ్‌సీయూ వీసీని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులు కాకతీయ యూనివర్సిటీ గేట్-2 వద్ద దిష్టిబొమ్మ దహనం చేశారు. జనగామ, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లో వీసీ దిష్టిబొమ్మలు దహనం చేశారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గతంలో రోహిత్ వేముల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆత్మహత్య చేసుకున్నారని, ఇప్పుడు కూడా వర్సిటీలో అలాంటి పరిస్థితులే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీసీని వెంటనే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు, సస్పెన్షన్ ఎత్తేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద యూనివర్సిటీ వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ వీసీ నియంతృత్వ పోకడలు అవలంబిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులపై కేసులు పెట్టిన మరుసటి రోజే సస్పెండ్ చేయడం కుట్ర పూరితమేనన్నారు.ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులపై వీసీ, పాలకవర్గం కక్షకట్టి అక్రమ కేసులు మోపి, సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దనియాకుల శ్రీకాంత్ వర్మ అన్నారు. నల్లగొండలో వీసీ దిష్టిబొమ్మను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో వీసీ దిష్టిబొమ్మ దహనం చేశారు.

చెంచు మహిళపై అమానుష దాడి దోషులను కఠినంగా శిక్షించాలి

- నిమ్స్‌లో బాధితురాలిని పరామర్శించిన మాజీ ఎంపీ మిడియం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం మూలచింతపల్లి గ్రామానికి చెందిన ఆదిమ తెగ చెంచు మహిళపై దాడి చేసిన దోష లను కఠినంగా శిక్షించాలని మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు కిడ్నాప్, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలనీ, ఆమె భూములను కాజేసిన పెత్తందారుల నుంచి తిరిగి వాటిని ఇప్పించాలని డిమాండ్ చేశారు. గురువారం నిమ్స్ ఆస్పత్రిలో బాధితురాలు ఈశ్వరమ్మ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిమ తెగ మహిళ ఈశ్వరమ్మపై దాడి అమానుషమనీ, ఇలాంటి దాడులు సభ్య సమాజం తల దించుకునేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈశ్వరమ్మ కుటుంబానికి చెందిన భూమిని ఆక్రమించేందుకు పెత్తందారులు ప్రయత్నించారనీ, వారి మాట పెడచెవినపెట్టడం వల్లే ఈ రకమైన దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఆ గ్రామంలో అనేక మంది చెంచుల భూములను పెత్తందారులు కాజేశారని పేర్కొన్నారు. ఈశ్వరమ్మపై దాడి చేసిన బండి వెంకటేశం, బండి శివమ్మ, శివుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె కుటుంబానికి 10 ఎకరాల భూమి, రూ.50లక్షల నష్ట పరిహారం, ఇల్లు కట్టించి, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఉపాధ్యక్షులు తొడసం భీంరావు, బండారు రవికుమార్ పాల్గొన్నారు.

ధరలు, నిరుద్యోగం ఊసే లేదు

(మొదటిపేజీ తరువాయి)

చెందుతోంది. ప్రధానమంత్రి నుంచి కానీ, విద్యా మంత్రి నుంచి కానీ అలాంటి ప్రకటన లేదు. ఎన్టీఏను రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తే దానిపై ఎలాంటి చర్యలు లేవు. బీజేపీ ఎంపీ మాదిరిగా 1975 ఎమర్జెన్సీ గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. గత పదేళ్లుగా దేశంలో మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తోందన్నది మరచి పోయారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు తగ్గాయని ఇది ప్రభుత్వ గొప్పతనంగా రాష్ట్ర పతి పేర్కొన్నారు. నిజానికి అవి తగ్గలేదు. బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసి తగ్గినట్టుగా చూపారు. వివక్షాపూరితమైన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను గొప్పగా చూపించే ప్రయత్నం చేశారు. మత పరంగా వివక్ష చూపుతున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా ఆందోళనలు సాగితే దాని గురించి ప్రస్తావించకుండా విదేశాల నుంచి వచ్చే శరణార్థులకు హుందాగా జీవించేందుకు ఇది ఉపయోగపడుతుందని రాష్ట్రపతి సెలవిచ్చారు.మహిళా సాధికారతకు 'నారీ శక్తి వందన్ అధిరనయం' ఎంతగానో తోడ్పడుతోందని, అలాగే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామని రాష్ట్రపతి తన ప్రసంగంలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ పథకాలు చాలా వరకు ప్రచారానికే పరిమితమయ్యాయి. ఆరెస్సెస్ డ్రీమ్ ప్రాజెక్టుల్లో ఒకటి అయిన ప్రకృతి సేద్యాన్ని గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రత్యేకించి ప్రస్తావించారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందున ఆర్గానిక్ పంటలకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. శ్రీలంకలో దారుణ ఆహార సంక్షోభానికి ముఖ్య కారణాల్లో ఒకటి ఈ ప్రకృతి సేద్యం అన్న విషయం మరచిపోరాదు. తొలుత రాష్ట్రపతికి గజ ద్వారం వద్ద ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు రాజ దండంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమెతో కలిసి సభ లోపలికి వెళ్లారు. పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది ఎంపిలుగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ప్రజల విశ్వాసాన్ని గెలిచి సభకు ఎన్నికయ్యారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయరని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో సభ్యులు విజయవంత మవుతారని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. సీఏఏ ప్రకారం శరణార్థులకు ప్రభుత్వం పౌరసత్వం మంజూరు చేయడం ప్రారంభించిందని అన్నారు. జులై ఒకటి నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి రానున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కించపరిచే ప్రతి ప్రయత్నాన్నీ ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. జమ్ముకాశ్మీర్‌పై శత్రువులు అంతర్జాతీయ వేదికలపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కానీ, ఈ ఎన్నికల్లో కాశ్మీర్ లోయలో మార్పు కనిపించిందని పేర్కొన్నారు. శత్రువుల కుట్రలకు అక్కడి ప్రజలు గట్టిగా బదులిచ్చారన్నారు. అక్కడి ప్రజలు పెద్దయెత్తున ఓటింగ్‌లో పాల్గొనడం విశేషమని అన్నారు. 'మన దేశ ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్దవి. సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు ఈసీకి అభినందనలు. ప్రజలు ప్రభుత్వాన్ని విశ్వసించి మళ్లీ పట్టం కట్టారు. ప్రభుత్వ సుస్థిరత, నిజాయతీని నమ్మారు. ఈ ఎన్నికల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రిఫార్మ్ పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైంది. పెట్టుబడులు, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది.' అని రాష్ట్రపతి అన్నారు. గరీబ్ కల్యాణ్ యోజన కింద పేదలకు ఉచితంగా రేషన్ సరఫరా చేస్తున్నామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని, ఆయుష్మాన్ భారత్ అనేది గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని అన్నారు. 'వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొచ్చాం. అన్ని రంగాల్లో భారత్ బలంగా విస్తరిస్తోంది. ఉద్యోగాల కల్పనలోనూ ప్రభుత్వం కృషి చేస్తోంది. సర్వీస్ సెక్టార్లను కూడా ప్రభుత్వం బలపరుస్తోంది. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది.' అని వివరించారు.

పార్లమెంట్‌లో రాజదండం తీసివేయాలని ఎస్పీ ఎంపీ డిమాండ్ చేశారు. అలాగే ఆప్ ఎంపీలు కేజ్రీవాల్ అరెస్టు నిరసిస్తూ..సభ నుంచి వాకౌట్ చేశారు. శుక్రవారం నీట్ లీకు అంశాలను ప్రస్తావించనున్నామని ప్రతిపక్ష సభ్యులు తెలిపారు.

రూర్కీలో 'కాళేశ్వరం' మోడల్ స్టడీస్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన డిటెయిల్డ్ ఎవల్యూషన్ మోడల్‌ను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ ఈఎన్సీలు బి అనిల్ కుమార్, నాగేందర్‌రావుల నేతృత్వంలోని ఇంజినీర్ల బృందం ఉత్తరా ఖండ్‌లోని రూర్కీ ఇన్‌స్టిట్యూట్‌కు తరలివెళ్లింది. ప్రధానంగా మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన పూర్తి నిర్మాణాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధ్యయనం చేస్తున్నది. బ్యారేజీలో 20వ పిల్లర్ కుంగుబాటు వల్ల కలిగే నష్టాలు, ఇతర బ్లాక్‌లపై దాని ప్రభావం ఎలా ఉండబోతున్నది? వరదలతో అదనంగా ఏమైనా దెబ్బతినే అవకాశముందా? తదితర అంశా లపై కూలం కషంగా తెలుసుకుంటున్నది. కంప్యూటర్ ఆధారిత బ్యారేజీ నమూనాలను సైతం అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ పర్యటన శుక్రవారం కూడా కొనసాగనుందని ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. అనిల్‌కుమార్ 'నవతెలంగాణ'కు తెలిపారు.



నవతెలంగాణ- మలక్ పేట్

జులై 17 నుంచి 31 వరకు జరగనున్న డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు విద్యార్థి నేత సురేష్ కుమార్ నేతృత్వంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ ఖాళీలను 25 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ - చైతన్యపురి

కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ నుండి దిల్‌సుఖ్‌నగర్ వైపు అతివేగంగా వస్తున్న కారు.. టీప్పీ టాప్పీ బేకరీకి ఎదురుగా వీవీనగర్ వెళ్లే దారి దగ్గర ఫుట్ పాత్ క్రాస్ చేస్తున్న వ్యక్తిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందగానే వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మరణించాడని పోలీసులు తెలిపారు. అతని వయస్సు దాదాపు 54 సంవత్సరాలు ఉంటాయని అంచనా వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలి

- కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి

నవతెలంగాణ - సంతోష్‌నగర్

ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులందరీపై ఉందిన కార్పొరేటర్ శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి డివిజన్లోని పలు కాలనీలలో ఉన్న సమస్యలపై ఈఈఎస్ఎల్ అధికారులతో, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్‌లతో గురువారం సమీక్షా సమావేశం నిర్వ హించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నూతన వీధి దీపాలు, పోల్స్ అవసరమున్నాయని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టి లో పెట్టుకొని ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకా సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, ఏ ఈ, లైన్మెన్ నరసింహ, ఈ ఈ ఎస్ ఎల్ డిపార్ట్మెంట్ ఏ.ఈ హకీమ్, రహీం సిబ్బంది పాల్గొన్నారు.



దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసిన పీ.వీ

- జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు

నవతెలంగాణ-కల్చరల్

ఆర్థిక సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో ఉంచేందుకు నాటి ప్రధానిగా పీ.వీ.నరసింహా రావు తీసుకున్న చర్యలు తదుపరి పాలకులకు మార్గ నిర్దేశనం చేశాయని జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా పీ.వీ. నరసింహారావు జయంతి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు పాల్గొని మాట్లాడారు. దేశ అత్యున్నత స్థానం ప్రధాని పదవిని చేపట్టిన పీ.వీ.తెలుగు వారు కావటం జాతి అంతటికీ గర్వ కారణం అన్నారు. మైనారిటీ ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ఐదేండ్ల కాలం నడిపిన అయన అపర చాణక్యుడు, మేధావి అని మేధావులు రాజకీయ వేత్తలు ప్రశంసించిన విషయం గుర్తు చేశారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పీ.వీ. నరసింహా రావు బహు భాషా కోవిదుడు అని వివరించారు. గాయకులు త్రినాథ రావు, శ్రీధర సుబ్రహ్మణ్యం, సంఘ సేవకుడు పబ్బ వైకుఠం పాల్గొన్నారు.



భాష్యం విద్యార్థులను వరించిన గోల్డ్ మెడల్



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ గ్రూప్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో భాష్యం ఉన్నత పాఠశాల సంతోష్ నగర్ శాఖ విద్యార్థులు గణిత, సామాన్య శాస్త్రాలలో సత్తా చాటి తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఈ మేరకు పాఠశాల సీఈఓ చైతన్య మాట్లాడుతూ మొత్తం 8 పతకాలు వచ్చాయన్నారు. అందులో 5 రజత పతకాలు, 2 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో కాబోయే శాస్త్రవేత్తలు మా భాష్యం విద్యార్థులు అని కొనియాడారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులను ప్రత్యేక మెమొంటో, పత్రాలను జెడ్‌ఈవో అంకమ్మరావు, ప్రిన్సిపాల్ దేవదాస్, పాఠశాల సీఈఓ అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందంతో కలిసి సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



యోగాతో మానసిక ప్రశాంతత

రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ

నవతెలంగాణ - చైతన్యపురి

యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సహజ యోగ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరి కృష్ణ అన్నారు. గురువారం ఆర్కే పురంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సహజ యోగ ద్యానం కార్యక్రమం ఉంటుందన్నారు. అందరికీ ఆహ్వానం పూర్తిగా ఉచితంగానే ఉంటుందని తెలిపారు. మాతాజీ నిర్మలా దేవి స్థాపించిన సహజ యోగ నేడు సుమారు 170 దేశాల్లో వ్యాప్తించి ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది కుల, మత, ప్రాంత, వయసుతో సంబంధం లేకుండా సహజ యోగ సాధన చేస్తూ.. తాము ఎదుర్కొంటున్న శారీరక, మానసిక భావోద్వేక సమస్యలను పరిష్కరించుకుంటూ ఆధ్యాత్మికతమైన సంతృప్తిని పొందుతున్నారని వివరించారు. జూన్ 26 నుండి 30 వరకు సుమారు 500 మంది ప్రతినిధులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి అతిథులు వచ్చి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, సుబ్బిరెడ్డి, కమిటీ మెంబర్స్ సుప్రజ, సభ్యులు సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా అభిప్రాయాలకు వ్యతిరేకంగా అండర్ పాస్ చేపట్టొద్దు'



నవతెలంగాణ-హయత్ నగర్

ప్రజా అభిప్రాయాలకు వ్యతిరేకంగా అండర్ పాస్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టొద్దని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడ నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధిలో భాగంగా దుర్గా విలాస్ హెూటల్ నుండి ఆటో నగర్ వరకు చేపట్టిన అండర్ పాస్ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డిలతో పాటు బీజేపీ నాయకులు అడ్డుకు న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ పాస్ రోడ్డుకు సంబంధించిన పూర్తి వివరాలు ఆర్ అండ్ బీ శాఖ అధికారులు ప్రజలకు వివరించిన తర్వాతనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పరిధి అయిన ఈ ప్రాంతంలో పిల్లర్లతో కూడినటువంటి ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలన్నారు. మట్టితో కూడిన ఎత్తయిన రోడ్డుకు ఇరువైపులా ప్రహరీ నిర్మాణం వల్ల వ్యాపారాలకు అంతరాయం, కాలనీలకు కనెక్టివిటీ రోడ్లు లేకపోతే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి ఆర్ అండ్ బీ శాఖ అధికారులు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందని, లేదంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, బండారి భాస్కర్, మాజీ కౌన్సిలర్ అంజన్ కుమార్, జిక్కిడి ప్రభాకర్ రెడ్డి, నూతి శ్రీనివాస్, విజయ్ కుమార్, మునగాల హరీష్ రెడ్డి, ముత్యం రెడ్డి, ఎల్లారెడ్డి, కవితా రెడ్డి, కదారి యాదగిరి, ప్రవీణ్ కుమార్, పారంద సాయి వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు.

అనుమతి లేని స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని వినతి



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలను అతిక్రమించిన స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మండల విద్యాధికారి కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ మెట్ మండలం పసుమాముల గ్రామ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎక్సెల్సియా స్కూలు నిర్వహిస్తుండడంతో గతంలోనే మండల విద్యాశాఖ అధికారులు సీజ్ చేయడం జరిగిందన్నారు. తిరిగి స్కూల్ నిర్వాహకులు స్కూల్‌ను నడపడంతో మండల విద్యాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. స్కూల్‌లో పాఠ్య పుస్తకాలు, స్కూల్‌కు సంబంధించిన ఏకరూప దుస్తువులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు అతిక్రమిస్తున్న ఈ స్కూల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికుమార్, వంశీ తదితరులు ఉన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ - మీర్ పేట్

బాలాపూర్ మండలం లోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 24 మందికి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ తహశీల్దార్ మణిపాల్ రెడ్డిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కార్పొరేటర్ గజ్జల రాంచందర్, మేనేజర్ వెంకట్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల కూల్చివేత



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9వ డివిజన్ నందీహిల్స్ లో ఏలాంటి అనుమతి తీసుకోకుండా నిర్మాణం చేసి షెడ్డు వేసి వ్యాపారం చేస్తున్న పందెంకోడి షాపును టౌన్ ప్లానింగ్ అధికారి మహేష్ ఆధ్వర్యంలో పోలీసుల భద్రతతో జేసిపి సహాయం కూల్చివేసెనట్లు కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఎవరు ఏలాంటి నిర్మాణం చేసిన మున్సిపల్ అనుమతి తీసుకుని నిర్మాణం చేయాలని సూచించారు. లేనియెడల ఎంత పెద్ద వారైనా అనుమతి లేకుండా నిర్మాణం చేస్తే కూల్చేస్తామని చెప్పారు. అందుకు ప్రతిఒక్కరు మున్సిపల్ అనుమతి పొంది నిర్మాణాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సత్యనారాయణ, మైకాంత్, మహేష్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గత ఘటనలు పునరావృతం కాకూడదు

- కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ - సంతోష్‌నగర్

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్‌లోని బైరమల్ గూడ సాయి నాగర్ కాలనీ జీహెచ్ఎంసీ నిధులు రూ.60లక్షలతో చేపట్టిన వరద నీటి కాలువ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ బైరమల్ గూడ సాయి నాగర్ కాలనీ నందు వరద నీటి నివారణ కోసం వరద నీటి కాలువ నిర్మాణ పనులు మొదలుపెట్టినట్టు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మాణ పనుల నేపథ్యంలో కాలనీ వాసులకు కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. పనులు పూర్తయ్యే వరకు స్థానికులు సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ ప్రెసిడెంట్ బలరాజ్, కాలనీ వాసులు రాములు, శ్రీనివాస్, లింగయ్య, బీజేపీ సీనియర్ నాయకులు బాల కృష్ణ రెడ్డి, శ్రవణ్, వెంకటేష్, వేణుగోపాల్, రవి, నాయకులు పాల్గొన్నారు.



సత్యనారాయణ స్వామి వార్షికోత్సవంలో ఉప్పల



నవతెలంగాణ - నాగోల్

దిల్‌సుఖ్‌నగర్‌లోని లలిత నగర్‌లో ఉన్న శ్రీ కంచి కోటి పీఠం గడ్డి అన్నవర క్షేత్రం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయంలో సత్యనారాయణ స్వామి 22వ వార్షికోత్సవం, సత్యనారాయణ స్వామి వ్రతాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల శ్రీరామ చరణ్ శర్మ, టీవీ5 ఆస్థాన పండితులు, ఆలయ ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, చైర్మన్ కూర నరసింహా తదితరులు పాల్గొన్నారు.



హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని గురువారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు.
నవతెలంగాణ - హస్తినాపురం

భారీగా ట్రాఫిక్ జామ్..





కొత్తపేట నుండి నాగోలుకు వెళ్లే దారిలోని రంజిత్ బారు వద్ద ఉన్న చౌరస్తాలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి చైతన్యపురికి చెందిన ముగ్గురు ట్రాఫిక్ సిబ్బంది, ఒక పెట్రోలింగ్ వాహనం తీవ్ర ప్రయత్నాలు చేశారు. దీనికి తోడు వర్షం పడడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్లడంతో ట్రాఫిక్ మళ్లింపునకు చాలా సమయం పట్టింది.

హెలెన్ కెల్లర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

నవతెలంగాణ- మలక్‌పేట్

మలక్‌పేట్ దివ్యాంగుల సంక్షేమ భవన్ ఆవరణలో దివ్యాంగుల ఉద్యమ సారథి హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా గురువారం ఆమె విగ్రహాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యాసంస్థల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. అనంతరం హెల్ కెల్లర్ చేసిన సేవలను కొనియాడారు.





పిట్టల భాస్కర్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-మల్కాజిగిరి

బీసీ సంఘం నాయకులు పిట్టల భాస్కర్ నేత పుట్టినరోజును పురస్కరించుకొని భరత్ నగర్, బీసీ భవన్ లో బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న ఆధ్వర్యంలో బీసీ సంఘం నాయకులు, శ్రేయోభిలాషులు, తదితరులు ఆయనను కలిశారు. భాస్కర్ నేతను పూల దండలతో సత్కరించి శాలువతో ఘనంగా సన్మానించి వారి చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి రొయ్యల కష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బత్తిని నర్సింహా గౌడ్, జిణికుంట్ల రమేష్ గౌడ్, కార్యదర్శులు కాసర్ల నాగరాజు, పేపర్ శ్రీనివాస్ నేత, జోగు శ్రీనివాస్ కురుమ, మల్కాజిగిరి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెరుకు సాంబరాజ్ ముదిరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం



నవతెలంగాణ-ఉప్పల్

రామంతాపూర్ లో నూతనంగా ఎన్నికైన నూతన కమిటీ సంఘ సభ్యులను గురువారం ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షులు పింజర్ల రఘు యాదవ్, ప్రధాన కార్యదర్శి చెట్టబోయిన అశోక్ యాదవ్, కోశాధికారి అల్లడి రాము యాదవ్, కార్యదర్శి సర్వ ఆనంద్ యాదవ్, యూత్ ప్రెసిడెంట్ చెట్టబోయిన సురేష్ యాదవ్, సంఘ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం కలిశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజక వర్గంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన సమస్యలైన అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ల కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని, నూతన లైబ్రరీకి ప్రభుత్వ స్థలం కేటాయించాలని, అల్వాల్‌లోని పాత లైబ్రరీ భవనాన్ని పునర్నిర్మాణం చేయాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. అల్వాల్ ముదిరాజ్ సంఘం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించినా ఆ స్థలం వాళ్లకు అందజేయలేదని, మల్కాజిగిరి డివిజన్‌లో ఎంఎంటీఎస్ రెండో ఫేస్‌లో ఇండ్లు కోల్పోయిన వాళ్లకి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పటివరకు ఇయ్యలేదని, మల్కాజిగిరి నియోజక వర్గంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, అల్వాల్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ బేగంపేట్ నుండి అల్వాల్ లోనే పెట్టేలా చర్యలు తీసుకోవాలని, వాజ్పేయి నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ ఇంటర్ కాలేజీల సమస్యలు పరిష్కరించాలని, స్మశాన వాటికల సమస్యలు పరిష్కరించాలన్నాని అన్నారు. నూతనంగా నిర్మించబోయే తుర్కపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సంబంధించి భూ సేకరణ సమస్యను పరిష్కరించాలని, మల్కాజిగిరి నియోజక వర్గంలోని చెరువులు కబ్జాలు కాకుండా చర్యలు తీసుకోవాలని ఇలా అనేకమైన అంశాలు కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లానని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ కూడా సానుకూలంగా స్పందించి వీలైన తొందర్లోనే సమస్యల న్నీ పరిష్కారించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, అనిల్ కిషోర్, మేకల రాము యాదవ్, ఉపేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలన యువత బాధ్యత

- సీపీ తరుణ్ జోషి





నవతెలంగాణ-సిటీబ్యూరో/బడంగ్‌పేట్

మత్తు పదార్థాల నిర్మూలన యువత బాధ్యత అని రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు. 'అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా గురువారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహేశ్వరం జోన్ పరిధిలోని తుక్కుగూడలో 'నిషేధిత మత్తుపదార్థాలు, మానవ అక్రమరవాణాకు వ్యతిరేక వాకథాన్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, సీపీపాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ, నిషేధిత మత్తుపదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ, యువతతోపాటు సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీ మాట్లాడుతూ సాధారణ ప్రజలు, విద్యార్థులు అందరూ డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలన్నారు. తమ పరిసరాల్లో, కాలేజీల్లో, పాఠశాలల్లో మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. తెలిసీ తెలియక మత్తుపదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తుపదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత తమ వంతు బాధ్యత నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, తమ దష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు ప్రవీణ్ కుమార్, సునీత రెడ్డి, అరవింద్ బాబు, వుమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, ఏసీపీ నరేందర్ గౌడ్, ఇతర అధికారులు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన దుండగులను శిక్షించాలి



- ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వినోద డిమాండ్

నవతెలంగాణ-మల్కాజిగిరి

బాలికపై లైంగికదాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్లఆశయ్య, రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ ఐద్వా జిల్లా కార్యదర్శి కె.నాగలక్ష్మి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఐద్వా కార్యదర్శి ఎం.వినోద డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం,తెలంగాణ రజక వత్తి దారుల సంఘం, కేవీపీఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ పోలీసు స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు గురువారం వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏండ్ల బాలికకు దుండగులు గంజాయి తాగించి సామూహిక లైంగకదాడి చేశారన్నారు. ఈ ఘటన జరిగి నాలుగైతు రోజులు గడచినా దుండగులను అరెస్టు చేయలేదని తెలిపారు. పోలీసు డిపార్ట్ మెంట్ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిలో రాజకీయ జోక్యం ఉన్నదా అని నిలదీశారు. అందుకు సీఐ స్పందిస్తూ తప్పకుండా దోషులను అరెస్టు చేసి రిమాండ్ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సంఘాల నాయకులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల యువత పూర్తిగా చెడిపోతున్నదన్నారు. యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని.. అందుకే అందుకే యువతీయువకులు పెడమార్గం పడుతూ చెడు అలవాట్లకు పూర్తి గా బానిసలవుతున్నారన్నారు. కావున ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సీరియస్‌గా తీసుకోవాలని.. అప్పుడే మార్పువస్తుందన్నారు. ఈ మాదక ద్రవ్యాల విక్రయాలను ఖచ్చితంగా అరికట్టాలని.. విక్రయదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి మంగ, రజక సంఘం జిల్లా కార్యదర్శి ఉపెందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలు, జిల్లా ఉపాధ్యక్షులు గుంటి లక్ష్మణ్, సీఐటీయూ మండల కార్యదర్శి నర్సింగ్ రావ్, సుమిత్ర, మహిళా సంఘం నాయకులు నాగమణి, సఫియా కేవీపీఎస్ నాయకులు రాజలక్ష్మి, పెన్షనర్స్ అసోసియేషన్ మండల కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-మేడ్చల్

అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ జిల్లా విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపుగా 20 రోజులు గడుస్తున్నా అనుమతుల్లేని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా మేడ్చల్ మండల పరిధిలో కొన్ని పాఠశాలలో సీబీఎస్సీ సిలబస్ పేరుతో అడ్మిషన్లు తీసుకొని తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు దండుకుంటున్నా విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మేడ్చల్ మున్సిపాలిటీలోని సదాశివ ఇంటర్నేషనల్ స్కూల్,ఓక్లే ఇంటర్నేషనల్ స్కూల్‌లకు పూర్తిస్థాయిలో విద్యాశాఖ నుండి అనుమతులు లేవని తెలియజేశారు. ఈ రెండు స్కూల్‌ల యజమాన్యాలు విద్యాశాఖ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారని ఇంకా పూర్తిస్థాయిలో అనుమతులు రాలేవని అయినప్పటికీ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తూ అధిక మొత్తాల్లో ఫీజులు దండుకొని పాఠశాలలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇంటర్నేషనల్ పేరుకు తగ్గట్టుగా విద్యా ప్రమాణాలు, క్రీడా ప్రాంగణం, కనీసం ఫైర్ సేఫ్టీ సౌకర్యం కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాజ సేవలో మౌంట్ ఫోర్ట్ పాత్ర కీలకం

- ప్రత్యేక పిల్లల కోసం మౌంట్ ఫోర్ట్ సేవలు అభినందనీయం
- పూల ఆంటోనీ కార్డినల్ ఆర్చ్ బిషప్



నవతెలంగాణ-ఉప్పల్

సమాజ సేవ చేయడంలో మౌంట్ ఫోర్ట్ పాత్ర కీలకమని, ప్రత్యేక పిల్లల కోసం మౌంట్ ఫోర్ట్ చేస్తున్న కషి మరువలేనిదని పూల ఆంటోనీ కార్డినల్ ఆర్చ్ బిషప్ అన్నారు. గురువారం రామంతాపూర్‌లో మౌంట్ ఫోర్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పిల్లల కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకమైన పిల్లల అభివృద్ధికి చేయూతను అందిస్తూ సేవ చెయ్యాలి అన్నారు. వికలాంగుల పిల్లల కోసం, ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద, సంస్థల సహకారం అందించాలన్నారు. సమాజంలో ఆర్థికంగా, వెనుకబడిన పిల్లల కోసం, మౌంట్ ఫోర్ట్ సంస్థ చేస్తున్న కషిని స్వచ్ఛంద, సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో బ్రదర్ ప్రతాప్ రెడ్డి, బ్రదర్ అఫ్ జేమ్స్ పాల్గొన్నారు.

నటుడు ప్రభాస్ నటించిన కల్కి సినిమా గురువారం విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో ఉపయోగించిన బుజ్జి (వినూత్న కారు)ని హైదరాబాద్‌లోని ఐమాక్స్ ముందు ఉంచారు. దాంతో ప్రేక్షకులను అది ఎంతో ఆకట్టుకుంది. చాలా మంది దాంతో సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడ్డారు.



ఆల్వాల్ సీఐకు సత్కారం



నవతెలంగాణ-అల్వాల్

ఉత్తమ పోలీస్ సేవా పతకం పొందిన ఆల్వాల్ సీఐ రాహుల్ దేవ్‌ను బీజేపీ నాయకులు గురువారం ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సత్కరించి మిఠాయి అందజేశారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ గతంలో ఉన్న నేరాల సంఖ్య కన్నా ప్రస్తుతం నేరాలు అదుపులో ఉన్నాయని తెలిపారు. శాంతి భద్రతకు సీఐ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దండుగుల వెంకటేష్, గోపి, రవి, కిరణ్, దేవయ్య, మురళి, పాల్గొన్నారు.

పార్కు స్థలం కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని సత్య నగర్ కాలనీలోని సర్వే నంబర్ 1091,1092లో గల పార్కు స్థలాన్ని కాపాడాలని కోరుతూ కాలనీ అధ్యక్షుడు ఎస్.హరి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పార్కు స్థలాలు కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు ఎస్.హరి మాట్లాడుతూ 2000గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కు స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అట్టి పార్కు స్థలంలో మొక్కలు నాటడానికి బుధవారం మున్సిపాలిటీ సిబ్బంది ట్రాక్టర్‌తో గుంతలు తీస్తుండగా నలుగురు వ్యక్తులు వచ్చి పార్కు వద్ద హల్చల్ చేసి పార్క్ బోర్డును ధ్వంసం చేసి,మీ అసోసియేషన్ భవనాన్ని కూల్చివేస్తామని కాలనీ ప్రజలను బెదిరింపులకు గురి చేశారన్నారు. అలాగే పార్కు స్థలాన్ని సైతం ఆక్రమించుకొని కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తామని అన్నారని తెలిపారు.ఇట్టి పార్కు స్థలాన్ని సర్వే చేసి కాలనీ ప్రజలకు అప్పగిస్తామని కమిషనర్ నాగిరెడ్డి హామీ ఇచ్చినట్టుగా తెలియజేశారు. మరోసారి సంబంధం లేని వ్యక్తులు పార్కు వద్దకు వస్తే ఖబడ్దార్.. చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు.



మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమల నగర్ కాలనీలో పీఎస్ క్లాసిక్ అపార్ట్మెంట్‌పై జియో సెల్ టవర్‌ను తీసివేయాలని తిరుమల నగర్ కాలనీ నాయకులు కోరారు. జీహెచ్ఎంసీ ఎల బీనగర్ జోనల్ కమిషనర్ ఆఫీసులో గురువారం వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల నగర్ కాలనీలో పీఎస్ క్లాసిక్ అపార్ట్మెంట్ వారు డబ్బులకు ఆశపడి నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్మెంట్ పైన జియో సెల్ టవర్ ఏర్పాటు కోసం ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. టవర్ ద్వారా వెలువడే రేడియేషన్ వల్ల అనారోగ్యాలకు, ఇబ్బందులకు గురవుతున్నామని, కావునే వెంటనే ఆ టవర్‌ను తీసివేసేందుకు చర్యలు తీసుకోగలరని కోరారు. తిరుమల నగర్ నాయకులు బాలరాజు, శ్రీపాద మల్లేష్, బ్రహ్మచారి, స్వయంప్రకాష్, పిఎస్ఆర్ మూర్తి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి..

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్
- బోడుప్పల్‌లో న్యూటన్ గ్రామర్ స్కూల్లో పుస్తకాల గది సీజ్



నవతెలంగాణ-బోడుప్పల్

నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రయివేటు కార్పోరేట్ స్కూళ్లపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సంతోష్ రాథోడ్ డిమాండ్ చేశారు. గురువారం బోడుప్పల్ నగర పరిధిలోని న్యూటన్ గ్రామర్ స్కూల్లో సర్కార్ నిబంధనలు పాటించకుండా పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఎఫ్ఐ నాయకులు స్కూల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ విషయాన్ని స్థానిక ఎంఈవోకు చేరవేయగా ఎంఈవో కార్యాలయం సిబ్బంది అక్కడికి చేరుకుని స్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్కూల్ డ్రెస్ లు అమ్ముతున్న గదిని పరిశీలించి సదరు గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో సర్కార్ ఎలాంటి లాభాపేక్ష లేని విద్యాను అందించేలా చూడాలన్నారు. విద్యాశాఖ అధికారుల పర్యావేక్షణ లేని కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైన నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అవినాష్, శ్రీమాన్, సాయి, అజయ్, లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్‌కు నిధులు కేటాయించాలి



- మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్ నగర్ అభివద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తున్నామని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌లు అన్నారు. గురువారం మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌లు కలిసి జవహర్ నగర్ ప్రజల సమస్యలకు త్వరగా పరిష్కారం చూపించాలని తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి అధిక నిధులు కేటాయించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బింగి లావణ్య సతీష్ గౌడ్, మనోహర్ రెడ్డి, కూతాడి సాయి, పల్లపు రవి, శ్రీనాథ్, పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థి చదువుకు బీఎల్ఆర్ చేయూత

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా చెక్కు అందజేత



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలో సీటు సాధించిన పేద విద్యార్థులకు మెడిసిన్ ఫీజు కడుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. చిలుక నగర్‌కు చెందిన గోపి శెట్టి చెన్న కేశవుల కుమారుడు శశి కుమార్ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ సాధించారు. మెడిసిన్ చదువు చదివే స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కేసీఆర్ చేతుల మీదుగా ఎర్ర వెల్లి ఫాం హౌస్‌లో రూ. 60 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెడిసిన్ సీటు సాధించిన వారికి 5 సంవత్సరాలకు అయ్యే ఫీజు మొత్తం చెల్లిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సోషలిస్ట్ పార్టీ (ఇండియా) సమావేశాలను జయప్రదం చేయండి

- సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఈ .రాజేష్



నవతెలంగాణ-బోడుప్పల్

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై ప్రజా పోరాటాల కార్యచరణకు ఉత్తరాఖండ్‌లో సోషలిస్ట్ పార్టీ (ఇండియా) కేంద్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారని అ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఈ .రాజేష్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో బీజేపీ నెతత్వంలోని ఎన్డీఏ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలు ప్రజలకిచ్చిన హామీలను నేరవెర్చాడానికి సిద్దంగా లేవని అందుకే భవిష్యత్‌లో సోషలిస్ట్ పార్టీ (ఇండియా) ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలను నిర్వహించేలా కార్యచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్ర రెడ్డి నేతత్వంలో నాయకులు పాల్గొంటారని తెలిపారు.

నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శుక్రవారం | జూన్ 28, 2024 | www.navatelangana.com

బోనాల ఉత్సవాలకు నిధులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఆషాడ మాస అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాలకు నిధులు మంజూరు చేయాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ గురువారం దేవదాయ కమిషనరు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని సుమారు 104 ఆలయాలలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. బోనాల ఉత్సవాలకు నిధుల మంజూరు చేయాలని ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల కమిటీ సభ్యులు తనకు అభ్యర్ధనలు అందాయన్నారు. అమ్మవారి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.



మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్ ముదిరాజ్, 20వ డివిజన్ కార్పొరేటర్ బాలాజీ నాయక్, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్‌తో 19వ డివిజన్ కాసాని కృష్ణ ఎంక్లేవ్ రెసిడెన్షియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారి గృహ నివాసాల సమీపంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయగలరని వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు మేయర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

నవతెలంగాణ-దుండిగల్

కొండెక్కిన ధరలు.. కూరగాయల కొరత..

ధరల మోత - కొనలేం...తినలేం

- అనూహ్యంగా పెరిగిన కూరగాయల ధరలు
- డబుల్ సెంచరీ దాటిన అల్లం వెల్లుల్లి
- దారెత్తిస్తున్న టమాటా, ఘాటెక్కిన ఉల్లిగడ్డలు
- కంట్లో కన్నీరు పెట్టిస్తున్న పచ్చిమిర్చి



నవతెలంగాణ-బాలానగర్

కూరగాయల ధరలు రోజురోజుకు కొండెక్కతూ... సామాన్యులను హడలెత్తిస్తున్నాయి. హెూల్ సేల్ మార్కెట్ నుంచి వచ్చే కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు పెరిగిన ధరలతో బెంబేలెత్తుతున్నారు. వేసవి కారణంగా పంట సాగు తగ్గిపోయి దిగుబడులు మరింత క్షీణించడంతో ధరలపై పెను ప్రభావం చూపిస్తోంది. రైతు బజార్లలో మొన్నటి వరకు కిలో టామాట 30 రూపాయలు ఉన్న ధర అమాంతంగా పెరిగి రూ.80 నుంచి 90 లు వంపలుకుతోంది. కూరగాయల పంటసాగు విస్తీర్ణం తగ్గడం, వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల దిగుబడి రాకపోవడం వల్లే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని తెలుస్తోంది. వేసవిలో కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గడంతో ధరలు పెరగడానికి మరో కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం రైతు బజార్లలో టమాట కిలో రూ.70 90 లు పలుకుతుండగా మరో వారం రోజుల్లో రూ.100కు చేరుకునే అవకాశం లేకపోలేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రజలపై ధరల పోటుతో సామాన్య ప్రజలు బెంబేలు పోతున్నారు. జేబులు ఖాళీ అయినా కూరగాయల సంచి నిండడంలేదని వినియోగదారులు నిట్టూరుస్తున్నారు. ఇటీవల ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు దిగివచ్చేలా కనిపించడం లేదు. ఎర్రగడ్డ రైతుబజార్‌లో టామాట, పచ్చి మిర్చి, బజ్జి మిర్చి, బీన్స్, క్యాప్సికం, చిక్కుడు, ఉల్లి పొరక ఇలా ఏది కొందామన్నా ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఈ సీజన్‌లోనే ఎన్నడూ లేని విధంగా టామాటా కిలో రూ.80 కు పెరిగింది. గత నెలకు ప్రస్తుతానికి టామాట ధర ఏకంగా రెండింతలకు చేరింది. వర్షాలు ప్రారంభమైన కారణంగా జంట నగరాలతో పాటు మేడ్చల్ జిల్లాల నుంచి ఎర్రగడ్డ రైతుబజార్‌కు టామాటల సరఫరా కూడా పూర్తిగా నిలిచిపోయింది. వర్షాకాలంలో కొత్తగా వేసిన టామాట పంట వచ్చే కానీ అందుబాటులోకి రాకపోవడం ధరల పెరుగుదలకు కారణమని రైతుబజార్ అధికారులు చెబుతున్నారు. కాగా ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో టామాట ధర తగ్గే అవకాశం ఉంటుందన్నారు. టామాట ధర రైతుబజార్‌లోని ఇతర కూరగా యల ధరలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇతర కూరగాయల కంటే టామాటల వినియోగం చాలా తక్కువగా ఉంటుంది. టామాట ధర పెరగడంతో ఇతర కూరగాయలను వ్యాపారులు అనధికారికంగా పెంచేస్తున్నట్లు వాపోతున్నారు.

నిత్యం తినే కూరగాయలు కూడా సామాన్యుడికి అందనంత ఎత్తుకు వెలుతున్నాయి. ధరలు చూస్తే పేద, మధ్యతరగతి వర్గాల గుండె గుబేలుమంటుంది. ఒక వైపు మాంసాహార ధరలు ఆకాశానికి అంటుతుంటే, ఇటు కూరగాయలు సైతం సామాన్యుడికి అందుబాటులో లేనంతగా ధరలు పెరిగిపోతున్నాయి. ఒకటి రెండు రకాల కూరగాయలు మినహా మిగిలిన అన్ని కూరగాయలు కిలోకు రూ. 70 నుంచి రూ. వంద దాటడం గమనార్హం. ఇంకా వేసవికాలం ముగియక ముందే కూరగాయల ధరలు పెరగడం ఆందోళన కరంగా ఉందని, ప్రస్తుతమే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో ధరల పెరుగుదల ఇంకెలా ఉంటుందోనని సామాన్య జనం ఆందోళన చెందుతున్నారు. ప్రజలు నిత్యం వంటలకు కావలసిన నిత్యవసర సరుకులు ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో సామాన్యులకు నేను భారంగా తయారయ్యాయి. పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర వేదనకు గురవుతున్నారు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు ఊహించని విధంగా రోజురోజుకు పెరిగిన ధరల దాటికి మద్దతు కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతుంది.

కుటుంబ పోషణ భారంగా మారింది..



ప్రతిరోజు పనిచేస్తే 300 నుంచి 400 వరకు సంపాది స్తున్న కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నామని వచ్చిన ఆదాయం మొత్తం ఖర్చులకే సరి పోతుంది. పొదుపు మాట దేవుడెరుగు పిల్లల ఆరోగ్యాలు చదువుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్ప డింది. ప్రభుత్వాలు తమలాంటి పేద కుటుంబాలను ఏమాత్రం పట్టించుకోకుండా నిత్యవసర ధరలను పెంచడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తుంది. ఇలాంటి తరుణంలో అప్పులు తీర్చుకుంటున్నామని ప్రభుత్వాలు ఇష్టానుసారంగా నిత్యవసర సరుకులు ధరలు పెంచుతూ నడ్డి విరుస్తున్నాయి. తాము ఎలా బతకాలో తెలియని పరిస్థితి దాపురించిందని, ఆయా ప్రభుత్వాలు ధరలు నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కె. వసుధ - రాజు కాలనీ

ధరల పెరుగుదలను నియంత్రించాలి..



ఏంతిలేము, ఏంకొనలేము అన్న చందంగా నిత్యవసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీంతో మాకు జీవనం మరింత భారంగా మారుతోంది. రోజుల వ్యవధిలోనే సరకుల ధరలు 80 నుంచి 90 శాతం పెరుగుతున్నాయి. పిల్లల చదు వులు, కుటుంబ పోషణ, అనారోగ్య సమస్యలతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. భార్యాభర్తలు ఇద్దరూ పని చేస్తున్నా కుటుంబపోషణ కష్టతరంగా ఉంటోంది. దీంతో తాము ఏం తిని బతకాలని సామాన్యులు పెరుగుదల పై నియంత్రణ విధించడంలో ప్రభుత్వాలు విఫలమ వుతున్నాయి. ధరల అదుపును నియంత్రిం చాల్సిన ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు.

ఎస్. అరుణ - బాలానగర్

ఏక్ పేడ్ మాకే నామ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

జూన్ 23వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు, డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాల సందర్భంగా, గురువారం సరికొండ సుదర్శన్ రావు శక్తి కేంద్రం పరిధిలో, ఏక్ పేడ్ మాకే నామ్ పేరిట కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు నర్సింగరావు అధ్యక్షతన మొక్కలు నాటారు. బూత్ అధ్యక్షులు వై.భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో, సప్తగిరి కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, జిల్లా కార్యదర్శి స్రవంతి, తల్లోజు నరసింహ చారి సరికొండ రవిశంకర్, మురళి, తదితర స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫూల్ బాగ్ కాలనీలో జరుగుతున్న వీడీసీసీ రోడ్డు పనులను స్టాండింగ్ కమిటీ సభ్యులు బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులకు సూచిస్తూ కాలనీ నీరు ఆగకుండా లెవెలింగ్ మెయింటైన్ చేస్తూ అలాగే నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్వాణ పనులను త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. అదేవిధంగా కాలనీలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తక్షణమే తగు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ బాలకిషన్, ఏఈ మహమ్మద్ రషీద్, వర్క్ ఇన్స్పెక్టర్ రాములుతో పాటు కాలనీ అధ్యక్షులు సభాపతి రెడ్డి, అనిల్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, భగవాన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు విద్యుత్ సమస్యలు వివరించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలోని, ఉన్న విద్యుత్‌కు సంబంధించిన సమస్యల గురించి మేడ్చల్ జోన్ సీజీఎం కె.సాయిబాబాతో కలిసి, ఎల్లమ్మబండ స్లమ్ ప్రాంతాలలో పాదయాత్ర చేశారు. విద్యుత్ సమస్యలను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కొన్ని చోట్ల విద్యుత్ వైర్లు, స్తంభాలు మార్చాలని తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు, అలాగే పాత ట్రాన్స్‌ఫార్మర్స్ కు చుట్టూ ఫీనిషింగ్ లేక చాలా ప్రమాదకరంగా ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేశారు. అదేవిధంగా కొన్నిచోట్ల రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంబాలను ప్రక్కకు జరపవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు కూకట్‌పల్లి డి.ఈ చక్రవర్తి, ఏ.డి.ఈ ప్రసాద్, భాగ్యనగర్ ఏ.ఈ షాబాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, వెంకట్ నాయక్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పనులను త్వరగ పూర్తి చేయాలి



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-దుండిగల్

కొంపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకయ వర్గంలోని బాచుపల్లి ఫ్లైఓవర్, బాచుపల్లి - బౌరంపేట్, బహదూర్ పల్లి - కొంపల్లి రోడ్డు విస్తరణ పనులపై హెచ్ఎండిఏ, వాటర్ వర్క్స్, అటవీ, రెవెన్యూ, మున్సిపల్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 3.97 కోట్ల రూపాయలతో శంకుస్థాపన జరిగి నేటికీ పూర్తి కానీ బాచుపల్లి ఫ్లై ఓవర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా బాచుపల్లి నుంచి మల్లంపేట వరకు 1.64 కోట్ల రూపాయలతో 1.20 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను, మల్లంపేట్ నుంచి బౌరంపేట వరకు 2.07 కోట్ల రూపాయలతో సుమారు 4.80 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు, గండి మైసమ్మ నుంచి బహదూర్ పల్లి వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనుల్లో ట్రాన్సాఫార్మర్ల షిఫ్టింగ్, కరెంటు పోల్ షిఫ్టింగ్ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే మియాపూర్ నుంచి గండి మైసమ్మ వరకు కల 13.3 కిలోమీటర్ల రోడ్డు విస్తరణలో భాగంగా 1.50 కిలోమీటర్లు, కొంపల్లి - బహదూర్ పల్లి 7 కిలోమీటర్ల మార్గంలో సుమారు 5.74 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు వేస్తున్న పనుల్లో గల 2.8 కిలోమీటర్ల అటవీ శాఖ భూములకు అనుమతి తీసుకోని రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ, కొంపల్లి కమిషనర్ శ్రీహరి, ఎమ్మార్వో మతిన్, హెచ్ఎండిఏ అధికారులు యూసుఫ్ హుస్సేన్, అప్పారావు, హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవం..

దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని సారెగూడెంలోని శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవ బోనాల పండుగ జాతరలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, బౌరంపేట్ పాక్స్ చైర్మెన్ మిద్దుల బాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ వార్డ్ సభ్యులు శ్రీశైలం, వీరస్వామి, నాగార్జున, రామ్ బాబు, పాక్స్ డైరెక్టర్లు వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.



బాలికల విద్య అభ్యున్నతికి కృషిచేయాలనే మీ సంకల్పం ఎంతో గొప్పది...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లి పరిధి లోని మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్‌లో గురువారం అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ శ్రీహరి రవీంద్రనాథ్ పదవి విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై, శ్రీహరి రవీంద్రనాథ్‌ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రవీంద్రనాథ్ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు రాష్ట్ర ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయ పురస్కారం లభించడమే కాకుండా గణితశాస్త్రంలోనూ ప్రమోషన్ పొందారని తెలిపారు. ఘట్కేసర్ బాలికల పాఠశాలలో మంచి అభ్యున్నతిని కల్పించి, బాలికల విద్యాభివృద్ధిలో తోడ్పడ్డారని నియోజక వర్గంలోని బహదూర్‌పల్లి పాఠశాలలో 10 సంవత్సరాలు సేవలందించి పదవి విరమణ పొందుతు న్నందుకు ఎంతగానో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పదవి విరమణ అనేది వయసుకు మాత్రమేనని బాలికల విద్యా అభ్యున్నతి కోసం కృషిచేయాలని మీ సంకల్పానికి కాదన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్లు మైసికారి సునీత వెంకటేష్, సత్యనారాయణ, నిజాంపేట్ కార్పొరేటర్ మేకల వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సగ్గిడి శ్రీనివాస్, శ్యామ్ మరియు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నీట్ లీకేజీ పై... మోడీ స్పందించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఎం.చంద్రకాంత్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

' పరీక్షా పే చర్చ ' నిర్వహించే ప్రధాని మోదీ... నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై మాట్లాడకపోవడం సిగ్గుచేటని, ఎన్టీఏను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ డిమాండ్ చేశారు. గురువారం ఈ సందర్భంగా షాపూర్ నగర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ దగ్గర ఆయన మాట్లాడుతూ...దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన నీట్ లీకేజీ పై మోడీ ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని రుజువైనా పరీక్షతో పాటు, ఎన్టీఏను రద్దు చేయకుండా ప్రధాని మోడీ మౌనంగా ఉండడం దురదృష్టకరమని పేర్కొన్నారు. నీట్ పరీక్షను వెంటనే రద్దుచేసి తిరిగి నిర్వహించాలని, ఎన్టీఏను రద్దు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీటిపై మోడీ తీరును చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం మోడీ హస్తం దీనిపై ఉందని ఇది దేశానికే చాలా ప్రమాదకరమని అన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే దిశగా ఉద్యమాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. లీక్ వ్యవహారం పై సమగ్ర విచారణ చేపట్టాలి. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం స్పందించకపోతే దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యలను పూర్తి చేయాలి



- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

డ్రయినేజీ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని రాజీవ్ గాంధీ నగర్‌లో అంతర్గత డ్రయినేజీ పొంగి పొర్లుతుండడంతో విషయం తెలుసుకొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే గురువారం అధికారులతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏమ్మేల్యే మాట్లాడుతూ డ్రయినేజీ పొంగి పోర్లడంతో మురుగునీరు ఇండ్లలోకి చేరుతుందన్నారు. మురుగు నీరు ఇండ్లలోకి నీరు చేరడంతో ప్రజలు అనారోగ్యాల భారీన పడుతున్నారని తెలిపారు. వీలైనంత త్వరగా డ్రయినేజీ పనులను పూర్తి చేయాలన్నారు. 20 వేల లీటర్ల మంచినీళ్ళ వాడుకోవడం కోసం గత ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. వాటర్ వర్క్స్ అధికారులు గత ప్రభుత్వంలో వాడుకున్న నీటికి కూడా డబ్బులు కట్టమని ప్రజలకు పిడిస్తున్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టీ డబ్బులు తీసుకొవడం మంచి పద్దతి కాదని పేర్కొన్నారు. పేదవారిని ఇబ్బంది పెట్టీ అధికారులు డబ్బులు వసూ లు చేస్తే ప్రజా ఉద్యమం చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, వీరా రెడ్డి, సయ్యద్ రియాజ్, రమేష్, ముత్యాల దుర్గ, జీహెచ్ఎంసీ డి.ఈ.ఆనంద్, ఎ.ఈ.రంజిత్, జలమండలి అధికారులు విలయం ప్రకాష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగానికి విరమణే గానీ, సేవలకు విరమణ ఉండదు

- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ ఉంటుంది కానీ సేవలకు విరమణ ఉండదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎ.పి.హెచ్.బి. కాలనీలో గల కుత్బుల్లాపూర్ జలమండలి ప్రధాన కార్యాలయ ఆవరణలో జలమండలి సిజీఎంగా కుత్బుల్లాపూర్ జీఎం,గా విశిష్ట సేవలు అందించిన మంద శ్రీధర్ రెడ్డి పదవీ విరమణ(వీడ్కోలు సభ)అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో డీజీఎం శాకం రాజేష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు జలమండలి సీజీఎంలు విజయరావు, కే.నాగేంద్ర, కే.కిరణ్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ (డిఓపి)స్వామిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోగల ప్రాంతాలలోని సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మంచినీటి సదుపాయం కల్పించిన సీజీఎం మంద శ్రీధర్ రెడ్డి సేవలు అభినందనీయమని ప్రశంసించారు. సీజీఎం శ్రీధర్ రెడ్డి సమయస్ఫూర్తితో విధులు నిర్వహించారని కొనియాడారు. అనంతరం పదవీ విరమణ పొందిన సీజీఎం మంద శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పని విషయంలో అంకితభావంతో విధులు నిర్వహించి ఈ స్థాయికి ఎదిగానని వ్యాఖ్యానించారు. జలమండలి ఉన్నతాధికారులతో పాటు, కిందిస్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలతో స్నేహపూర్వకంగా ఉన్నందుకే తాను ఇటువంటి సేవలు అందించానని స్పష్టం చేశారు. తన వంతు సేవలను ప్రజలకు అందిస్తానని పునరుద్ఘాటించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, మేనేజర్లు వివిధ సంక్షేమ సంఘం నాయకులు,కాంట్రాక్టర్లు పాల్గొని సీజీఎం శ్రీధర్ రెడ్డిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్లు అనూష,శివప్రసాద్, రోహిణి, పూజిత, రమ్య, రవి, ఝాన్సీ, అమర్నాథ్, నాయకులు, ఏర్వ శంకరయ్య, టి.లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా అసెంబ్లీ కో కన్వీనర్‌గా కోడి ఆదిత్య నియామకం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీజేపీ ఓబీసీ మోర్చా అసెంబ్లీ కో కన్వీనర్‌గా చింతల్ డివిజన్, భగత్ సింగ్ నగర్ కు చెందిన కోడి ఆదిత్య నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ ఆదిత్యకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందనం దివాకర్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త సేవలను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ఓబీసీ మోర్చా అసెంబ్లీ కో కన్వీనర్‌గా నియమితులైన కోడి ఆదిత్య మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పని చేసినందుకు తన సేవలను గుర్తించి ఈ పదవీబాధ్యతలు అప్ప జెప్పారన్నారు. ఈ పదవి మరింత బాధ్యత పెంచిందని పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తరలించాలి



నవతెలంగాణ-ఆల్వాల్

వల్లబ్ నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ను అల్వాల్ ప్రాంతానికి తరలించాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం అల్వాల్ సర్కిల్ ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ రోజాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఈ సేవ కార్యాలయం, జల మండలి కార్యాలయం, పోస్టు ఆఫీస్, గవర్నమెంట్ హాస్పిటల్, అన్ని కార్యాలయాలు అల్వాల్ మండలంలో ఉన్నాయని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎక్కడో హైదరాబాద్ జిల్లాలో 13 కి.మీ దూరాన ఉన్నదన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దండుగుల వెంకటేష్, మల్లికార్జున గౌడ్, శేఖర్, రవి కిరణ్, అజయ్ రెడ్డి, నిమ్మ కృష్ణారెడ్డి, మల్లికార్జున్ యాదవ్, మురళి గోపి పాల్గొన్నారు.

30 న 'రామచిలుక' ఆవిష్కరణ సభ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మలయాళీ అనువాద కథల సంపుటి 'రామచిలుక' ఆవిష్కరణ సభ ఆదివారం 30 జూన్ 2024న ఉదయం 11.00 గంటలకు సోమాజిగూడలోని రాజ్‌భవన్‌లో ఉన్న దర్బార్ హాల్‌లో జరగనుంది. గోవా గవర్నర్ పి.ఎస్. శ్రీధరన్ పిళ్ళై మలయాళంలో రాసిన కథలను ఎల్.ఆర్. స్వామి తెలుగులోకి అనువాదం చేశారు. వీటిని పుస్తకంగా 'రామచిలుక' శీర్షికన తమ సంస్థ ప్రచురించిందని పాలపిట్ట బుక్స్ ఎడిటర్ గుడిపాటి ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్‌భవన్‌లో జరిగే ఈ పుస్తక ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా పద్మశ్రీ ఆచార్య కొలుకలూరి ఇనాక్ హాజరై ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ సభలో రచయిత పి.ఎస్. శ్రీధరన్ పిళ్ళైతో పాటు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సి.పి. రాధాకృష్ణ పాల్గొంటారు. సభలో గౌరవ అతిథులుగా సుప్రసిద్ధ కవి, సరస్వతీ సమ్మాన్ పురస్కార గ్రహీత కె. శివారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు , అనువాదకుడు ఎల్.ఆర్.స్వామి, డా. రూప్ కుమార్ డబ్బీకార్ ప్రభృతులు పాల్గొని ప్రసంగిస్తారు.

బాధిత కుటుంబానికి యువనేత పరామర్శ



నవతెలంగాణ-ఓయూ

మెట్టుగుడా డివిజన్‌లో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ యువ కార్యకర్త రాహుల్ కుటుంబ సభ్యులను సికింద్రాబాద్ నియోజకవర్గ యువ నేత రామేశ్వర్‌గౌడ్ బుధవారం పరామర్శించారు. ఆయన తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు.



30న తలసాని శంకర్ జ్ఞాపకార్థం అన్నదానం

నవతెలంగాణ-బేగంపేట్

బోయిన్ పల్లి మార్కెట్ వర్తకులు, కార్మికుల సంఘం మాజీ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం ఈ నెల 30వ తేదీన బోయిన్ పల్లి మార్కెట్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మార్కెట్ వెహికిల్స్ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గురువారం వారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్ పల్లిలోని వారి నివాసంలో కలిసి అన్నదానం కార్యక్రమానికి ఆహ్వానించారు. తమకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా శంకర్ యాదవ్ అండగా నిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేసే వారని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. శంకర్ యాదవ్ మతి తమకు ఎంతో తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మల్లేష్, ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యక్షుడు జనార్దన్, కోశాధికారి బీరయ్య తదితరులు ఉన్నారు.



నూతన ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం

నవతెలంగాణ-ఓయూ

లాలగూడా పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ రెడ్డిని గురువారం సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో కలిసి సత్కరించారు.కార్యక్రమంలో సాయి కుమార్, విశాల్ , మున్న, అవినాష్ , విశాల్ పాల్గొన్నారు.



ఓయూలో బొజ్జ తారకం జయంతి

నవతెలంగాణ-ఓయూ

అణగారిన ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు బొజ్జతారకం అని అల్ మాల స్టూడెంట్ అసోసియేషన్(అంసా)ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు నామ సైదులు అన్నారు. అంసా ఆధ్వర్యంలో బొజ్జా తారకం 85వ జయంతిని గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో ఘనంగా నిర్వహించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీకి అధ్యక్షులుగా, గొప్ప న్యాయవాదిగా, కవిగా, రచయితగా బొజ్జతారకం పనిచేశారన్నారు.ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎం శ్రీకాంత్ యాదవ్, ఓయూ స్కాలర్ చంద్రశేఖర్, భూతం రఘు, సాయి, నగేష్, గోపి, కార్తీక్ ,సదానందం,తరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కంటోన్మెంట్



ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ సూచించారు. న్యూ బోయినపల్లి ఆకాష్ నగర్ పార్కులో బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ మంజూరు చేసిన రూ. 3.50 లక్షల వ్యయంతో చేపట్టే పార్క్ అభివద్ధి పనులను జంపన ప్రతాప్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వార్డుకు రెండు చొప్పున ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఆకాష్ నగర్ పార్క్‌లో చిన్నారుల, మహిళల ఆటవిడుపునకు షటిల్ కోర్టు, క్రికెట్ మైదానం ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. పార్క్ అభివద్ధి లో భాగంగా చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారన్నారు. జులై మొదటివారంలో పార్క్ ప్రారంభించి కాలనీవాసులకు అందుబాటులో తీసుకువస్తామన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం ఇన్‌స్పెక్టర్ చౌహన్, ధాఫేదర్, విజయ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థలే కళాకారులకు వేదిక కల్పిస్తున్నాయి

నవతెలంగాణ-కల్చరల్

ప్రభుత్వాల కన్నా సాంస్కృతిక సంస్థలే కళా కారులకు వేదిక కల్పిస్తున్నాయని అట్టి సంస్థల సమస్యలను సానుకూల దృక్పథంతో చూడాల్సి ఉందని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం లోని ఎన్.టీ.ఆర్ కళా మందిరం లో తెలంగాణ కల్చరల్ ఆర్గనైజర్స్ ఫోరం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డాక్టర్ రమణ సంస్థ జ్ఞాపికను ఆవిష్కరించి మాట్లాడారు. సాంస్కృతిక సంస్థలు ఎన్నో కష్టాలు నష్టాల కోర్చుకుని కార్యక్రమాలు నిర్వహిస్తాయని.. వారికి సహకారం కలసి కట్టుగా ఉండి అందించాలన్నారు. సంస్థ ఎదుగుదలకు బాధ్యత సమిష్టి సహకారం అవసరమని అప్పుడే అర్థవంతం గా చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం కాగలవన్నారు. సాంస్కృతిక సంస్థలు కలసి ఒక వేదిక పై కి రావటం మంచి మార్పు శుభ పరిమాణం అన్నారు. సలహాదారుగా ఉన్నా సలహాలు తీసుకునే వారు ఎవరూ ఈ రోజుల్లో లేరని పేర్కొన్నారు. సంస్థ లక్ష్యాలను తెలిపిన బృందావనం సంస్థ సుబ్రహ్మణ్యం కళా సంస్థల నిర్వాహకులకు భద్రత ముఖ్యమని కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆడిటోరియంలలో వసతులు వంటివి కల్పించే బాధ్యత ఆ ఆడిటోరియం యాజమాన్యాల పై ఉంటుందని వాటి పరిష్కారం కోసం ఫోరం పనిచేస్తుందని ప్రభుత్వ పరం గా గుర్తింపు కార్డు ల కోసం కృషి చేస్తుందన్నారు. కిన్నెర రఘురాం మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు ఒదిగి వుండి కార్యక్రమాలు విజయ వంతం చేసుకోవాలనీ సినారె చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ కొందరు ఆడిటోరియం నిర్వాహకులు ప్రవర్తన బాధాకరం ఉంటోందన్నారు. ప్రముఖ గాయకుడు రామాచారి మాట్లాడుతూ వేరే వారిపై విజయం సాధించేందుకు ముందు తమకు తాము ఇంచు కోవాలను సూచించారు ఇందుకు పరస్పరం గా సహకరించుకోవాలని కోరారు .ప్రముఖ గాయణులు సురేఖ విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్న సభను శ్రీ రామ సాంస్కృతిక సేవా సంస్థ గొర్తి చంద్ర శేఖర్ నిర్వహించారు.

బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలి

- జులై 5 లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సికింద్రాబాద్ బోనాలపై సమీక్ష



నవతెలంగాణ-బేగంపేట్

నగరంలోని అన్ని దేవాలయాల్లో జులై 5 లోపే బోనాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో, ప్రజలందరి సహకారంతో ఉజ్జయిని మహంకాళి ఆషాడ జాతర బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల ఏర్పాట్ల పై గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొని సమీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో

జులై 21వ తేదిన బోనాలు ,అమ్మవారి దర్శనం కార్యక్రమాలు ఉండగా, 22న ఉదయం 9 గంటలకు రంగం, గజాదిరోహణ మహోత్సవం, అంబారి పై అమ్మవారు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. 1830 నుంచి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ప్రతి సంవత్సరం బోనాలు సమర్పిస్తున్నారని మంత్రి వెల్లడించారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈసారి బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం 20 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఆలయ పరిసరాల్లో లైటింగ్, ఉత్సవాలు జరిగే మూడు రోజుల పాటు నిరంతర నీటి సరఫరా, నిరంతర విద్యుత్ ఏర్పాటు తో పాటు అదనపు ట్రాన్స్ఫార్మర్‌లు ఏర్పాటు, పోలీసుల సమక్షంలో బారికేడ్లు ఏర్పాటు చేపట్టాలని తెలిపారు. తాగునీటికి వాటర్ పాకెట్స్ , వాటర్ బాటిల్స్ ,4 హెల్త్ క్యాంప్ లు, శిక్షణ పొందిన పీసీఆర్ బందాలు ,ప్రత్యేక అంబులెన్స్ ,ఫైర్ ఇంజన్స్ ,వెల్ కమ్ బోర్డుల ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎంట్రీ ,ఎగ్జిట్ గేట్లు ,ఎమర్జెన్సీ గేట్లు ,ప్రత్యేక క్రైం టీమ్స్ ,మల్టి లెవెల్ పార్కింగ్ సదుపాయాలు , ఏనుగు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపు సమయంలో రోప్ పార్టీ ఏర్పాటు, క్రైం టీమ్స్ , షీ టీమ్స్, 500 మంది కళాకారులతో సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బోనాల రోజు ముఖ్యమంత్రి, గవర్నర్, ప్రోటోకాల్ వెహికిల్స్ తప్ప తమ వాహనాలు కూడా దేవాలయానికి దూరంగా ఆపి అమ్మవారి దర్శనానికి వచ్చేలా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఏర్పాట్ల విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తుల దర్శనానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏ సమస్య ఉన్నా స్థానికులు అధికారుల దష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే అమ్మవారి ఉత్సవాలు విజయవంతంగా జరగాలంటే స్థానికుల సహకారం ఉండాలన్నారు. ఈ సందర్భంగా బోనాలకు సంబంధించిన పోస్టర్ ను పరిష్కరించారు.ఈ సమీక్షా సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, కాంగ్రెస్ సనత్ నగర్ ఇన్‌చార్జి కోటా నీలిమ, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ,దేవాలయ కమిటీ, ఇతర స్థానిక ముఖ్యనేతలు. పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బి,వాటర్ వర్క్స్ ,విద్యుత్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



- కలెక్టర్‌ను కోరిన ట్రెసా ప్రతినిధులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా మారేడుపల్లి మండల తహసీల్దార్, గిర్దావర్ రికార్డు అసిస్టెంట్లపై సస్పెన్షన్ ను ఎత్తివేయాలని ట్రెసా కోరింది. గురువారం ట్రెసా అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి అధ్వర్యంలో ట్రెసా ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిను కలిశారు. గతవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ తన ఆకస్మిక తనిఖీల సమయంలో మారేడుపల్లి మండల తహసీల్దార్,గిర్దావర్, రికార్డు అసిస్టెంట్లను సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గత ఆరు నెలలుగా రెవిన్యూరీ ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహించారని , రెవిన్యూరీ విధుల్లో జాప్యం కారణంగా ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడాన్ని నివారించాలని కోరారు. దీనివల్ల ఉద్యోగుల మనోస్థైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందని,కావున సస్పెండైన రెవిన్యూరీ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఉద్యోగులపై సస్పెన్షన్ ను ఎత్తివేసి వారిని విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్ ,ఆర్డీవో హైదరాబాద్ డివిజన్ కె.మహిపాల్ ,సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్, ఉపాధ్యక్షులు కె. నిరంజన్ రావ్,జగిత్యాల జిల్లా అధ్యక్షులు వకీల్,రాష్ట్ర కార్య వర్గ సభ్యురాలు అనితా రెడ్డి,హైదరాబాద్ ట్రెసా సభ్యులు

ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయం ముట్టడి



- మంత్రి దామోదర రాజనర్సింహ సమావేశం జరుగుతుండగా ఘటన
- గేటు వద్ద బస్తీ దవాఖానా డాక్టర్లు, సిబ్బంది ధర్నా
- సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

వెంగళరావు నగర్ డివిజన్‌లో ఉన్న భారత ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో బస్తీ దవాఖానాలలో పనిచేస్తున్న డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు, సిబ్బంది అనూహ్యంగా వందల సంఖ్యలో కార్యాలయం గేటు ముందు చేరి కార్యాలయాన్ని ముట్టడించి భారీ ధర్నా చేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న మంత్రి.. నిరసన చేస్తున్న వారి వద్దకు వచ్చి వారి సమస్యలు తెలపాలని కోరారు. 6 నెలలుగా డాక్టర్లకు, సిబ్బందికి వేతనాలు రావటం లేదని అనేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నామని మహిళలు కన్నీటితో విన్నవించుకున్నారు. దాంతో సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలో ఆరు నెలల వేతనాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం డాక్టర్లు, సిబ్బంది నిరసన విరమించారు.

డీఎస్సీ పరీక్ష తేదీలను పొడిగించాలి

- ఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు మధునూరే రాహుల్



నవతెలంగాణ-ఓయూ

డీఎస్సీ పరీక్ష తేదీని పొడిగించాలని ప్రభుత్వాన్ని రిపబ్లికన్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాహుల్ మధనూరె డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఈ నెలలో టెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులను దష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష తేదీని మరో రెండు నెలలు పొడిగిస్తూ తమకు గడువు ఇవ్వాలని కోరారు. విద్యార్థులకు సమయం లేకపోవడంతో నెలలో పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతారో తెలుసుకోవాల్సిన ప్రభుత్వం పిల్లలకు అన్యాయం చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో నిరుద్యోగుల పాత్ర అత్యధికంగా ఉంది కాబట్టి ప్రభుత్వం వారికి అండగా నిలవాలని కోరారు. పరీక్ష తేదీని పొడిగించి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని లేని యెడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మంగళదాస్, విజయ్, సాయి, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఆర్‌పురం కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ప్యానెల్ విజయం



నవతెలంగాణ - జూబ్లీహిల్స్

ఎన్.ఆర్.ఆర్ పురం కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి జూన్ 23న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సెక్యులర్ ప్యానెల్ ఫైజుద్దీన్ యునైటెడ్ ప్యానెల్‌పై ఘన విజయం సాధించింది. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను నూతనంగా ఎన్నికైన సొసైటీ ప్రెసిడెంట్ ఎస్.కె యూసఫ్ ఉద్దీన్, వైస్ ప్రెసిడెంట్ ఐలయ్య, జనరల్ సెక్రటరీ ఎం.డి. ఇమాం గోరి, ట్రెజరర్ సి. సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. బోర్డు ఆఫ్ మెంబెర్స్ ఎం.ఏ. రెహ్మాన్, సి.ఎస్. రామ్ మోహన్ రావు, అక్తర్ సుల్తానా, అమత, బోరబండ డివిజన్ నాయకులు ఫయాజ్ ఖాన్, విజయ్ సింహ రెడ్డి, ఖదీర్, ముక్రం,సర్దార్,అజేయ, మేరీ, సునీల్, తిరుపతయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

శానిటేషన్ నిర్వహణపై కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ గురువారం తన కార్యాలయంలో జి.హెచ్.ఎం.సి. శానిటేషన్ స్వీపింగ్ రామ్‌కి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్పొరేటర్ పలు సమస్యలను ప్రస్తావించారు. డివిజన్‌లో చెరువు కట్టపైన బస్తీలలో చెత్త పేరుకుపోతున్నదని తెలిపారు. ప్రతిరోజూ పరిసరాలను శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమతా, శానిటేషన్ సూపర్వైజర్ మనోహర్ రెడ్డి, జవాన్ బుజ్జి, ఎస్ఆర్పి చైతన్య (రామ్‌కీ శ్రీకాంత్ రెడ్డి అరుణ) శంకర్ , శ్రీనివాస్, సంపత్, రాజు, మల్లేష్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత కోచింగ్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

- షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పెరిక యాదయ్య



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ స్టడీ సర్కిల్ 2024- 25 విద్యా సంవత్సరానికి సివిల్ సర్వీస్ ఎగ్జామ్స్ కోసం ఉచిత కోచింగ్ నిర్వహిస్తుందని ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పెరిక యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఎగ్జామ్(ప్రిలిమ్స్ కం మెయిన్స్) రాసే అభ్యర్థులకు రాష్ట్ర షెడ్యూల్ ట్రైబ్స్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారు ఉచిత కోచింగ్ ఇస్తున్నారని తెలిపారు. సీట్ల సంఖ్య 100 ఉందని ఇందులో ఎస్టీలకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, బీసీలకు 10 శాతం సీట్లు కేటాయిస్తారు. అర్హతలు: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, తల్లిదండ్రుల వార్షికోత్సవం రూ. 3 లక్షలకు మించరాదు. దరఖాస్తులను ఆన్లైన్ లో చేసుకోవాలని, దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ జూన్ 30 అని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు https://studycircle.cgg.gov.inలో సంప్రదించవచ్చని తెలిపారు.

సరోజా రాయ్‌ను అభినందించిన ఏవియేషన్ సైంటిస్ట్ సౌగంధి

నవతెలంగాణ-సిటీబ్యూరో



కాలేజ్ ఆఫ్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీ, ఓల్డ్ డొమినియన్ విశ్వవిద్యాలయంలో హ్యూమన్ ఫ్యాక్టర్స్ సైకాలజీలో పీహెచ్‌డీ వచ్చిన డా.హిప్నో కమలాకర్ కూతురు క్లినికల్ సైకాలజిస్ట్ సరోజా రాయ్ సరోజా రాయ్‌ను బెంగుళూరు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఏవియేషన్ సైకాలజీ క్రూ సైంటిస్ట్ ఎఫ్ అండ్ ప్రొఫెసర్ హెడ్ సి.హెచ్.ఎన్. సౌగంధి హైదరాబాద్ డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో కలిసి అభినందనలు తెలియజేశారు.

సృష్టిలో ప్రేమ త్యాగం పరస్పరాశ్రయాలని తెలిపిన 'అజరామరం'

నవతెలంగాణ-కల్చరల్



నిజమైన ప్రేమ త్యాగంతో ముడి పడి ఉంటుందని.. ప్రేమ భావనలకు పగ ప్రతీకారం ఉండవని.. ఈ నేపథ్యంలో ' అజరామరం,' సాంఘిక నాటకం రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై కళా వర్షిణి (హైదరాబాద్) వారు ప్రదర్శించారు. జమిందారీ కుటుంబానికి చెందిన కీర్తి శేఖర వర్మ ఉన్నతవిద్య చదివినా గ్రామ ప్రజలకు సేవ చేస్తూ అక్కడే ఉంటారు. దేవదాసి కుమార్తెను ఆ వృత్తిలోకి వెళ్లకుండా సమాజాన్ని ఎదిరించి తన సంరక్షణ లో ఉంచుకుంటారు . వర్మ వివాహం వేరే వారిని చేసుకున్న తరువాత భార్య భర్తల మధ్య దేవదాసి కుమార్తె గురించి జరిగే విభేదాలలో ప్రేమ త్యాగం మధ్య పరస్పర సంబంధాన్ని నాటకం సందేశంగా అందిస్తుంది. ఆనం శ్రీనివాస్ రావు రచించిన మూల కథను నాటకంగా జెట్టి హరి బాబు మలచి అజరామరం కు దర్శకత్వం వహించారు. నాటకం లోని ప్రతి పాత్ర అనుభవం ఉన్న కళాకారులు నటించటం వల్ల ఆసాంతం రక్తి కట్టించారు ప్రతి నెలా టికెట్ పై నాటక ప్రదర్శన అనే నినాదం తో సాగుతున్న ప్రముఖ నాటక సంస్థ రసరంజని నిర్వహణ లో ఈ నాటకం ప్రదర్శన జరిగింది

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
హైదరాబాద్
HMDA
శుక్రవారం | జూన్ 28, 2024 | www.navatelangana.com

'అంబేద్కర్ అంతటి గొప్ప వ్యక్తి బొజ్జా తారకం'

● తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్, జస్టిస్ డా.జి.చంద్రయ్య

నవతెలంగాణ-హిమాయత్ నగర్

హక్కుల దిక్సూచి, పీడిత ప్రజల గొంతుక, హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఉద్యమ నాయకుడు, సంఘ సంస్కర్త, సమరశీలి బొజ్జా తారకం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అంతటి గొప్ప వ్యక్తి అని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్, జస్టిస్ డా.జి.చంద్రయ్య కొనియాడారు. బొజ్జా తారకం ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వర్గీయ బొజ్జా తారకం 85వ జయంతిని పురస్కరించుకుని గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జస్టిస్ డా.జి.చంద్రయ్య చేతుల మీదుగా బుద్ధుని ప్రవచనం, బొజ్జా తారకం-వ్యాసాలు, స్వతంత్ర భారతదేశం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా? అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 'కవి సంధ్య' పత్రిక సంపాదకులు, ప్రముఖ కవి, విమర్శకులు డా.శిఖామణి, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ఓయూ మాజీ ప్రిన్సిపాల్, ఆంధ్రప్రదేశ్ కాలేజీ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యులు, ప్రొఫెసర్ జి.సత్యనారాయణ, సెంటర్ ఫర్ రీసెర్చ్ డెవలప్మెంట్ డైరెక్టర్, ప్రొఫెసర్ జి.రాంరెడ్డి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది, మాజీ జిల్లా జడ్జి నిమ్మ నారాయణ, భూమిక మాసపత్రిక సంపాదకులు, ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కొండవీటి సత్యవతి, బొజ్జా తారకం ట్రస్ట్ సమన్వయకర్త గనుమల జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

● కుండ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ- మేడ్చల్

జనాభా ప్రతిపాదికన మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ యువనాయకుడు కుండ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 28న మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలో నిర్వహించే కార్యక్రమానికి మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి రానున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క మాదిగ బిడ్డ తరలిరావాలని కుండ ప్రవీణ్ కుమార్ కోరారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధించే వరకు ప్రతి ఒక్క మాదిగ బిడ్డ పిడమర్తి రవికి మద్దతుగా నిలబడి మాదిగల ఐక్యతను చాటాలని సూచించారు. గతంలో రిజర్వేషన్ 7శాతం ఉండటం వల్ల మాదిగలు అన్ని విధాలుగా నష్టపోయారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ల పెంపుపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-హయత్‌నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్‌లో 2024-25 విద్యాసంవత్సరం కోసం సంస్కృతం-1, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్-2, స్టాటిస్టిక్స్-1 మొత్తం 3 సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకం చేయనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జ్యోత్స్నప్రభ ఒక ప్రకటనలో తెలియజేశారు. సంబంధిత పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. సంబంధి.త సబ్జెక్టులో నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తారు. అలాగే ఇంతకుముందు డిగ్రీ కళాశాలలో బోధనానుభవం ఉన్నవారు సర్వీస్ సర్టిఫికెట్ జతచేయలని ఆసక్తి కలిగిన అభ్యర్థులు తేదీ 01.07.2024 సాయంత్రం వరకు కళాశాలలో వారి దరఖాస్తులను సమర్పించవలసిందిగా ప్రిన్సిపాల్ తెలియజేశారు.

చెత్తగా మారుతున్న రోడ్లు..



న్యూ మారుతి నగర్ రోడ్ నెంబర్ 12లో గల ఒక అపార్టుమెంట్ యందు గత కొన్ని రోజులుగా చెత్త నిలువ ఉంటుంది. గురువారం కురిసిన వర్షం కారణంగా చెత్తలో నీరు చేరింది. దాంతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని వెంటనే శుభ్రపరిచి సీజనల్ వ్యాధులనుండి జాగ్రత్తపడాల్సిందిగా కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ కొత్తపేట


మాదిగ జర్నలిస్టు ఫోరం మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా జోగు వెంకట్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కన్వీనర్ గా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన జోగు వెంకట్ నియమితులయ్యారు. గురువారం నగరంలోని కంటోన్మెంట్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎండబ్ల్యూజేఎఫ్ జాతీయ ఇంచార్జీ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎండబ్ల్యూజేయు రాష్ట్ర ఇన్‌చార్జీ సుంచు అశోక్ మాదిగ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గాదె రమేష్ మాదిగలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏండ్లు పూర్తయిన సందర్భంగా జూలై 7న వరంగల్‌లో జరిగే 'మాదిగల కవాతు'ను జయప్రదం చేయాలని పిలుపనిచ్చారు. అనంతరం వారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన జోగు వెంకట్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు (ఏ.బి.సి.డి.)వర్గీకరణ ఉద్యమంలో క్రియాశీలకంగా భాగస్వామ్యంతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని, తన నియామకానికి సహకరించిన సంఘం జాతీయ రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఎర్ర యాకన్న, సి.దశరథ్, మహంకాళి, బిక్షపతి, బూడిద నరేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఉదయ్ గంజి ముదిరాజ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘ సేవకులు ఉదయ్ గంజి ముదిరాజ్ జన్మదిన వేడుకలు గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ గిరి నగర్ లోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధి కోసం దాతగా తన వంతు సహాయ సహకారాలు అందజేసినందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా తన వంతు సేవలందిస్తారని ఆయన స్పష్టం చేశారు అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, కేకు అందజేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు స్థానిక బస్తీ వాసులు ఉదయ్ ముదిరాజ్‌ని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రంగంలోకి రంగనాథ్

● ఆక్రమణకు గురైన ప్రభుత్వ ఆస్తులు, అక్రమ కట్టడాలపై ప్రత్యేక దృష్టి
● చార్జ్ తీసుకున్న 20 గంటల్లోనే కోట్లాది రూపాయల విలువ చేసే పార్కు స్థలాన్ని కాపాడిన డైరెక్టర్ రంగనాథ్





నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్

జీహెచ్ఎంసీ ఇవీడీఎం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రంగనాథ్ ఆక్రమణకు గురైన ప్రభుత్వ ఆస్తులు, అక్రమ కట్టడాలపై ప్రత్యేక దృష్టి సారించారు. చార్జ్ తీసుకున్న దాదాపు 20 గంటల్లోనే జూబ్లీహిల్స్‌లో ఆక్రమణకు గురైన కోట్లాది రూపాయల విలువగల పార్క్ స్థలాన్ని రక్షించారు. జీహెచ్ఎంసీ సర్కిల్ 18 జూబ్లీహిల్స్, రోడ్ నెం 86లోని జూబ్లీహిల్స్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పక్కనే లోటస్ పాండ్‌లో జూబ్లీహిల్స్‌కు చెందిన ప్రముఖ వ్యాపారికి చెందిన ప్లాట్ ఉంది. లోటస్ పాండ్ పార్క్ వెనుక భాగంలో ప్లాట్ ఉండడంతో పార్కు స్థలంపైనే అతను కన్నేశాడు. కబ్జాకు యత్నించాడు. ప్లాట్‌లోకి వెళ్లేందుకు పార్కు స్థలంలోని పెద్ద పెద్ద వృక్షాలను సైతం నరికివేసి చదును చేస్తున్నాడు. అయినా అధికారులెవరూ అడ్డుకోకపోవడంతో గత కొద్ది రోజుల క్రితం ఏకంగా జీహెచ్ఎంసీ ప్రహరీతో పాటు దానికి ఉన్న గ్రిల్స్‌ను సైతం తొలిగించాడు. పార్కుకు చెందిన దాదాపు 500 గజాలల్లో రోడ్డు వేసేందుకు లారీలతో మట్టి పోయించాడు. ఈ తంతాంగం అంతా గత నెల రోజుల నుండి కొనసాగుతూనే ఉన్నా సర్కిల్ 18 టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తున్నారు. జూబ్లీహిల్స్ ప్రాంతంలో పార్కు స్థలం కబ్జా అవు తుందని కొందరు స్థానికులు పలు మార్లు జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఖైరతాబాద్ జోన్ అధికారులు పట్టించు కోలేదు. అయితే పార్కు కబ్జా అయిన విషయం విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రంగ నాథ్ దృష్టికి వెళ్లడంతో ఆయన హుటాహుటిన కబ్జా స్థలానికి చేరుకొని వెంటనే ఇక్కడ మర మ్మతులను ఆపాలని ఆదేశించారు. పార్కు స్థలాన్ని పరిశీలించారు. ప్రహరీని కూల్చడంతో పాటు చెట్లను కొట్టివేయడాన్ని ఇంత వరకు ఎందుకు గమనించ లేదని అధికారులను నిలదీశారు. స్థానికులతోపాటు సంబంధిత అధికారుల నుంచి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కు స్థలాన్ని యథావిధిగా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ క్రమంలో సర్వే నిర్వహించిన రెవిన్యూ అధికారులు పార్క్ స్థలాన్ని కబ్జాచేసుకున్నట్టు గుర్తించారు. దాంతో ఆక్రమణకు గురైన స్థలంలో వ్యాపారీ నిర్మించిన ప్రహరీని జీహెచ్ఎంసీ అధికారులు, జూబ్లీహిల్స్ పోలీసుల సహకారంతో కూల్చివేశారు. అనంతరం సదురు యజమానికి నోటీసులు జారీ చేశారు. ఎవరైనా పార్క్ స్థలాలు, జీహెచ్ఎంసీకి సంబంధించిన స్థలాలను ఆక్రమించినట్టయితే కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు.

IN THE COUR OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI DISTRCIT, AT: MALKAJGIRI
O.S.NO.613 OF 2024

Between :-
Mrs.Nidamanuri Jayaramamma and others ...Plaintiffs
AND
The Tahsildar Malkajgiri & another ...Defendants
To
All concerned, ...Defendant No.2

The plaintiffs have instituted above suit for the relief of Declaration of Legal Heirs to declare plaintiffs as the only Legal Heirs of the deceased Late Nidamanuri Balakrishna Murthy who died intestate on 06-01-2022. The above case stands posted **to 15-07-2024** for the appearance of the defendants. If any person is having any right, claim or objection if any may appear before the above court **at 10.30 A.M.** either in person or through their counsel on the date, month and year above mentioned failing which the court shall proceed with the case as per law.

K.S.KUMAR
M.NANDINI, Advocates
10-1-626/A, West Marredpally
Secunderabad-500026,
Mobile No. 9966971155

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
I.A.No.1033 OF 2023 IN O.S.No.577 OF 2019

Between:
M/s Gold age Hospitals Pvt Ltd Rep by its Managing Director Sri Tummala Prashant ...Petitioner/Plaintiff
AND
Sri Yennu Yadagiri Reddy and another ...Respondents/Defendants
To
1) Sri Yennu Yadagiri Reddy S/o Late Venkat Reddy Aged about 50yrs Occ:Business R/o H-No 5-6-574/1, Plot no 935 Mamidi Nilayam Road No 9, Near SLNS Temple SKD Nagar, B N Reddy Nagar Hyd (Respondent no1/Defendant No 1)
2)K V R S Prasad S/o Venkata Subbaiah Naidu Aged about 58yr Occ: Business R/o Krishna Lok Apartments, H No 8-3-825/5/59 Subash Nagar, Srinagar colony Hyderabad.
(Respondent no2/Defendant No 2)

Whereas the above named Petitioner/Plaintiff have filed a suit against both of you for Recovery of amounts and filed the above IA No 1033 /2023 to condone the delay in presenting the petition filed under O9 Rule 9 for restoration of the suit which has been dismissed for default on 31-03-2022 . You are herby summoned to appear in the above court in person or by an advocate duly instructed **on 30-07-2024 at 10: 30 AM** failing which the matter will be decided ex-parte in accordance with Law.

//By order of the court//
Vijay Saradhi. A
Advocate
503, Parimala Vihar Malakpet Hyderabad. Cell: 9000933945

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE: R.R.DISTRICT. AT: HAYATHNAGAR.
O.S.NO.454 OF 2024.

Between:
Prathibha Prakash Kumbhare and others ...Plaintiffs
And
The Tahsildar Abdullapurmet & another ...Defendants
To,
All Concerned ...Defendant No.2

Please take notice that the Plaintiffs have filed the above suit against you and another, to declare them as the legal heirs of deceased Gajendra Prakesh @ Kumbhare Prakash Sitaram s/o Late Kumbhare Sitaram. The above suit is posted to 22-07-2024. You are hereby summoned to appear before the Hon'ble Court **on 22-07-2024, at about 10.30 A.M**. either in person or through an Advocate, failing which the matter will be decided as per law. Hence this notice.

SCHEDULE OF PROPERTY

All that piece and Parcel of Land bearing Plot No.B-22, in Sy.No.91, admeasuring 300 sq.yards or equivalent to 250.83 sq.meters, situated at Kuntloor village, under Pedda Amberpet Municipality, Abdullapurmet (Previously Hayath nagar) Revenue Mandal, Ranga Reddy District, Telangana State and bounded by:

NORTH : Plot No.B-21
SOUTH : Plot No.B-23
EAST : Owners Land
WEST : 30' wide Road

(BY ORDER OF THE COURT)
M/s.HEMANTH PRAVEEN KUMAR
Advocate & Associates
Plot No.71, Raghavendra Nagar, Hayathnagar, Hyderabad
Counsel for the Plaintiffs.

IN THE COURT OF THE HON'BLE II ADDL SENIOR CIVIL JUDGE COURT, MEDCHAL MALKAJGIRI DISTRICT AT:MALKAJGIRI.
I.A.NO.426 OF 2022 IN O.S.NO.792 OF 2022

BETWEEN:
K.Veera Reddy & another ....Petitioners/Plaintiffs.
AND
Sirajuddin Mohammed Educational Society and others. ...Respondents/Defendants
To
1.Syeda Farees Banu, W/o.Late Mohammed Sirajuddin, Aged: Aged: 45 yrs, Occ:-House Wife
2.Mohammed Abdul Azizuddin, S/o.Late Mohammed Sirajuddin, Aged:13 yrs, Occ:-Student
3.Mohammed Wahajuddin, S/o.Late Mohammed Sirajuddin, 13yrs, Occ:-Student
4.Mohammed Akbaruddin, S/o.Late Mohammed Sirajuddin, Aged: 9 years, Occ:-Student
(All are R/o.H.No.9-4-135, Happy Nest Apt, Vali Colony, Tolichowki, Golkonda, Hyderabad.)

Whereas the above mentioned petitioners filed the said Interlocutory Petition Under Order-22 Rule-4 of C.P.C. Read with Section 151 of C.P.C praying the Hon'ble Court to grant leave/permit to bring the Legal heirs of the deceased Mohammed Sirajuddin and to add above mentioned you, as defendant no.5 to 8 in the main suit with the proposed consequential amendments. That the above said case stands posted on 16/07/2024, you are hereby order by the above said Hon'ble Court to appear either in person or through your counsel on 16/07/2024, at 10.30 A.M., before the above said Court in case of any objection. In case of default to appear in person or through counsel **on 16/07/2024 at 10.30 AM,** the said petition, will be heard and determined in your absence, ex-parte by the Honble Court.

//BY THE ORDER OF THE COURT//
M/s.Y.Shashidhar Reddy
Advocate
O/o.# 12-13-367/B, Street No. 19, Opp:Vinodam NirupamApartments, Tarnaka, Secunderabad, Hyderabad.500017
Phone. No.9392029160

APPLICATION FOR LEGAL HEIRS CERTIFICATE IN THE COURT OF V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.No.2495 OF 2024

Between:
1.Sri.V.V.S.RAMA KRISHNA S/o.Late V.ANNAM RAJU, Aged about 61yrs, Occ: Advocate, R/O H.No.6-3-595/34, Padmavathi Nagar, Khairtabad, Hyd-500004.
2.Sri.V.M.S.ANIRUDHA, S/o.Sri V.V.S.RAMA KRISHNA, Aged about 26yrs, Occ: Student, R/O. H.No. 6-3-595/34 Padmavathi Nagar, Khairtabad Hyd-500004.
3.Kum.V.S.Apurva, D/o.Sri.V.V.S. RAMA KRISHNA,Aged about 26yrs, Occ: Psychologist R/O. H.No.6-3-595/34 Padmavathi Nagar Khairtabad Hyd-500004.
4.Smt.V.ALEKHYA, W/O.Sri. UDAY KUMAR, Aged about 32 yrs, Occ: Teacher, R/O H. No. 6-3-582/4, Nagamani Nilayam,Gandhi Tata Nagar, Khairatabad, Hyd-500004 ...PLAINTIFFS
AND
1.WHOSOEVERITMAYCONCERN
2.The Tahsildar, O/o Khairatabad MRO, Ananadnagar Khairatabad, Hyderabad 500004 ...DEFENDANTS

PUBLIC NOTICE

Whereas application has been filed by the Plaintiffs/Petitioners for declaring the Plaintiffs as LEGAL HEIRS Late. VELICHETY RADHA RANI CERTIFICATE deceased died on 27th September 2023 by granting LEGAL HEIRS Now it is notified for general information that any person having any objection thereto may file their objections in the Court of V Junior Civil Judge City Civil Court, Hyderabad on or before **22-07-2024** next Date of hearing, in default, the matter will be held ex parte.

(By order of the Court)
GERA RAVI,
ADVOCATE
P.No.92, H.No. 3-2-230, SBH Colony Venture-2, LB Nagar, Ranga Reddy 500074
COUNSEL FOR PLAINTIFFS

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE AT NIZAMABAD
I.A. No. 242 of 2024 in O.S. No. 24 of 2023

Between:-
Smt. Vandana Malik ...**petitioner/plaintiff**
And
Rajeev Sahani and others .. **Respondents/defendants**
To,
Tilak Sahani S/o Kuldeep Kumar Sahani, aged about 30 years, occ: business r/o. Flat No.401, 4th floor, opposite to: 1CICI Bank, Asafjahi Towers, VTC Khairatabad, PO: Banjara Hills, Hyderabad.

Take Notices that the petitioner/Plaintiff filed the petition under Section Order 39 Rule 1 an2 r/w Sec 151 of CPC against you Notices sent to you were returned unserved as you are deliberately avoided them. The case stands posted to **5th July 2024 at 10.30 a.m.** for your appearance. On that day you may appear in person or through an advocate. If you fail to appear, you will be set ex parte and the matter would be decided in your absence.

// BY ORDER OF THE COURT //
Sd/-
Gajawada Tulasidas,
Advocate,
6-18-63, Old NGO's Colony, Road No.1, Near Electrical Transformer, Behind Mamidi Bajanna Rice Mill, Subashrnagar, Nizamabad-503002 (TS)
Mobile: 9440633391

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE-CUM I ADDL METROPOLITAN MEGISTRATE RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
O.S.No: 400 OF 2024

BETWEEN:
1)MUJEEB BEGUM w/o.Late Mohammed Sharfuddin ,Aged: 62yrs, Occ: Housewife ,
2)MOHAMMED SHAKEELUDDIN s/o Late Mohammed Sharfuddin Aged:43yrs, Occ:Business,
3)MOHAMMED SHAREEFUDDIN s/o Late Mohammed Sharfuddin Aged:39yrs, Occ: Business,
4)MUMTAZ BEGUM d/o Late Mohammed Sharfuddin Aged: 41yrs, Occ: Household , (All are R/o.H.No: R/o. H.No.12-2-37/1/A/95/1,Zeba Bagh Asif Nagar Hyd ...Plaintiffs
AND
1) Mandal Revenue Officer, Balapur Mandal Yelmati Nagar Balapur
2) All concerned ...Defendants

Please take notice that the above named plaintiffs has filed the above suit against you for Declaration to declare the plaintiffs as legal hairs of Late Mohammed Sharfuddin and to declare that they are the absolute owner and possessor of the suit schedule property i.e A) Land bearing Plot No:51 in Survey No:263 and 264 Admeasuring 150 Squre Yards or Equivalent to 125.41 Sq Meters situated at: Balapur Villgae Saroornagar Mandal Ranga reddy District under Balapur Gram Panchayat bounded By **NORTH** :PLOT NO:60 **SOUTH:** 25' FEET WIDE ROAD, **EAST:** PLOT NO:50, **WEST:** PLOT NO: 52, Schdule i.e B) Land bearing Plot No:1 and 2 in survey No:237 Admeasuring 219.55 Squre yards or Equivalent to 183.57 Squre meters situated at:Balapur Villgae Saroornagar Mandal Ranga reddy District under Balapur Gram Panchayat Bounded By:-**NORTH:** 18' FEET WIDE ROAD ,**SOUTH:** NEIGHBOURS LAND **EAST :** 18' FEET WIDE ROAD, **WEST:** PLOT NO:3, and the same is pending before the above said court and the matter is posted **on 15-7-2024 at: 10.30.A.M** for your appearance and counter if any otherwise the matter will be decided as per Law Hence this Notice

//BY ORDER OF THE HONBLE COURT//
MOHD ABDUL ALI
ADVOCATE
Office at # 16-8-913/3/D, Malakpet, Hyderabad-500 024, T.S. CELL No:8247571106

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, R.R. DISTRICT, AT: RAJENDRANAGAR.
O.S.No. 192 OF 2024

Between: -
1.K.V.Seetha Ramarao
2.Kanneganti Aruna ...Plaintiffs
AND
1.The Tahasildar, Gandipet Mandal, Ranga Reddy Dist. T.S.
2.To Whom So Ever It May Concern ...Defendants
To,
To Whom So Ever It May Concern (All Concerned)

NOTICE

Please take notice that the abovesaid Original Suit to declare the plaintiffs as legal heirs to Late Kancharla Nageswara Rao and Late Kancharla Udaya Laxmi. The above case posted to 05-07-2024. In case anybody has any right or any interest to objections or claims they may appear before The Hon'ble court **on 05-07-2024, at 10-30 AM,** either in person or through counsel with all documentary evidence in support of their claim or objection failing which the matter will be decided by The Hon'ble court in accordance with law.

//BY ORDER OF THE COURT //
M/s.CHALLA SRINIVAS
P. SINDHU PRIYA
ADVOCATES
#Flat No.R-608, Rajapushpa The Retreat Gandipet Main Road, Kokapet R.R.District, Hyderabad-500089,T.S Ph. 9642184863

APPLICATION FOR LEGAL HEIRS CERTIFICATE IN THE COURT OF V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.No.2452 OF 2024

Between:
1.Smt.SUDHA KACHE W/o Mr. Srinivas kache aged about 60 Yrs Occ: Retd. lecturer R/o H.No.3-4-374/7, Basanth Nagar Colony, Kachiguga, Hyd-500027. M.No.9848467497
2.Smt.USHA MANGIPUDI W/o Sri. Col. Ravindra Mangipudi aged about 57yrs., Occ:Housewife, R/o H-42.AWHO Vedvihar, Subhash Nagar, Tirrumalgiri, Secunderabad 500015, M.No.9492509921,
3.Sri.PRAVEEN KUMAR GANTI S/o Late.Annaji rao Ganti aged about 45yrs.,Occ:Doctor, presently residing at Toronto, Canada, Rep. by his POA Holder Smt. SUDHA KACHE W/o Mr. Srinivas kache aged about 60 Yrs., Occ: Retd. lecturer R/o H.No.3-4-374/7, Basanth Nagar Colony,Kachiguga, Hyd- 500027. M.No.9848467497
4.Sri.V.V.S.RAMA KRISHNA S/o.Late V.ANNAM RAJU, Aged about 61yrs, Occ: Advocate, R/O H.No.6-3-595/34, Padmavathi Nagar, Khairtabad, Hyd-500004.
5.Sri.V.M.S.ANIRUDHA, S/o Sri V.V.S.RAMA KRISHNA, Aged about 26yrs, Occ: Student, R/O H. No.6-3-595/34 Padmavathi Nagar, Khairtabad Hyd-500004.
6.Kum.V.S.Apurva, D/o.Sri.V.V.S. RAMA KRISHNA, Aged about 26 yrs, Occ: Psychologist R/O H.No. 6-3-595/34 Padmavathi Nagar Khairtabad Hyd-500004.
7.Smt.V.ALEKHYA, W/O.Sri.UDAY KUMAR, Aged about 32YRS, Occ: Teacher, R/O H.No.6-3-582/4, Nagamani Nilayam,Gandhi Tata Nagar, Khairatabad, Hyd-500004. ...PLAINTIFFS
AND
1.WHOMSOEVER IT MAY CONCERN
2.The Tahsildar, O/o.Khairatabad MRO, Ananadnagar Khairatabad, Hyd-500004 ...DEFENDANT

PUBLIC NOTICE

Whereas application has been filed by the Plaintiffs/Petitioners for declaring the Plaintiffs as LEGAL HEIRS Late. VELICHETY RADHA RANI deceased died on 27th September 2023 by granting LEGAL HEIRS CERTIFICATE Now it is notified for general information that any person having any objection thereto may file their objections in the Court of V Junior Civil Judge City Civil Court, Hyderabad on or before **22-07-2024** next Date of hearing, in default, the matter will be held ex parte.

(By order of the Court)
Gera Ravi,
ADVOCATE
P.No.92, H.No.3-2-230, SBH Colony Venture-2. LB Nagar, Ranga Reddy 500074
COUNSEL FOR PLAINTIFFS

IN THE COURT OF THE HONOURABLE DISTRICT JUDGE AT NIZAMABAD
O.S.No. 24 of 2023

Between:-
Smt. Vandana Malik ... **plaintiff**
And
Rajeev Sahani and others. ..**defendants**
To,
Tilak Sahani S/o Kuldeep Kumar Sahani, aged about 30 years, occ: business r/o. Flat No.401, 4th floor, opposite to: 1CICI Bank, Asafjahi Towers, VTC Khairatabad, PO: Banjara Hills, Hyderabad.

Take Summons that the Plaintiff filed the Suit for partition under Section 26 CPC against you Summons sent to you were retumed unserved as you are deliberately avoided them. The case stands posted to 5th July 2024 at 10.30 a.m. for your appearance. On that day you may appear in person or through an advocate. If you fail to appear, you will be set ex parte and the matter would be decided in your absence.

// BY ORDER OF THE COURT //
Sd/-
Gajawada Tulasidas,
Advocate,
6-18-63, Old NGO's Colony, Road No.1, Near Electrical Transformer, Behind Mamidi Bajanna Rice Mill, Subashnagar, Nizamabad-503002 (TS)
Mobile: 9440633391

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, CUM-XV ADDL METROPOLITAN MEGISTRATE CYBERABAD DISTRICT AT: RAJENDRA NAGAR
O.S.No:29 OF 2024

BETWEEN:
1-SYED NAJEEBUDDIN s/o.Syed Khaja Moinuddin Aged: yrs, Occ: Busniess ,R/o.H.No:2-6-40/TM/501 Times Enclave Rajendranagar ,K.V.Rangareddy.
2.SYED FASIUDDIN HUSSAINI s/o.Syed Khaja Moinuddin Aged: yrs, Occ:Busniess ,R/o.Flat No:101 Happy Homes Imperil Upparpally Attapur ,K.V.Rangareddy.
3.SYED FAZALUDDIN HUSSAINI s/o.Syed Khaja Moinuddin Aged: yrs, Occ:Busniess ,R/o.of Hudco Cross Navraspur Colony Bijapur Karnataka,
4.SYED SAMIUDDIN HUSSAINI s/o.Syed Khaja Moinuddin Aged: yrs, Occ:Busniess ,R/o.H.No:16-4-544/3 Flat No:104,Chanchalguda Near Dabeerpura Flyover Chanchalguda Hyderabad .
5.SYED ZIAUDDIN HUSSAINI s/o. Syed Khaja Moinuddin Aged: yrs, Occ:Busniess ,R/o.H.No:4-11-291/1/A Chantanya puri Colony DVK Road ,Nalgonda .
6.MRS GHOUSI SULTANA w/o Mohammed Aijaz Ul Rahman D/o.Syed Khaja Moinuddin .Aged: yrs, Occ:Housewife, Happy Homes Colony Upparpally Attapur , K.V.Rangareddy. ...Plaintiffs
AND
1.Tashildar Rajendranagar Mandal Rajendranagar, Mandal (Near National Institute of Rural Develop ment Road Manikyamma Colony) Rajendranagar Ranga Reddy.
2)All concerned ...Defendants

Please take notice that the above named plaintiffs has filed the above suit against you for Declaration to declare the plaintiffs as legal hairs of Late KJAHA MOINUDDIN and the same is pending before the above said court and the matter is posted **on 11-7-2024 at: 10.30.A.M** for your appearance and counter if any otherwise the matter will be decided as per Law Hence this Notice

//BY ORDER OF THE HONBLE COURT//
MOHD ABDUL ALI
ADVOCATE
Office at # 16-8-913/3/D, Malakpet, Hyderabad-500 024, T.S. CELL No:8247571106

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE RANGA REDDY DIST. AT: L.B. NAGAR
A.O.P.No.167 OF 2020

Between:
Jammidi Sathi Reddy & another ...Petitioners
And
M/s Sriram Transport Finance Co., Ltd., Rep. by its Authorized Signatory, & another ...Respondents
To
2.Venkat Rao, (Arbitrator) Office at Flat No.004, Vani ViharApartments , Street No.5, Habsiguda Hyd (RESPONDENT No.2)

NOTICE

Please take Notice, that the above petitioner filed the above petition against you and another challenging the award passed in Arbitration Case No.238/2019 and the same stands posted to 11.07.2024 for your appearance either in person or through your counsel as such you are hereby directed to appear before the Hon'ble V Addl. District Judge, R.R.District at L.B.Nagar, **on 11.07.2024 at 10.30 AM** failing which the matter will be decided in your absence as per law and otherwise the case will be decided as for law.

//By Order of the court//
M/s.L.SRINIVASA RAO,
ADVOCATE,
#H.No.5-2-180/36, Road No.3, Gandhi Nagar, Vanasthalipuram, Hyderabad
Ph: 9948098737

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE CUM IX METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT :KUKATPALLY
O.S.No.1016 of 2023

Between:
Kolukula Jaya Lakshmi &2 others ...Plaintiff
AND
1.Pothireddy Pushpavathi
2.The Tahsildar, Serilingampally Mandal
2.All Concerned ...Defendants

NOTICE

To,
1.Pothireddy Pushpavathi, W/o. Kesava Rao, Aged about 80yrs, R/o.20/516-27-2, Machilipatnam, NGO Colony, Chilakalapudi, Krishna District, Andhra Pradesh.
2.The Tahsildar, Serilingampally Mandal,
3.All Concerned ....Defendants

Please take notice that, the above said plaintiff filed the above suit against you for declaration before the Hon'ble I Addl.Junior Civil Judge cum IX Metropolitan Magistrate, Ranga Reddy District, at Kukatpally vide OS.No.1016/2023 to declare the plaintiffs as Legal Heirs of Sri Late Kolukula Purnachandra Rao, who died on 20-04-2019 in respect of the suit schedule property "A" property i.e. Flat No.407 at Block "F" in Fourth Floor of the building named and styled as "ADITYA'S IMPERIAL HEIGHTS" with built up area admeasuing 1490 Sq.feet including common areas, amenities and two car parking spaces, together with undivided share in the land admeasuring 44.22. Sq.yards out of Ac 10-10 gts constructed on land admeasruing 10 Acres 10 Guntas in Survey Nos.83, 84, 85, 86, &87 situated at Hafeezpet Village, Serilingampally Mandal, Serlingampally, Ranga Reddy District and the same is posted for any claims or objections from any concerned for their appearance **on 02-07-2024 at 10:30.AM.** The Hon'ble court was pleased to directed the Plaintiff for serve the notice by way of publication to Defendants and all concerned. As per the order of the Hon'ble court Defendants is herby directed to appear in person before. Hence you are hereby informed to appear before the above said court **on 02-07-2024 at 10.30 A.M.**, in person or through your counsel, failing which the matter will be decided in your absence according to law.

(By order of the Court)
NAGESHWAR RAO PUJARI
Advocate

రోడ్లపై చెత్తను పారవేస్తున్న దుకాణాలపై జరిమాన విధించండి

● ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి



నవతెలంగాణ-మెహిదీపట్నం

చెత్తకు కేటాయించిన ప్రాంతాలలో కాకుండా బాధ్యతారహితంగా రోడ్లపై చెత్తను పారవేస్తున్న దుకాణ, వాణిజ్య సముదాయాల యజమానులపై జరిమాన విధించాలని ఖైరతాబాద్ మున్సిపల్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గురువారం ఆయన సర్కిల్ 12డీప్యూటీ కమిషనర్ నాగేశ్వరరావు, ఏఎంహెచ్ఓ విజయ్‌తో కలిసి మల్లెపల్లిలో పారిశుద్ధ్య పరిస్థితులపై క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన చెత్తను సేకరించడంలో స్వచ్ఛ ఆటోలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

'పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్-14లో గల పీఆర్ విద్యాలయ గవర్నమెంట్ స్కూల్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పీజేఆర్ ఫౌండేషన్ చైర్మెన్ పి.విజయ రెడ్డి విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత, అధ్యాపకులు, ఖైరతాబాద్ నియోజకవర్గం మైనార్టీ చైర్మన్ ముజ్జులా, కాంగ్రెస్ నాయకులు దిలీప్, రాజ్ రెడ్డి, జావీద్, కమల, ఫారుక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారులది కీలక పాత్ర

● నర్సింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి

● టీజేఎస్ అధ్యక్షులు ప్రొ. కోదండరాం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రజల ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సాహించడం , ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని, అనేక సమస్యలతో సతమతమౌతున్న నర్సింగ్ అధికారుల సమస్యల పరిష్కరానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవస్తానని టీజేఎస్ అధ్యక్షులు ప్రొ. కోదండరాం అన్నారు. నాంపల్లి తెలుగు యూనివర్సిటీ, ఆడిటోరియంలో గురువారం తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం రాష్ట్ర సదస్సును సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవి కిరణ్ పవ్వడి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శివ సాయి కృష్ణ స్వాగతం పలుకగా ప్రొ. కోదండరాం, ఐఎన్‌టీయుసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్, సంఘం సలహాదారు బి. వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సదస్సునుద్దేశించి ప్రొ. కోదండరాం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సింగ్ అధికారుల సమస్యల పట్ల ఉదాసీన వైఖరి ప్రదర్శించిందని నర్సింగ్ ఉద్యోగుల బదిలీలలో స్థానికత పాటించలేదని, డీఏ, పీఆర్సీ పెంపును పట్టించు కోలేదని, ఆస్పత్రుల్లో కనీసం నర్సింగ్ ఉద్యోగులకు దుస్తు లు మార్చుకునే గది, త్రాగు నీరు, వాష్‌రూమ్‌లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నర్సింగ్ అధికారులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ముఖ్యంగా జీ.ఓనెంబర్ 317 ద్వారా స్థానికత కోల్పోయిన నర్సింగ్ ఉద్యోగులకు న్యాయం, జాతీయ వైద్య మండలి నిబంధనల మేరకు ప్రతి 100 పడకల ఆస్పత్రిలో 5 మంది హెడ్ నర్సుల నియామకానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానని ప్రొ. కోదండరాం హామీ ఇచ్చారు. వై. నాగన్న గౌడ్ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఒక కళ, సైన్స్ అలాగే మానవతా సేవ అని, అనారోగ్యం నుండి కోలుకోవడానికి, సరైన ఆరోగ్యం, జీవన నాణ్యతను నిర్వ హించడానికి ప్రజలకు సహాయపడుతుందని తెలిపారు. అవసరమైన వైద్య సేవలను అందించే ఆరోగ్య సంరక్షణ అధికారుల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడివుందన్నారు. రాష్ట్ర ప్రజలకు సమర్ధవంతమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి "ఆరోగ్యకరమైన తెలంగాణ" నిర్మాణంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 7,000 మంది నర్సింగ్ అధికారులను నియమించిందని గుర్తు చేశారు. సంఘం ఐక్యతతో ఉంటేనే హక్కులు సాధించబడుతాయని, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలైన నర్సింగ్ అధికారులు సమస్యలపై వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహను కలసి పరిష్కరానికి కృషి చేస్తానని వై. నాగన్న గౌడ్ చెప్పారు. ఈ సదస్సులో తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. కవిత, ఉపాధ్యక్షులు ఎస్. సుజీవన్, కె. విజయేశ్కాంత్, ఈ. స్వాతి, సహాయ కార్యదర్శులు ఎండి. సలావుద్దీన్, కె. రామ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శులు జి. నరేంద్ర రాజన్, కె. వినోద్, కోశాధికారి జి. నరేష్, నేతలు రాజేందర్ రెడ్డి, నంద కుమార్, మొగిరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ పార్కుల్లో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించాలి

జీహెచ్ఎంసీ పార్క్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జీ.కిరణ్, సీఐటీయు నగర కార్యదర్శి ఎం.వెంకటేష్





నవతెలంగాణ-ముషీరాబాద్

జీహెచ్ఎంసీ పార్కుల్లో పనిచేసే కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని జీహెచ్ఎంసీ పార్క్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జీ.కిరణ్, సీఐటీయు నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అర్బన్ బయో డైవర్సి డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కేబీఆర్ స్టీల్ బ్రిడ్జ్ పార్కులలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు దాదాపు 22 సంవత్సరాలుగా పార్కుల పైన ఆధారపడి జీవనం గడుపుతున్నారన్నారు. వీరికి ప్రతినెలా అందాల్సిన వేతనాలు అందడం లేదని గత కొన్ని నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంట్రాక్టర్లు అందుబాటులో ఉండరని వేతనాలు అడిగితే డ్యూటీ నుండి తీసివేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. స్టీల్ బ్రిడ్జిపార్క్ కాంట్రాక్టర్ బ్రహ్మయ్య జనవరి నుంచి వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. రెండు రోజుల క్రితం రెండు నెలలకు సంబంధించిన వేతనాలు చెల్లించారని.. ఇంకా రావాల్సి న మూడు నెలల వేతనాలు అడిగితే మీరు డ్యూటీకి రావద్దని బెదిరింపుల కు పాల్పడుతున్నారని తెలిపారు. మహిళలను పచ్చి బూతులు తిడుతు న్నారని వాపోయారు. కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పీఎఫ్, గ్లౌజులు, బూట్లు, ఐడి కార్డులు వెంటనే ఇవ్వాల న్నారు. ప్రతి నెలా 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించి ప్లే సిప్స్ ఇవ్వాలన్నారు. కార్మికుల వేతనాలు రూ.15,600లకు పెంచాలని కోరా రు. కాంట్రాక్టర్ల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, యాదగిరి, సత్తయ్య, చంద్రయ్య, వెంకటయ్య, బాబు, ఎల్లయ్య ,బిక్షం ,సుజాత ,తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం



● పాదాచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హైటెక్ సిటీ, కొండాపూర్, మాదాపూర్, హఫీస్ పెట్, పరిసర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడన వర్షం కురిసింది. ముషీరాబాద్, ఓయూ, తార్నాక, సరూర్‌నగర్, హయత్ నగర్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, కంటోన్మెంట్, రాజేంద్ర నగర్, ఖైరతాబాద్, చార్మినార్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు చాలా ప్రాంతాల్లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయింది. మరో వారం రోజులపాటు తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ హెచ్చరికలతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉరుములు, మెరుపులు, ఈదుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అవసరమైతే గానీ ఇండ్లలోనుంచి బయటకు రావద్దని తెలిపారు.

కోఠి ఈఎన్‌టీ ప్రభుత్వ ఆస్పత్రికి పరికరాలు విరాళం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠి ఈఎన్‌టీ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఎబీఎన్ రావు ఆడిటోరియంలో ఎన్‌టీపీసీ సౌత్ రీజియన్ హెడ్ క్వార్టర్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ పాణిగ్రహి, డీజీఎం బద్రుద్దీన్ అన్సారి, మేనేజర్ ప్రియాంక తదితరులు 9.47 లక్షల విలువచేసే పేద రోగుల సౌకర్యార్థం ఉపయోగపడే పరికరాలను విరాళంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శంకర్‌కు అందజేశారు. అనంతరం వారిని సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ వారికి పూల బొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కూడా ఆస్పత్రికి అవసరమైన సయ సహకారాలు అందిస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్, ఆర్ఎంఓపి డా.జయ మనోహరి , ప్రొఫెసర్ అండ్ హెచ్ ఓ డి డా.సంపత్ కుమార్ సింగ్, డాక్టర్ కె వి ఎన్ దుర్గాప్రసాద్, డాక్టర్ రవిశంకర్ ప్రజాపతి, ప్రొఫెసర్ అండ్ అనస్తీసియా డాక్టర్ కే.ఉమా, డాక్టర్ వీణ, నర్సింగ్ ఆఫీసర్స్ స్వర్ణలత, పుష్పాలత, కేజియా, మాధవి, సరిత, రవి, మధు, రజిని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు అవసరం

● గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు చాలా అవసరమని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ డివిజన్‌లోని వి.వి.గిరినగర్ కమ్యూనిటీ హాల్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైస్, నివి ఫౌండేషన్ వారి సౌజన్యంతో కార్పొరేటర్ సహకారంతో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ను బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తో కలిసి పావని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు చాలా అవసరమని, అందుకు కావా ల్సిన సదుపాయాలను అందజేయడానికి తాము ఎల్లప్పు డూ ముందుంటామన్నారు. త్వరలో కుట్టుతో పాటు మగ్గం వర్క్ శిక్షణ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, డివిజన్ మహిళలకు ఎంతో తోడ్పాటును కలిగిస్తూ, మహిళా ఆర్థిక అభివృద్ధికి, స్వయం ఉపాధి శిక్షణను ఉచి తంగా ఏర్పాటు చేసిన కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధి శిక్షణ పొందుతున్న మహిళలు, శిక్షణ ఇస్తున్న టీచర్ లలిత, బీజేపీ నాయకులు విజయలక్ష్మి, సాయి కుమార్, ఆనంద్ రావు, గ్యనేశ్వర్ పాల్గొన్నారు.

'నీట్ పరీక్షా నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలి'

● విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యచరణ సమితి డిమాండ్ చేసింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం హిమాయత్ నగర్ లోని సమితి రాష్ట్ర కార్యాలయం ఎదుట నీట్ పరీక్షకు సంబంధించిన హెూర్డింగ్‌ను ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ ఆవిష్కరించారు. నీట్ పరీక్ష సమస్య పై దేశ ప్రధాని నరేంద్రమోదీ నిర్లక్ష్యపు వైఖరి ని, నీట్ విద్యార్థుల సమస్యలపై ఇప్పటి వరకు మాట్లాడని రాష్ట్ర బీజేపీ పార్లమెంట్ ఎంపీల తీరును నిరసిస్తూ యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నేడు బీజేపీ ఎంపీల ఇండ్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీ ఇండ్ల ముట్టడి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నీట్ బాధిత విద్యార్థులను సమీకరించి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పు తూ మరల పరీక్షను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా ఐక్య కార్యా చరణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్‌కు నీట్ సమస్య పరిష్కారం కోరుతూ అపాయిం ట్మెంట్ కోరనున్నామని, వారు సానుకూలంగా స్పందించి తమ ప్రతి నిధి బృందాన్ని ఆహ్వానిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మూర్తి, అశోక్ రెడ్డి, రజనీ కాంత్, పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు డి. రామకృష్ణ, మహేష్, సాయి కృష్ణ, శ్రీహరి, అనిల్, డివైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి.జావీద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఎం.శ్రీమన్, కళ్యాణ్, పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్. ప్రదీప్, బి.ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠకులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● పౌర గ్రంథాలయశాఖ ఇన్‌చార్జి సంచాలకుడు ఏవీఎన్ రాజు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పాఠకులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అందరి సహకారంతో కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర పౌర గ్రంథాలయంలకులు ఏవీఎన్ రాజు అన్నారు. ఉప సంచాలకుడి హెూదాలో ఆయన ప్రస్తుతం అఫ్జల్ గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం ముఖ్య గ్రంథ పాలకులుగా కొనసాగుతున్నారు. తెలం గాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత తొలిసారిగా మాతృశాఖ గ్రంథాలయ శాఖకు చెందిన ఏవీఎన్ రాజును ఇన్‌చార్జీ సంచాలకులుగా నియమించడంపై గ్రంథాలయ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఆయన నిజామాబాద్, ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా ఏవి ఎన్ రాజు కృతజ్ఞతలు తెలిపారు.

మూసారంబాగ్ బ్రిడ్జి పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-అంబర్‌పేట

మూసారం బాగ్ హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులతో కలిసి గురువారం పర్యవేక్షించారు. ఎనిమిది నెలల క్రితం మాజీ మంత్రి కేటీఆర్‌శంకుస్థాపన చేశారు. ట్రాఫిక్ డైవర్షన్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులతో చర్చించి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తో కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్ పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ సురేష్, డిఈ రేణుక , ఏఈ ప్రశాంత్, ప్రజలు పాల్గొన్నారు.

'ప్రభుత్వాల ప్రోత్సాహకాలు లేక 20 వేల పరిశ్రమల మూత'

ఎంఎస్ఎంఈ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డేనియల్ మండల



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు, బ్యాంకుల సహకారం లేక దాదాపు 20 వేల పరిశ్రమలు మూతపడ్డాయని ఎంఎస్ఎంఈ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డేనియల్ మండల అన్నారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల క్రితం మంజూరైన పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇప్పటి వరకు లబ్దిదారులకు విడుదల కాకపోవడం ఆవేదన కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో 70 వేల పరిశ్రమలు ఉన్నాయని, అందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాలు, బ్యాంకుల సహకారం లేక 20 వేల పరిశ్రమలు మూతపడ్డాయని తెలిపారు. సర్వీస్ సెక్టర్ వాహనాలు పరిశ్రమల శాఖ బ్యాంక్ ఈఎంఐలు వ్యాపార తదితర రంగాల వారు ఈఎంఐలు కట్టనందున బ్యాంకులు వారి ఆస్తులను జప్తు చేస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.450 కోట్లు ప్రోత్సాహకాలు విడుదల కావాల్సిన ఉందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సర్వీస్ యాక్టివిటీస్లకు ఎక్కడైతే లీజుకు అవసరమో అక్కడ ఎనిమిది సంవత్సరాల రిజిస్టర్డ్ లీజును రద్దు చేసి నోటరీ లీజుకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్ఐఐసీ సైబరాబాద్, శంషాబాద్ జోన్లలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు కేటాయించాల్సిన ప్లాట్లు, భూములను మాయం చేసిన గత ప్రభుత్వ బాధ్యులపై తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వ పాలన నుండి పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక ప్రోత్సాహకాలను త్రైమాసిక పద్ధతి ద్వారా బడ్జెట్‌లో విడతల వారీగా సీనియార్టీ ప్రకారం విడుదల చేయాలని, సీనియార్టీ విధానాన్ని పక్క తోవ పట్టించే ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ అనే దొడ్డి దారి వ్యవస్థను తక్షణమే రద్దు చేసి, కొత్త పారిశ్రామిక విప్లవాన్ని సృష్టించే విధానాన్ని పరిశ్రమల శాఖలోని అత్యంత అనుభవజ్ఞులైన టెక్నికల్ అఫీషియల్ టీంకు బాధ్యతలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు గొల్లపల్లి దయానందరావు, స్టేట్ జనరల్ సెక్రెటరీ ముప్పిడి ప్రవీణ్, ప్రశాంత్, సురేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసులో ప్రధాన నిందితుడు అరెస్ట్



నవతెలంగాణ సుల్తాన్‌బజార్

గత నెల 19న దారి దోపిడీ చేసిన ఘటనలలో ప్రధాన నిందితుడైన నాగరాజును సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. గురువారం సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుల్తాన్ బజార్ డివిజన్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారీలు వివరాలను వెల్లడించారు. గత నెల 19న మందులను కొనుగోలు చేసేందుకు టీబీ వ్యాధిగ్రస్తుడు మహమ్మద్ ఫిరోజ్ (27) వెళ్తుండడంతో రంగ మహల్ చౌరస్తాలో దారి కాచి నిజాంబాద్ కు చెందిన నాగరాజు (34) మమ్మద్ షానవాజ్, సిద్దుదంఘర్‌లతో కలిసి మహమ్మద్ ఫిరోజ్‌ను గోడకేసి బాధడంతో గాయాలపాయలైన ఫిరోజ్ కింద పడిపోయాడు అతని వద్ద ఉన్న ఒక సెల్ ఫోన్, రూ.8500 నగదును దోచుకొని పారిపోయారు. ఈ దోపిడీ కేసులో గత నెల 25న మొహమ్మద్ షానవాజ్, సిద్దుదంఘర్ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అప్పటినుండి పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు నాగరాజును గురువారం ఆంధ్ర బ్యాంకు చౌరస్తా వద్ద గుర్తించి క్రైమ్ సిబ్బంది అరెస్టు చేయడం జరిగిందన్నారు. నాగరాజు వద్ద నుంచి సెల్ ఫోన్, రూ.2500 నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నాగరాజుకు సులువుగా డబ్బు సంపాదించాలని క్రమంలో నేరాలకు అలవాటుపడ్డారని 2012 నుంచి నేర ప్రవృత్తి ఎంచుకున్నాడని తెలిపారు. అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్, మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మర్డర్ కేస్, అటెండ్ టు మర్డర్ కేసులతో పాటు పలు కేసులు నమోదయాన్ని వివరించారు. పాత నేరస్తుడు కావడం, నగరంలో ఫుట్ పాత్ పైనే నివసిస్తుండడంతో ప్రధాన నిందితుడు పట్టుకోవడంలో కాస్త ఆలస్యం అయిందని వివరించారు. దారిదోపిడి కేసును చేదించిన క్రైమ్ సిబ్బంది సందీప్ సాయిలు రవీందర్ చైతన్యలను ఆయన అభినందించారు.

నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు

● ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సునీత



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సునీత తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... దవాఖానలో అన్ని విభాగాల వైద్యులు రోగులకు సేవలు అందిస్తున్నామని సీజనల్ వ్యాధులతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. తమ ఆస్పత్రిల్లో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటల్ గైనిక్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని ఓపీ సేవలు ఉండడంతో పేద రోగులు వైద్యం చేయించుకొని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలంగాణ డయాగ్నొస్టిక్‌తో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్సరేలు, ఈసీజీ, స్కానింగ్ లు దవాఖానలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో పారిశుధ్య విభాగం సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేస్తూ పరిశుభ్రంగా ఉంచుతున్నారని ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్, కిడ్నీ రోగులకు డయాలసిస్ సెంటర్ అందుబాటులో ఉందన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పండితులకు అప్ గ్రేడేషన్ కల్పిస్తూ స్కూల్ అసిస్టెంట్స్‌గా ప్రమోషన్ కల్పించాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్

గత 20 ఏండ్లుగా అప్ గ్రేడ్ కోసం పోరాడుతున్న పండితులకు, పీఈటీలకు అప్ గ్రేడేషన్ కల్పిస్తూ ఈ ప్రభుత్వం చర్యలు తీసుకొని స్కూల్ అసిస్టెంట్స్‌గా ప్రమోషన్ కల్పించాలని ఓల్డ్ పెన్షన్ సాధన సమితి కన్వీనర్ సంతోష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్ గ్రేడేషన్ కల్పించి ప్రమోషన్ లు ఇవ్వాలని ఎన్నో కేసులను అధిగమించవలసి వచ్చిందన్నారు. ఒకటి, రెండు కేసులతో గత ఇరవై ఐదు ఏండ్ల నుండి స్కూల్ అసిస్టెంట్ నుండి జే.ఎల్. ప్రమోషన్ రాక చాలా మంది ఎదురు చూస్తున్నారన్నారు. కొంతమంది సర్వీస్‌లో ఒక్క ప్రమోషన్ లైకుండానే రిటైర్ అయిపోయారన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని తెలిపారు.

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు..




నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ దూద్ బౌలి శ్రీ సిద్ధిబుద్ధి సమేత గణపతి స్వామి, శ్రీ సీతారామ వీరాంజనేయ స్వామి17 వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వంశపార్యం పర్య ధర్మ కర్త శ్రీ మహేశ్వరం శ్రీనివాస చారి ఆధ్వర్యంలో జరిగిన ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ ప్రధాన అర్చకులు వీరయ్య శర్మ, ధార్మిక సలహాదారులు చెల్లా మల్లికార్జున శర్మ చే మంట పారాధన నిత్య హెూమం యాగశాల బలిహరణ మహా పూర్ణాహుతి పల్లకి ఊరేగింపు సేవ తదిత కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మజ్లీస్ పార్టీ పురానాపూల్ కార్పొరేటర్ సున్నం రాజమోహన్‌తోపాటు ఆయా దేవాలయాల ప్రతినిధులు అభిషేకరాజ్ సక్సేన ఆంజనేయులు ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని సాదరం గా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు జ్ఞానేశ్వర చారి, వెంకటాచల ముదిరాజ్, వలబోజు శ్రీనివాస చారి, శశిర జైస్వాల్, జుగ్రాజ్ ప్రసాద్ లతో పాటు ఆలయ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళల కోసం పింకీ ప్రామిస్

మహిళల లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణలో భారతదేశం ఎంతగా వెనకబడి ఉందో దివ్య బాలాజీ కమెర్కర్‌కు ఆమె అనుభవాలు అర్థమయ్యేలా చేశాయి. అన్ని రంగాల్లో సాంకేతికత దూసుకుపోతున్నా మహిళల ఆరోగ్యానికి అది అంతగా ఉపయోగపడకపోవడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారు. ఆ లోటును భర్తీ చేసేందుకు రెండేండ్లు తీవ్ర అధ్యయనం చేసి పింకీ ప్రామిస్ అనే డిజిటల్-ఫస్ట్ కేర్ ప్లాట్‌ఫారమ్ ప్రారంభించారు. అసలు దాని సంగతేంటో, అది ఎలా పని చేస్తుందో మనమూ తెలుసుకుందాం...





కోవిడ్ -19 మహమ్మారి ప్రపంచాన్ని తాకినప్పుడు దివ్య గర్భవతి. అలాగే వార్టన్ స్కూల్‌లో ఎంబీఏ చదువుతోంది. ప్రసవం కోసం భారతదేశానికి తిరిగి రావాలని నిర్ణయించుకుంది. 'ఇక్కడికి వచ్చిన తర్వాత నాలో కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపించాయి. కరోనా కారణంలో ఆన్‌లైన్‌లో గైనకాలజిస్ట్‌ని సంప్రదించాను. నాకొచ్చిన సమస్య తెలుసుకోడానికి రెండు వారాలు పట్టింది. సరైన పద్ధతిలో వైద్యం జరిగి ఉంటే నా సమస్య గురించి వారంలోపే తెలుసుకోగలిగేవాళ్లం' అంటూ దివ్య గుర్తు చేసుకున్నారు.

క్లిష్టమైన అంతరం

తన అనుభవంతో భారతదేశ ఆరోగ్య సంరక్షణలో ఓ క్లిష్టమైన అంతరాన్ని ఆమె అర్థం చేసుకున్నారు. మహిళల లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంపై దృష్టి సారించిన అనేక ఆరోగ్య సంస్థలు ఉన్నప్పటికీ డీప్‌టెక్, ఏఐ (ఆర్టిఫిషన్ ఇంటిలిజన్స్)ను పెద్దగా ఉపయోగించడంలేదని ఆమె గ్రహించారు. 'ఆ లోటును భర్తీ చేయడానికే భారతదేశంలో మొదటి AI/ML-ఆధారిత క్లినిక్‌గా పింకీ ప్రామిస్‌ను ప్రారంభించాను. ఇది మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించబడి సమగ్ర, కచ్చితమైన వైద్య సహాయాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది' అని ఆమె పంచుకున్నారు.

వైవిధ్యమైన అనుభవాలు

దివ్య యేల్ యూనివర్శిటీ నుండి ఎకాలజీలో డిగ్రీని పూర్తి చేశారు. తర్వాత హెచ్ఐవీ నుండి మహిళలకు రక్షణ కల్పించే యాక్సెస్ కోసం టాంజానియాకు వెళ్లారు. అక్కడి నుండి వచ్చి బీహార్‌లో పోషకాహార లోపాలను మెరుగుపరిచే ప్రాజెక్ట్‌లో పని చేయడం మొదలుపెట్టారు. ఢిల్లీలో మహిళలపై జరుగుతున్న హింసను తగ్గించేందుకు ఢిల్లీ కమీషన్ ఫర్ ఉమెన్ కోసం కూడా ఆమె పనిచేశారు. 'నిర్భయ ఘటన నా ఇంటికి కొద్ది దూరంలో జరిగింది. అప్పటి నిరసనల్లో పాల్గొన్నాను. జస్టిస్ వర్మ కమిషన్ ఢిల్లీ సూచనలను రూపొందించడంలో సహాయపడ్డాను' అని ఆమె చెప్పారు. యేల్‌లోని ఆమె సహవిద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో ఉండగా ఆమె మాత్రం ఎన్జీఓలతో పని చేస్తూ నెలకు రూ. 30,000 జీతం తీసుకునేవారు. ఆమె బ్రిడ్జ్‌స్పాన్ గ్రూప్ కోసం సోషల్ ఇంపాక్ట్ కన్సల్టింగ్‌లో పనిచేసేటపుడు భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ గురించి చాలా నేర్చుకున్నారు.

డిజిటల్-ఫస్ట్ కేర్ ప్లాట్‌ఫారమ్

పింకీ ప్రామిస్ ఆలోచన వేళ్లూనుకున్నప్పుడు దివ్య దేశవ్యాప్తంగా వేలాది మంది మహిళలతో మాట్లాడి లోతుగా అధ్యయనం చేశాడు. 2022లో స్త్రీ జననేంద్రియ సమస్యను ఎదుర్కొన్నప్పుడు వారు ఏమి చేశారో అర్థం చేసుకోవడానికి 300 కంటే ఎక్కువ మంది మహిళలను పోల్ చేశారు. ఫలితాలు ఆమె కండ్లు తెరిపించాయి. '70% కంటే ఎక్కువ మంది స్త్రీలు వైద్యుల వద్దకు వెళ్లాలని తెలిసినప్పటికీ వెళ్లకుండా తప్పించుకున్నారు. 73% మంది తమ సమస్యల గురించి ఎవరితోనూ పంచుకోకుండా వాటి లక్షణాల గురించి రహస్యంగా ఆన్‌లైన్‌లో సర్చ్ చేశారు. మహిళలకు డిజిటల్-ఫస్ట్ కేర్ ప్లాట్‌ఫారమ్ అవసరం ఎంత ఉందో ఈ పోల్ మాకు చెప్పింది' ఆమె వివరించారు.

ఆకట్టుకునే వృద్ధి

పింకీ ప్రామిస్ దాదాపు 80,000పైగా యాప్ డౌన్‌లోడ్‌లను కలిగి ఉంది. 10,000 కంటే ఎక్కువ మంది కస్టమర్‌లకు సేవలు అందించింది. ప్రారంభమైన కొత్తలో దివ్య దీన్ని తన సొంత నిధులతో నడిపారు. తర్వాత గ్రాంట్లు, అవార్డులు అందుకుంటున్నారు. 'ములాగో ఫౌండేషన్ మాకు 100,000 డాలర్లు ప్రదానం చేసింది. ఖురాxన మరో 100,000 డాలర్లు ఇచ్చింది. వీరితో పాటు మాకు మద్దతు ఇచ్చిన వారిలో స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు' అని దివ్య చెప్పారు. రాబోయే 12 నెలల్లో పింకీ ప్రామిస్ నంబర్ వన్ మహిళా ఆరోగ్య బ్రాండ్‌గా నిరూపించుకోవాలని ఆమె ఆకాంక్షిస్తున్నారు.

ఎలా పని చేస్తుందంటే..?

పింకీ ప్రామిస్ అనేది ఒక ఫోకస్డ్ స్ట్రాటజీపై రూపొందించబడింది. అధునాతన AI/ML టెక్నాలజీని ఉపయోగించుకోవడం, మహిళల ఆరోగ్య డేటాపై ప్రత్యేకంగా శిక్షణ పొందడం, వేగవంతమైన, కచ్చితమైన ఆరోగ్య సంరక్షణను అందించడం దీని కర్తవ్యం. యాప్‌లోకి ప్రవేశించిన తర్వాత మీరు వెంటనే గైనకాలజిస్ట్‌ని కనెక్ట్ చేయవచ్చు. అదే సమయంలో చాట్‌బాట్ మిమ్మల్ని ప్రశ్నలు అడుగుతుంది. వాటిని డాక్టర్ వారి యాప్‌లో పరిశీలిస్తారు. ప్రశ్నలు కూడా మునుపటి ప్రతిస్పందనల ఆధారంగా అనుకూలీకరించబడ్డాయి. వైద్యులు రోగిని అదనపు ప్రశ్నలు అడగవచ్చు. చాట్‌బాట్ 250కి పైగా టాప్ మెడికల్ ప్రోటోకాల్‌లపై కస్టమ్-ట్రైన్ చేయబడింది. వైద్య నిపుణులచే పరిశీలించబడింది. అందుకున్న డేటా ఆధారంగా నిరంతరం నవీకరించబడుతుంది. బోట్ ప్రశ్నలు, సమాధానాల ఆధారంగా మందులను కూడా సూచిస్తుంది. దానిని రోగితో పంచుకునే ముందు డాక్టర్ చూస్తారు.



హెల్త్‌టెక్‌పై దృష్టి సారించి

యాప్‌లో ఒక మహిళ 97% పునరుత్పత్తి ఆరోగ్య సమస్యల కోసం తక్షణమే సంప్రదించవచ్చు. ప్లాట్‌ఫారమ్ రూ. 99కి ఇన్‌స్టంట్ చాట్ కన్సల్టేషన్‌లను, రూ. 199కి వాయిస్ కన్సల్టేషన్‌లను, రూ.99-2,400 నుండి కేర్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. దివ్య రెండు ఏండ్ల పాటు శ్రమించి తన ఇంటి నుండి పింకీ ప్రామిస్‌ను నిర్మించారు. 2023లో ఆమె భర్త స్నేహితురాలు ఆకాంక్ష వ్యాస్ ఆమెతో చేరింది. హెల్త్‌టెక్‌పై దృష్టి సారించి-రూక్మీ ఉత్పత్తులను నిర్మించడంలో ఆకాంక్షకు 12 ఏండ్ల అనుభవం ఉంది. టైర్ I, టైర్ II నగరాల్లో 18-34 ఏండ్ల మధ్య వయసున్న మహిళలే పింకీ ప్రామిస్ లక్ష్యంగా పెట్టుకున్న ప్రేక్షకులు. 'మా కస్టమర్‌లలో సుమారు 70% మంది టైర్ 2, దేశంలోని చిన్న ప్రాంతాల నుండి వచ్చారు. 60% కంటే ఎక్కువ మంది ఇంతకు ముందెప్పుడూ గైనకాలజిస్ట్‌ని సంప్రదించలేదు. పింకీ ప్రామిస్‌పై మొదటిసారి సంప్రదిస్తున్నారు' అని దివ్య పంచుకున్నారు. ■

చింత చిగురుతో...



చింత చిగురుతో ఎన్నో లాభాలున్నాయి. రుచికరమైన ఆహారంగానే కాక దీన్ని తినడం వల్ల ఆరోగ్యం కూడా చేకూరుతుంది. మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. పైల్స్ ఉన్న వారికి కూడా బాగానే పనిచేస్తుంది. ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచిది పెంచుతుంది. చింత చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్‌ఫ్లేమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. మసాలా పదార్థాలు తినడం వల్ల నోటిలో వచ్చే పగుళ్లు, పూతలను తగ్గిస్తుంది. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. దీనితో చేసిన వంటలను చిన్నారులకు తినిపిస్తే కడుపులో నులి పురుగుల సమస్య తగ్గుతుంది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇందువల్ల ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్ఠం చేస్తుంది. దీనిలో యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్ గుణాలున్నాయి. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసే ఔషధ గుణాలున్నాయి. థైరాయిడ్ సమస్యలు తగ్గుతాయి. రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి ఇది మేలు చేస్తుంది. ■

ప్రజాప్రస్థానం ఆగలేదు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీని వీడినంత మాత్రాన వచ్చిన నష్టమేమీ లేదనీ, కొత్త నాయకులు తయారవుతారని చెప్పారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని పలుకరిస్తూ వారితో కేసీఆర్ ఫొటోలు దిగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, కందాల ఉపేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జహంగీర్, దుండిగల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఓమ్నీ వ్యాన్ నడిపిన మాజీ సీఎం కేసీఆర్



నవతెలంగాణ- మర్కుక్

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో ఓమ్నీ వ్యాన్ నడుపుతూ పరిసర గ్రామాలను గురువారం సందర్శించారు. కాలు ఆపరేషన్ తర్వాత మొదటిసారి వ్యాన్ నడిపారు. కాగా, గతేడాది డిసెంబర్ 8వ తేదీ అర్ధరాత్రి కేసీఆర్ కాలు జారిపడటంతో తుంటి ఎముక దెబ్బతినడంతో హైదరాబాద్ సోమాజిగూడలోని యశోదా ఆస్పత్రిలో తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఆపరేషన్ నుంచి కోలుకున్నప్పటి నుంచి కేసీఆర్ కర్ర సహాయంతోనే నడుస్తున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు మ్యానువల్ కారు నడిపి చూడమని సూచించడంతో.. తన పాత ఓమ్నీ వ్యాన్‌ను కేసీఆర్ నడిపారు. రోడ్లపై కనబడిన వారిని పలుకరిస్తూ తన వాహనాన్ని ముందుకు పోనిచ్చారు. కాగా, కేసీఆర్.. తన వ్యవసాయ క్షేత్రంలో రెండు రోజులుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయనతో పాటు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజి రెడ్డి ఉన్నారు.

నిరుద్యోగులకిచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగులకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలనీ, లేదంటే వారే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. నిరుద్యోగ అభ్యర్థులు గురువారం హైదరాబాద్‌లో కేటీఆర్ ను కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం లేదనీ, తమ పోరాటానికి అండగా నిలవాలని కేటీఆర్‌ను కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ హామీలు నిలబెట్టుకోకపోతే నిరుద్యోగులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్లెక్కి పోరాటం చేస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 10 పరీక్షలకు సంబంధించి నోటిఫికేషన్లను ఎన్నికలకు ముందు తేదీలతో సహా ప్రకటించిన కాంగ్రెస్ ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదని విమర్శించారు. గ్రూప్ 2లో రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3లో మూడు వేల ఉద్యోగాలు, మొదటి క్యాబినెట్‌లో మెగా డియస్సీ అంటూ హామీ ఇచ్చి విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేటశారు.గ్రూప్ 1 మెయిన్స్‌లో ఒక పోస్టుకు వంద మంది అభ్యర్థులను ఎంపిక చేయాలని గతంలో డిమాండ్ చేసిన ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇప్పుడెందుకు ఎంపిక చేయడం లేదని ప్రశ్నించారు. టెట్, గ్రూప్ 1 ప్రిలిమ్స్, డియస్సీ, గ్రూప్ 2, గ్రూప్ 1 మెయిన్స్, గ్రూప్ 3 పరీక్షలు వెంట వెంటనే ఉన్నాయనీ, చాలా మంది విద్యార్థుల రాస్తున్న దృష్ట్యా పరీక్షకు, పరీక్షకు మధ్య సరిపడేంత సమయమివ్వాలని ఆయన సూచించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలనీ, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బొలీవియాలో సైనిక కుట్రకు విఫలయత్నం!

లాపాజ్ : దేశంలో సైనిక కుట్రను భగ్నం చేశామని బొలీవియా అధ్యక్షుడు లూయిస్ ఆరెస్ బుధవారం ప్రకటించారు. దేశ ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. బుధవారం మధ్యాహ్నం లాపాజ్‌లో సైనిక జనరల్ జువాన్ జునిగా ఆదేశాల మేరకు వందలాదిమంది మిలటరీ సిబ్బంది ప్రభుత్వ భవనాన్ని చుట్టుముట్టారు. మంత్రిత్వస్థాయి సమావేశం జరగడానికి ముందుగా, వారు భవనం ప్రధాన ద్వారాన్ని ట్యాంక్‌లతో బద్దలు కొట్టి, లోపలకు బలవంతగా ప్రవేశించడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నాన్ని ప్రభుత్వం భగ్నం చేసింది. సైనిక సిబ్బందిని జైలుకు తరలిస్తామని జునిగా ప్రకటించారు. 2019లో అప్పటి అధ్యక్షుడు ఎవో మొరేల్స్‌కు వ్యతిరేకంగా పన్నిన కుట్రలో ప్రమేయం వున్న, రాజకీయ ఖైదీలు జెనిన్ అనెజ్, లూయిస్ ఫెర్నాండోలను విడుదల చేస్తామని ప్రకటించారు. సైన్యం భవనం లోపలకు చొచ్చుకుపోవడానికి ప్రయత్నిస్తుండగానే వందలాదిమంది ప్రజలు వెంటనే గుమిగూడారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, సాధారణ పౌరులు అందరూ కలిసి నిరసనలు తెలియజేశారు. వారిపై సైనికాధికారులు అణచివేత చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు విచక్షణారహితంగా బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ప్లాజా మురిల్లోకు వెళ్లే దారిని మూసివేశారు.

ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు ఎవో మొరేల్స్ అప్రమత్తమయ్యారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఏకతాటిపైకి రావాల్సిందిగా బొలీవియా ప్రజలకు పిలుపునిచ్చారు. బొలీవియా విదేశాంగ మంత్రి సెలిండా సోసా వీడియో సందేశమిస్తూ, ప్రజాస్వామ్యం, శాంతి, భద్రతలపై దాడి చేసేందుకు బొలీవియా సైన్యంలోని కొన్ని విభాగాలను అక్రమంగా సమీకరించిన కొన్ని దేశాల చర్యలను తీవ్రంగా నిరసించారు. ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని, దేశ ప్రజలను కోరారు.

20లక్షల మందికి పైగా కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న బొలీవియా వర్కర్స్ సెంట్రల్ (సిఓబి) వెంటనే నిరవధిక సమ్మెను ప్రకటించింది. రాజ్యాంగ వ్యవస్థను పునరుద్ధరించాలని, బొలీవియాలో చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం వుండాలని డిమాండ్ చేసింది. భవనాన్ని సైన్యం చుట్టుముట్టిన దాదాపు గంట తర్వాత అధ్యక్షుడు లూయిస్ అరెస్ కొత్త మిలటరీ కమాండర్‌గా జునిగా స్థానంలో జోస్ సాంచెజ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే బాధ్యతలు తీసుకున్న సాంచెజ్ సైన్యాన్ని వారి వారి యూనిట్లకు వెళ్లిపోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన లూయిస్ అరెస్ ప్రభుత్వానికి మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

బొలీవియా సామర్థ్యంపై నమ్మకముంది : చైనా

కుట్రకు విఫలయత్నం జరిగిన నేపథ్యంలో దేశంలో రాజకీయ పరిస్థితులను చక్కగా దిద్దుకొనగల సామర్థ్యం అధ్యక్షుడు లూయిస్ అరెస్‌కు వుందని చైనా విశ్వసిస్తోందని గురువారం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ చెప్పారు. బొలీవియాలో అసాధారణ సైనిక చర్య వార్తలను బీజింగ్ పరిశీలిస్తోందని చెప్పారు. బొలీవియాకు మంచి మిత్రదేశంగా, భాగస్వామిగా ఈ పరిస్థితులను నుండి బొలీవియా బయటపడగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు. బొలీవియా ప్రజల ప్రాథమిక, దీర్ఘకాల ప్రయోజనాలకు అనుగుణంగానే ప్రభుత్వం సామర్థ్యం వుంటుందని తెలిపారు.

పేపర్ లీకుల నుంచి నేర్వని పాఠాలు

(మొదటిపేజీ తరువాయి)

పరిచయాలే ఉన్నాయి. భారత ప్రధాని మోడీతో సహా పలువురు బీజేపీ ప్రముఖ నాయకులు నిర్వహించే సభలు, కార్యక్రమాలకు వారు హాజరవుతుంటారు. దేశ్యాప్తంగా, ఇప్పటికే చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాయి. వాస్తవానికి, సురేష్‌చంద్ర కుమారుడు, ఎడ్యుటెస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ ఆర్య 2017లో జైలు పాలయ్యాడు. అయినప్పటికీ, ప్రధాని నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ, అనేక రాష్ట్రాల బీజేపీ ప్రభుత్వాలు ఈ కంపెనీకి పరీక్షల నిర్వహణ కోసం కాంట్రాక్టులను మంజూరు చేస్తూనే ఉండటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. కాగా, సదరు హిందీ వార్త సంస్థ గతంలో ఈ కంపెనీకి సంబంధించిన అనేక పరీక్షల స్కామ్‌లపై నివేదించింది. గుజరాత్‌లో ప్రభుత్వ రిక్రూట్‌మెంట్‌లలో జరుగుతున్న స్కామ్‌లు, బీజేపీ నేతల ప్రమేయం పైనా దర్యాప్తు జరిపింది.

యూపీ కానిస్టేబుల్ నియామక పరీక్ష

జూన్ 20న యూపీ ప్రభుత్వం ఎడ్యుటెస్ట్‌ను బ్లాక్ లిస్ట్ చేసింది. ఫిబ్రవరి 17, 18 తేదీల్లో 63,244 కానిస్టేబుల్ పోస్టులకు రిక్రూట్‌మెంట్ కోసం పరీక్షను నిర్వహించే బాధ్యత కంపెనీకి ఇచ్చింది. 43 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, ఈ పరీక్ష పేపర్ లీకైంది. దేశం నలుమూలల నుంచి అభ్యర్థులు రాష్ట్ర రాజధాని లక్నోకు చేరుకుని రెండ్రోజుల పాటు నిరసనలు తెలిపారు. చివరకు, యోగి సర్కారు సదరు పోటీ పరీక్షను రద్దు చేయవలసి వచ్చింది. ఈ కేసును విచారిస్తున్న స్పెషల్ టాస్క్ ఫోర్స్.. వినీత్‌కు అనేకసార్లు నోటీసులు పంపింది. అయినప్పటికీ, ఆయన విచారణాధికారుల ముందు హాజరుకాకపోవటం గమనార్హం. నివేదికల ప్రకారం.. ఎస్టీఎఫ్ ఏర్పాటు తర్వాత వినీత్ అమెరికాకు పారిపోయాడు. అహ్మదాబాద్‌లోని కంపెనీ వేర్‌హౌస్ నుంచి పేపర్ లీక్ జరిగిందని ఎస్టీఎఫ్ తెలిపింది. గుజరాత్‌కు చెందిన ఈ కంపెనీ వివాదంలో చిక్కుకోవటం ఇదే మొదటిసారి కాదు. పేపర్ లీకేజీలు, తీవ్ర అవకతవకల కారణంగా గతంలో కూడా ఈ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. అయినప్పటికీ పరీక్షా పత్రాలను ముద్రించటం, పరీక్షలు నిర్వహించటం వంటి ఒప్పందాలను సదరు కంపెనీ పొందుతూనే ఉండటం గమనార్హం.

గతేడాది బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన బీహార్

అక్టోబర్ 20, 2023న, బీహార్ స్కూల్ ఎగ్జామినేషన్ బోర్డ్ (పాట్నా) ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ఎడ్యుటెస్ట్ సొల్యూషన్స్‌కి ఒక లేఖ రాశారు. "తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి", "వ్యక్తిగత ప్రవర్తన" కారణంగా కమిటీ తన ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్‌లో ఉంచుతున్నదని కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్‌కు తెలియజేసింది. బీహార్ స్కూల్ ఎగ్జామినేషన్‌కు సంబంధించిన పని నుంచి మూడేండ్ల పాటు నిషేధించింది.

సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నుండి ఒప్పందం

నిషేధానికి ఒక రోజు ముందు.. అంటే అక్టోబర్ 19న సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల కోసం రిక్రూట్‌మెంట్ పరీక్షను నిర్వహించటానికి ఎడ్యుటెస్ట్‌కు 80,004,000 రూపాయల ఒప్పందాన్ని కుదుర్చుకోవటం గమనార్హం.

సీఎస్ఐఆర్ టెండర్

గతేడాది డిసెంబర్ 8న అంటే బీహార్ నిషేధం విధించిన ఒకటిన్నర నెలల తర్వాత సీఎస్ఐఆర్ ఈ పోస్టులకు రిక్రూట్‌మెంట్ కోసం దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించింది. సీఎస్ఐఆర్ చైర్మన్ స్వయంగా ప్రధాని మోడీనే కావటం గమనార్హం. మొత్తం 444 పోస్టుల్లో 76 పోస్టులు ఎస్ఓ, మిగిలినవి 368 పోస్టులు ఏఎస్ఓ పోస్టులు. దేశంలోని వివిధ కేంద్రాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష జరిగింది. పరీక్ష సమయంలోనే, అభ్యర్థులు పెద్ద ఎత్తున రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. అయితే, పరీక్షలో ఎలాంటి రిగ్గింగ్ జరగలేదని సీఎస్ఐఆర్ కొట్టిపారేయడం గమనార్హం.

కాగా, ఎడ్యుటెస్ట్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ 1981 నుంచి వివిధ రకాల పరీక్షలను నిర్వహిస్తున్నదని పేర్కొన్నది. ఎడ్యుటెస్ట్ వెబ్‌సైట్ ప్రకారం.. ఇది గత 40 సంవత్సరాలలో 113 కోట్ల పరీక్షలను నిర్వహించింది. అవన్నీ తప్పులు లేకుండా ఉన్నాయని వెల్లడి కావటం గమనార్హం. ఈ కంపెనీ యూపీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ కమిషన్, గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ, భారత్ ఎలక్ట్రానిక్స్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, హర్యానా ఎస్-ఎస్‌సీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (తిరుచిరాపల్లి), పవర్ సిస్టమ్ ఆపరేషన్, రాజస్థాన్ సెంట్రల్ యూనివర్శిటీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్ వంటి ప్రతిష్టాత్మక ప్రభుత్వ సంస్థల కోసం పని చేసింది. అలాగే, యూనివర్శిటీ ఆఫ్ పూణే, ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రీ (రాంచీ), మెహసానా డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వంటివి కూడా ఇందులో ఉన్నాయి. కాగా, ఎడ్యుటెస్ట్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌ను ఇంతకుముందు కాన్సెక్ ప్రయివేట్ లిమిటెడ్ అని పిలిచేవారు. కానీ పేపర్ లీక్ కేసుల్లో దాని ప్రమేయం బయటపడటంతో దాని పేరు మార్చుకోవటం గమనార్హం.

బీడు భూములకు గోదావరి జలాలు

(మొదటిపేజీ తరువాయి)

వైరా ప్రాజెక్టు కూడా నీళ్లు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. బిజీ కొత్తూరు పంప్ హౌస్ వద్ద 6 మోటర్లను ఏర్పాటు చేశామని, వీటి ద్వారా దిగువకు 9వేల క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేయనున్నట్టు తెలిపారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలంలోని పూసుగూడెం, కమలాపురం గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన ఫేజ్ టు, ఫేజ్ త్రీ పంప్ హౌస్‌ల వద్ద అమర్చిన విద్యుత్ మోటార్లు కూడా త్వరలోనే ట్రయల్ రన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాలవంచ సీతారామ ప్రాజెక్టు ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించనున్నట్టు తెలిపారు. మిగిలిపోయిన ఈ ప్రాజెక్టు పనులను జులై చివరినాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రయల్ రన్ సక్సెస్‌తో మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. వారం రోజుల నుంచి విశేషంగా కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీపీ ముత్తినేని సుజాత, నీటిపారుదల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, మాజీ సర్పంచి మద్రి మల్లారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య పాల్గొన్నారు.


జియో రీచార్జీ బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

వినియోగదారులకు షాక్ ఇచ్చింది. జియో కొత్తగా 19 ప్లాన్లు ప్రకటించింది. వాటిలో 17 ప్రీపెయిడ్ ప్లాన్లు కాగా, రెండు పోస్ట్ పెయిడ్ ప్లాన్లు ఉన్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రీపెయిడ్ ప్లాన్లపై సరాసరి 12.5 శాతం నుంచి గరిష్టంగా 25 శాతం వరకు ధరలు పెంచేసింది. ఫీచర్ ఫోన్లలో ఎక్కువగా ఉపయోగించే ప్రాథమిక ప్లాన్ 28 రోజులకు గాను రూ.155 చెల్లించాల్సి ఉండగా.. ఈ ప్లాన్ ధరను ఇప్పుడు రూ.189కి పెంచేసింది. ప్రతీ రోజు 1 జీబీతో 28 రోజుల కాలపరిమితి కలిగిన ప్లాన్ వ్యయాన్ని రూ.209 నుంచి రూ.249కు పెంచింది. ప్రస్తుతం 239 ప్లాన్‌ను రూ.299కు చేర్చింది. రెండు నెలల గడువు ప్లాన్‌ను రూ.479ని రూ.579కి పెంచింది. వీటితోపాటు కొత్తగా రిలయన్స్ జియో పలు సర్వీసులు ప్రారంభించింది. జియో సేఫ్, జియో ట్రాన్స్ లేట్. క్వాంటం సెక్యూర్ కమ్యూనికేసన్ ఆఫ్ పర్ కాలింగ్, మెసేజింగ్, ఫైల్ ట్రాన్స్ ఫర్ తదితరాల కోసం రూ.199 చెల్లించాలి. కొత్త టారిఫ్ ప్లాన్లు జూలై మూడో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. జియో రీచార్జీ ప్లాన్ల ధరల పెంపునతో వినియోగదారులపై అదనపు భారం పడటంతో వారు ఆందోళన వ్యక్తం అవుతోంది.

నిబంధనలు పాటించని ప్రయివేటు ఆస్పత్రుల లైసెన్స్ రద్దు

డీఎంహెచ్‌ఓలతో మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రయివేటు ఆస్పత్రుల లైసెన్సులు రద్దు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన అన్ని జిల్లాల వైద్యారోగ్య అధికారుల (డీఎంహెచ్‌ఓ)తో సమావేశమయ్యారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. జిల్లాల వారిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలు బాధ్యత డీఎంహెచ్‌ఓలదేనని స్పష్టం చేశారు. ప్రజారోగ్యాన్ని బలోపేతం చేస్తున్నామనీ, జవాబుదారీతనంగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యారోగ్య సేవా కార్యక్రమాలను ఎలా సమన్వయం చేయాలనే దానిపై మంత్రి వారికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు వైద్య సేవలు ప్రజలకు అందించడంలో డీఎంహెచ్‌ఓలదే గురుతర బాధ్యత అని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లా, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మధ్య భౌగోళికంగా కనెక్టివిటీపై దృష్టి సారించాలని సూచించారు.

పంట రుణాల పేర..
రైతుల ఖాతాలు హోల్డ్

చేతికందని పింఛన్, పీఎం కిసాన్, జొన్నల డబ్బులు

ఖాతాల్ని హోల్డ్ చేయొద్దని లీడ్ బ్యాంక్ ఆదేశాలు
పలు బ్యాంకర్ల బేఖాతర్..
టార్గెట్ కోసం అప్పులు చెల్లించాలని రైతులపై ఒత్తిడి



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'నా పేరు నర్సింహారెడ్డి. మాది వట్‌పల్లి మండలం గొర్రెకల్. మంజీరా వికాస బ్యాంకులో రూ.2 లక్షల పంట రుణం ఉంది. ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడంతో అప్పు కట్టలేదు. అందుకని నా ఖాతాను హోల్డ్‌లో పెట్టారు. నాకు ప్రభుత్వం నుంచి నెల నెలా వచ్చే పింఛన్ డబ్బులు నా ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ నెల 18న పీఎం కిసాన్ డబ్బులు రూ.2 వేలు పడ్డాయి. యాసంగిలో పండించిన 30 క్వింటాళ్ల జొన్నల్ని మార్క్‌ఫెడ్ సంస్థకు విక్రయించాను. క్వింటాల్‌కు రూ.3180 చొప్పున ఖాతాలో రూ.95400 జమయయ్యాయి. ఇలా నా ఖాతాలో డబ్బులు జమ అవ్వడం తప్ప వాటిని విత్‌డ్రా చేసుకునే పరిస్థితి లేదు. నా డబ్బులు నేను వాడుకునే వీల్లేదు. ఎన్నిసార్లు బ్యాంకు చుట్టూ తిరిగినా పట్టించుకోవట్లేదు. అవసరాలకు డబ్బుల్లేక తిప్పలు పడుతున్నం'

'నా పేరు నిర్మలబాయి. మాది వట్‌పల్లి మండలంలోని లక్యానాయక్ తండా. వట్‌పల్లి మంజీరా వికాస బ్యాంకులో ఖాతా ఉంది. పొలం మీద పంట రుణం తెచ్చుకున్నాం. మాఫీ చేస్తరని చెప్పడంతో కట్టలేదు. అదే బ్యాంక్‌లో బంగారం మీద రూ.2 లక్షల అప్పు తెచ్చుకున్నం. అప్పుకు వడ్డీ కట్టేందుకు బ్యాంకు వెళ్లిన. పంట అప్పు చెల్లిస్తేనే బంగారం అప్పుకు వడ్డీ కట్టుకుంట అని మేనేజర్ చెబుతుండు. పంట రుణం మాఫీ అవుతదని కట్టలేదు. ఖాతాను హోల్డ్‌లో పెట్టడం వల్ల బంగారం లోన్‌పై వడ్డీ భారం పడుతుంది'

ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టిన సమస్య వీరిద్దరిదే కాదు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొన్ని బ్యాంకుల్లోని రైతుల పరిస్థితి ఇది. ఖాతాలు హోల్డ్‌లో పెట్టొద్దని పై నుంచి ఆదేశాలున్నా పలుచోట్ల కిందిస్థాయి బ్యాంకర్లు టార్గెట్ కోసం పంటరుణాలు చెల్లించాలంటూ రైతులను ఒత్తిడి చేస్తున్నారు. దీనిపై మరోసారి బ్యాంకర్లకు ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు కోరుతున్నాయి.

వట్‌పల్లి మండలంలో 700 ఖాతాలు హోల్డ్

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని మంజీరా వికాస బ్యాంకు, ఎస్‌బీఐ, గ్రామీణ వికాస బ్యాంకులున్నాయి. వట్‌పల్లిలోని మంజీరా బ్యాంకులో 9 గ్రామాలకు చెందిన రెండు వేల ఖాతాలుండగా 1200 మందికిపైగానే రైతులు పంట రుణాలు పొందారు. వీరిలో కొందరు అప్పు చెల్లించడం, వడ్డీ కట్టి రెన్యూవల్ చేసుకుంటున్నారు. ప్రభుత్వమే అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పడంతో చాలా మంది రైతులు పంట రుణాలు కట్టలేదు. బ్యాంక్ మేనేజర్.. అప్పులు వసూలు చేయడం కోసం 700 మంది రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టి తిప్పలు పెడుతున్నట్టు తెలిసింది. రైతుల్లో చేయూత ఫించన్‌దారులున్నారు. వీరికి నెలకు రూ.2016 బ్యాంక్ ఖాతాలో పడుతున్నాయి. జొన్నలు అమ్మిన పైసలు, పీఎం కిసాన్ డబ్బులు కూడా విత్‌డ్రా చేసే వీల్లేదు. రైతులు బ్యాంకుకు వెళ్లి అడిగితే మేనేజర్ అదంతే.. అప్పు కట్టాల్సిందే అంటూ బెదిరిస్తున్నట్టు సమాచారం. రైతులంతా మండల వ్యవసాయ అధికారి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఏఓ బ్యాంకుకు వెళ్లి లీడ్ బ్యాంక్ సర్క్యులర్ చూపినా పట్టించుకోవట్లేదు. మండలంలోని ఎస్‌బీఐ, గ్రామీణ వికాస బ్యాంకు సైతం ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టి ఇబ్బంది పెడుతున్నారని రైతులు చెబుతున్నారు.

పింఛన్, పీఎం కిసాన్, జొన్నల డబ్బులకు బ్రేక్

రైతులకు ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మరో పక్క బ్యాంకర్లు మాత్రం రైతుల ముక్కుపిండి అప్పులు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ బ్యాంకర్లు పంట రుణాల వసూళ్ల పేరిట రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టడం గమనార్హం. ఖాతాలో డబ్బులు జమ కావడం తప్ప విత్‌డ్రా చేసేందుకు వీల్లేదు. అయితే రైతుల్లో కొంత మందికి పింఛన్ , పీఎం కిసాన్, పంట డబ్బులు వారి ఖాతాల్లో పడుతున్నా వాటిని తీసుకోలేకపోతున్నారు. చాలా మందికి అవి కూడా నిలిచిపోయాయి. తమకు డబ్బులివ్వాల్సిన వాళ్ల ఖాతాలో వేస్తే కూడా ఆగిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట, కొండాపూర్, కంది, సంగారెడ్డి, పుల్కల్, వట్‌పల్లి, రాయికోడ్, మనూరు, కంగ్టి, మునిపల్లి, కోహీర్, జహీరాబాద్, నారాయణఖేడ్ వంటి మండలాల్లో రైతుల ఖాతాలు చాలా వరకు హోల్డ్‌లో పడ్డాయి. యాసంగి సీజన్‌లో పండిన జొన్నల్ని మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా జిల్లాలో 19 కొనుగోలు కేంద్రాలు పెట్టి 2.18 లక్షల క్వింటాళ్ల జొన్నల్ని కొనుగోలు చేశారు. రూ.69.37 కోట్ల విలువ చేసే జొన్నల్ని కొన్న మార్క్‌ఫెడ్ సంస్థ ఇప్పటికే రూ.40 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టడం వల్ల జొన్నల డబ్బులు సైతం చేతికందలేదని తెలిసింది.

ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టొద్దని లీడ్ బ్యాంక్ ఆదేశాలు

పంట రుణాల్ని సకాలంలో చెల్లించని రైతుల ఖాతాల్ని బ్యాంకర్లు హోల్డ్‌లో పెట్టి అప్పు వసూలు చేస్తున్నారు. బ్యాంకర్ల నిర్ణయం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో లీడ్ బ్యాంక్ జోక్యం చేసుకుంది. పంట రుణాల వసూలు కోసం రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టకూడదంటూ అన్ని రకాల బ్యాంకర్లకు లీడ్ బ్యాంక్ నుంచి ఆదేశాలు జారీ చేశారు. సదరు కాపీని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఇతర బ్యాంకులన్నింటికీ పంపారు. అయినా బ్యాంకు మేనేజర్లు అప్పుల రికవరీ టార్గెట్‌ను చేరుకోవడం కోసం రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టి అందులో జమైన డబ్బుల్ని అప్పు కింద కట్టించుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు లీడ్ బ్యాంకు ఆదేశాల్ని పాటించాలని చెబుతున్నా ఫలితముండట్లేదు.

రైతు ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టొద్దు: ఎ.మాణిక్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు



రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం 2018 డిసెంబర్ నుంచి 2023 వరకు ఉన్న రూ.2 లక్షల పంట రుణాల్ని మాఫీ చేస్తామంటుంది. ఎన్నికలప్పుడే రుణాల్ని ఎవరూ కట్టొద్దని చెప్పారు. అందుకే రైతులు చెల్లించలేదు. బ్యాంకర్లు మాత్రం హోల్డ్‌లో పెట్టి ఫించన్ డబ్బులు, జొన్నలమ్మిన డబ్బులు, పీఎం కిసాన్ డబ్బుల్ని ఆపారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతుల సమస్యను పరిష్కరించాలి.

నిరీక్షణ ఫలించింది. గండం గడిచింది. ఎట్టకేలకు దక్షిణాఫ్రికా ఓ ఐసీసీ ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్లో అఫ్గనిస్థాన్‌ను చిత్తు చేసిన సఫారీలు చరిత్రలో తొలిసారి క్రికెట్ ప్రపంచకప్ టైటిల్ పోరుకు అర్హత సాధించారు. అనూహ్య బౌన్స్, పేస్, స్వింగ్ లభించిన పిచ్‌పై అఫ్గనిస్థాన్ 56 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప లక్ష్యాన్ని ఊదేసిన సఫారీలు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. అఫ్గనిస్థాన్ క్రికెట్ చరిత్రలో ఆడిన అతిపెద్ద మ్యాచ్‌లో ఆ జట్టు అత్యంత చెత్త ప్రదర్శనతో నిరాశపరిచింది.

సఫారీ తొలిసారి..



ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్లో అడుగు
సెమీస్‌లో అఫ్గనిస్థాన్ ఓటమి



సారథి.. సాధించాం! : ఫైనల్‌కు చేరిన ఆనందంలో సఫారీ క్రికెటర్లు

నవతెలంగాణ-తరౌబ

ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా అడుగుపెట్టింది. గురువారం జరిగిన తొలి సెమీఫైనల్లో అఫ్గనిస్థాన్‌పై 9 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. మార్కో జాన్సెన్ (3/16), స్పిన్నర్ షంశి (3/6), కగిసో రబాడ (2/14) బంతితో మ్యాజిక్ చేశారు. సఫారీ పేసర్లు, స్పిన్నర్ల ధాటికి అఫ్గనిస్థాన్ 11.5 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. అజ్మతుల్లా ఓమర్జాయ్ (10, 12 బంతుల్లో 2 ఫోర్లు) ఒక్కడే అఫ్గనిస్థాన్ తరఫున రెండెంకల స్కోరు అందుకున్నాడు. స్వల్ప లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 8.5 ఓవర్లలో ఊదేసింది. రీజా హెండ్రిక్స్ (29 నాటౌట్, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ ఎడెన్ మార్‌క్రామ్ (23 నాటౌట్, 21 బంతుల్లో 4 ఫోర్లు) సమయోచిత ఇన్నింగ్స్‌లతో మరో 67 బంతులు మిగిలి ఉండగానే లాంఛనం ముగించారు. సఫారీ పేసర్ మార్కో జాన్సెన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. భారత్, ఇంగ్లాండ్ సెమీఫైనల్ విజేతతో దక్షిణాఫ్రికా ఫైనల్లో తలపడనుంది.

అఫ్గాన్ విలవిల : టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గనిస్థాన్‌కు ఏదీ కలిసి రాలేదు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి బంతికి మొదలైన వికెట్ల పతనం.. ఎక్కడా ఆగలేదు. పిచ్ నుంచి అదనపు బౌన్స్, స్వింగ్, పేస్ లభించటంతో సఫారీ పేసర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. మార్కో జాన్సెన్ వరుస ఓవర్లలో రహ్మానుల్లా గుర్బాజ్ (0), గుల్బాదిన్ నయిబ్ (9), కరోటె (2) వికెట్లు కూల్చగా.. కగిసో రబాడ ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు. ఇబ్రహీం జద్రాన్ (2), మహ్మద్ నబి (0) వికెట్లతో అఫ్గాన్‌ను వణికించాడు. దీంతో పవర్‌ప్లేలో ఐదు ఓవర్లలోనే అఫ్గనిస్థాన్ టాప్-5 వికెట్లు కోల్పోయింది. పేసర్లు మొదలెట్టిన వికెట్ల వేటను స్పిన్నర్లు కొనసాగించారు. షంశి మాయతో మూడు వికెట్లు పడగొట్టాడు. కరీం జనత్ (8), నూర్ అహ్మద్ (0), నవీన్ ఉల్ హక్ (2) వికెట్లతో సఫారీ కథ ముగించాడు. మరో పేసర్ నోకియా సైతం అజ్మతుల్లా ఓమర్జాయ్ (10), రషీద్ ఖాన్ (0) వికెట్లతో మెరిశాడు. దీంతో 11.5 ఓవర్లలో అఫ్గనిస్థాన్ 56 పరుగులకే కుప్పకూలింది.



ఇలా జరిగిందేంటి? : సెమీస్‌లో దారుణ ఓటమి బాధలో అఫ్గాన్ క్రికెటర్లు

ఆడుతూ పాడుతూ : దక్షిణాఫ్రికా అజేయ రికార్డును కొనసాగించింది. పిచ్ బౌలర్లకు అనుకూలించటంతో ఓపెనర్ క్వింటన్ డికాక్ (5) ఆరంభంలోనే అవుటయ్యాడు. పిచ్ స్వభావం అర్థం చేసుకున్న హెండ్రిక్స్ (29 నాటౌట్), మార్‌క్రామ్ (23 నాటౌట్) రెండో వికెట్‌కు అజేయంగా 55 పరుగులు జోడించారు. అఫ్గాన్ పేసర్ ఫరూకీ ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. 8.5 ఓవర్లలో లాంఛనం ముగించిన దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. క్రికెట్ చరిత్రలో తొలిసారి ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్లోకి అడుగుపెట్టిన సఫారీలు పెద్దగా సంబురాలు చేయకపోవటం గమనార్హం.

సంక్షిప్త స్కోరు వివరాలు :

అఫ్గనిస్థాన్ ఇన్నింగ్స్ : 56/10 (అజ్మతుల్లా ఓమర్జాయ్ 10, గుల్బాదిన్ నయిబ్ 9, జాన్సెన్ 3/16, షంశి 3/6, రబాడ 2/14)

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : 60/1 (రీజా హెండ్రిక్స్ 29 నాటౌట్, ఎడెన్ మార్‌క్రామ్ 23 నాటౌట్, ఫజల్‌హక్ ఫరూకీ 1/11).

పహల్‌కు పారిస్ బెర్త్



న్యూఢిల్లీ : హర్యానా అథ్లెట్ కిరణ్ పహల్ పారిస్ 2024 ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. పంచ్‌కులలో జరుగుతు న్న జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో సత్తా చాటిన పహల్ పారిస్ బెర్త్ దక్కించుకుంది. మహిళల 400 మీటర్ల పరుగు సెమీఫైనల్స్‌లో 50.92 సెకండ్ల టైమ్‌లో రేసు ముగించిన కిరణ్ పహల్ అర్హత మార్క్‌ను అందుకుం ది. పారిస్ ఒలింపిక్స్ అర్హత 50.95 సెకండ్లు. హిమదాస్ (50.79) భారత్ తరఫున ఈ రేసులో వేగవంతమైన అథ్లెట్‌గా కొనసాగుతుంది.

గుకేశ్ బోణీ



బుచారెస్ట్ : భారత గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ సూపర్‌బెట్ క్లాసిక్ టెస్‌ను విజయంతో మొదలెట్టాడు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో గుకేశ్ రోమానియా గ్రాండ్‌మాస్టర్ డీక్ బోగ్డాన్ డానియల్‌పై గెలుపొందాడు. భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు తొలి రౌండ్లో డ్రా ఎదురైంది. ఉజ్బెకిస్థాన్ జీఎం నొడిర్బెక్‌తో ఉత్కంఠ గేమ్ డ్రాగా ముగిసింది.

ఇక టెస్టు సవాల్!

భారత్, దక్షిణాఫ్రికా మహిళల ఏకైక టెస్టు నేటి నుంచి



నవతెలంగాణ-చెన్నై : వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమ్ ఇండియా అమ్మాయిలు... చెపాక్‌లో టెస్టు పోరుకు సిద్ధమయ్యారు. సుమారు పుష్కర కాలం తర్వాత దక్షిణాఫ్రికా మహిళలతో టెస్టు పోరు ఆడుతున్న భారత్ మరో విజయంపై కన్నేసింది. నేడు చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా భారత్, దక్షిణాఫ్రికా మహిళల ఏకైక టెస్టు మ్యాచ్ ఆరంభం కానుంది. గత ఐదు టెస్టుల్లో ఓటమెరుగని టీమ్ ఇండియా హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుంది. గత ఐదు టెస్టుల్లో సఫారీ అమ్మాయిలు మూడు పరాజయాలు చవిచూసి ఓ విజయం సాధించారు. వన్డేల్లో చిత్తయిన సఫారీలు టెస్టుల్లోనైనా కనీస పోటీ ఇస్తారేమో చూడాలి. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, రిచా ఘోష్, జెమీమా రోడ్రిగస్, దీప్తి శర్మలు భారత్‌కు కీలకం కానున్నారు. సఫారీ తరఫున కెప్టెన్ లారా, అన్నెక, మారిజెనా, క్లాస్‌లు కీలక పాత్ర పోషించనున్నారు.

నవచిత్రం

మారేడుమిల్లిలో స్వయంభూ




నిఖిల్

నిఖిల్ మోస్ట్ ఎవైటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'స్వయంభూ'. ఈ సినిమాకి సంబంధించి కొత్త షెడ్యూల్ మారేడు మిల్లిలోని అందమైన లోకేషన్స్‌లో ప్రారంభమైంది. మారేడుమిల్లిలోని దట్టమైన అడవులలో నిఖిల్ పై కొన్ని కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరిస్తున్నారు.

ఈ సన్నివేశాలు నెరేటివ్‌కి కీలకం, ఛాలెంజ్‌తో కూడిన లాండ్ స్కేప్ మూవీ ఆథెంటిసిటీ, ఇంటన్సిటీని పెంచుతుంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నిఖిల్ నటిస్తున తన 20వ సినిమా కావడంతో దీన్ని గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌గా ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో చిత్ర బృందం ఉంది. ఇందులో నిఖిల్ లెజెండరీ వారియర్ పాత్రను పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం నిఖిల్ ఇంటెన్స్ ట్రెనింగ్ తీసుకున్నారు. పాత్ర పట్ల ఆయన అంకితభావం, డైనమిక్ పెర్ఫార్మెన్స్‌ని తెరపైకి తీసుకొస్తోంది.

ఈ మూవీలో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ పతాకంపై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం అత్యున్నత ప్రొడక్షన్ వాల్యూస్, టెక్నికల్ స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి నిర్మాతలు: భువన్, శ్రీకర్, సమర్పణ: ఠాగూర్ మధు, సంగీతం: రవి బస్రూర్, డీవోపీ: సెంథిల్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: ఎం ప్రభాకరన్, సహ నిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జీటి ఆనంద్.



రామ్

రిలీజ్‌కి కౌంట్‌డౌన్ షురూ..

రామ్ పోతినేని, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్' మూవీకి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తో తిరిగి వస్తున్నారుసంజయ్ దత్ విలన్‌గా చేరడం వలన స్టార్ పవర్ లేయర్‌ని యాడ్ చేస్తూ ఈ ప్రాజెక్ట్ ఇండియన్ సినిమాస్‌లో మోస్ట్ ఎవైటెడ్ మూవీస్‌లో ఒకటిగా నిలిచింది.

ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. ఇది సినిమా విడుదలకు పెర్ఫెక్ట్ టైం. ఈ నేపథ్యంలో 50 రోజుల కౌంట్‌డౌన్‌ను మార్కింగ్ చేస్తూ మేకర్స్ రామ్ పోతినేని స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. టైటిల్ సాంగ్ చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇది ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఇచ్చేలా చూసేందుకు టీమ్ కేర్ తీసుకుంటోంది. పక్కా చార్ట్‌బస్టర్ అయ్యే ఈ పాటలో రామ్ పోతినేని సిగ్నేచర్ ఎనర్జిటిక్ స్టైల్‌లో ఎలక్ట్రిఫైయింగ్ డ్యాన్స్ మూవ్‌లు, విజువల్స్ అద్భుతంగా ఉండబోతున్నాయి. మణిశర్మ కంపోజ్ చేసిన ఈ ఎనర్జిటిక్ మాస్ సాంగ్‌కు జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. రామ్‌కు జోడిగా కావ్య థాపర్ నటిస్తోంది. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 15న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

ద్విభాషా చిత్రంగా గుడ్ బ్యాడ్ అగ్లీ



అజిత్

హీరో అజిత్ కుమార్‌తో మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ తెలుగు-తమిళ ద్విభాషా చిత్రానికి ఆదిక్ రవిచంద్రన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఫ్యాన్స్‌కి మరో బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ చిత్రానికి సంబంధించి సెకండ్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఇందులో అజిత్ న్యూ అవతార్‌లో కనిపించడం అందర్నీ అలరిస్తోంది. ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా రూపొందనున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి రచన -దర్శకత్వం: అధిక్ రవిచంద్రన్, డీవోపీ: అభినందన్ రామానుజం, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, ఎడిటర్: విజయ్ వేలుకుట్టి, ప్రొడక్షన్ డిజైనర్: జి ఎం శేఖర్, స్టంట్స్: సుప్రీం సుందర్, కలోయన్ వోడెనిచరోవ్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దినేష్ నరసింహన్, సిఈవో: చెర్రీ, నిర్మాతలు: నవీన్ యెర్నేని-వై రవిశంకర్.



అర్జున్ అంబడి, ఐశ్వర్య

ఆసక్తికర ట్విస్టులతో అగ్నిసాక్షి

డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఫస్ట్ టైమ్ లాంగ్ ఫార్మెట్ షోగా 'అగ్ని సాక్షి' స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. జూలై 12వ తేదీ నుంచి ఈ స్ట్రీమింగ్ ప్రారంభం కానుంది. ఈ షోలో పాపులర్ టెలివిజన్ జంట అర్జున్ అంబడి, ఐశ్వర్య నటిస్తున్నారు.

డ్రామాతో కూడిన ఇంటెన్స్ స్టోరీలైన్, పవర్ ఫుల్ పర్‌ఫార్మెన్స్‌లతో ఇది ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. డెడికేటెడ్ పోలీస్ ఆఫీసర్ శంకర్‌గా అర్జున్ అంబడి, జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించ లేకపోయిన యువతి గౌరి పాత్రలో ఐశ్వర్య కనిపించనున్నారు. ఒక మిస్టీరియస్ మర్డర్ కేసు ఈ జంట జీవితాన్ని మలుపుతిప్పుతుంది.సస్పెన్స్, ఎమోషన్, ట్విస్టులతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగనుంది. అగ్నిసాక్షికి అన్ని వర్గాల ప్రేక్షకుల మంచి రెస్పాన్స్ వస్తుందని డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ప్రతినిధులు ఆశిస్తున్నారు.

భిన్న కథతో నేను- కీర్తన



చిమటా రమేష్‌బాబు, మురళీమోహన్

'ఏ భాషలోనైనా డైరెక్టర్స్ కమ్ హీరోస్ చాలా అరుదుగా ఉంటారు. చిమటా రమేష్ బాబు హీరోగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన 'నేను - కీర్తన' ట్రైలర్, సాంగ్స్ అన్నీ చాలా బాగున్నాయి. మరీ ముఖ్యంగా నేను విడుదల చేసిన ఐటమ్ సాంగ్ థియేటర్స్‌లో కచ్చితంగా విజిల్స్ వేయిస్తుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని నటులు మురళీమోహన్ అన్నారు. ఈ చిత్రం నుంచి 'కొంచెం కొంచెం గుడుగుడు గుంజం' అనే ఐటమ్ సాంగ్‌ను ఆయన ఆవిష్కరించారు.

చిమటా ప్రొడక్షన్స్ పతాకంపై చిమటా రమేష్ బాబు (సి.హెచ్.ఆర్)ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, చిమటా రమేష్ బాబు - రిషిత - మేఘన హీరో, హీరోయిన్లుగా చిమటా జ్యోతిర్మయి సమర్పణలో చిమటా లక్ష్మికుమారి నిర్మించిన ఈ చిత్రాన్ని అతి త్వరలో విడుదల చేయబోతున్నారు.

సినిమాలు, స్థిరాస్తి, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రతిభాశాలి మురళీమోహన్ తమ చిత్రం నుంచి ఐటమ్ సాంగ్ విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని అభిలషించడం పట్ల దర్శకుడు, కథానాయకుడు చిమటా రమేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని, కులుమనాలిలో చిత్రీకరించిన పాటలతోపాటు, ఆరు రోప్ ఫైట్స్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయని ఆయన అన్నారు. సంధ్య, జీవా, విజయరంగ రాజు, జబర్దస్త్ అప్పారావు, జబర్దస్త్ సన్నీ, రాజ్ కుమార్ ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్.రాజా, ఛాయాగ్రహణం: కె. రమణ, కూర్పు: వినయ్ రెడ్డి బండారపు.

నయా స్క్రీన్‌ప్లేతో 14



రాయల్ పిక్చర్స్ పతాకంపై లక్ష్మీ శ్రీనివాస్ దర్శకత్వంలో సుబ్బారావు రాయన, శివకృష్ణ నిచ్చన మెట్ల సంయుక్తంగా నిర్మించిన చిత్రం '14'. ఈ చిత్రం జూలై 5న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది.

ఈ సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను డైరెక్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ డైరెక్టర్ వీర శంకర్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా వీరశంకర్ మాట్లాడుతూ , 'అద్భుతమైనటువంటి స్క్రీన్‌ప్లేతో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా కచ్చితంగా మంచి హిట్ కొడుతుంది. కొత్త కథతో ఈ సినిమాని తెరకెక్కించడం అభినందనీయం' అని అన్నారు. రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో నోయల్, విషాక ధీమాన్ ప్రధాన పాత్రలు పోషించగా రతన్, పోసాని కృష్ణ మురళి,శ్రీకాంత్ అయ్యంగార్, రూపాలక్ష్మి తదితరులు నటించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.


స్వప్రయోజనాలను తాకట్టు పెడుతున్న 'గోడీ మీడియా'

ప్రభుత్వానికి బాకా ఊదినా పెరగని ఆదాయం

- విద్వేషాలను వ్యాపింపజేసినా రాని టీఆర్‌పీ రేటింగ్స్

న్యూఢిల్లీ : ప్రభుత్వ అనుకూల మీడియా ప్రధానంగా సర్కారు నుండి వచ్చే ప్రకటనల ఆదాయం పైనే ఆధారపడుతుంది. అయితే ప్రభుత్వానికి బాకా ఊదినప్పటికీ దేశంలోని ఆరు లిస్టెడ్ న్యూస్ మీడియా సంస్థల ఆదాయం గత దశాబ్ద కాలంలో పెద్దగా పెరగకపోవడం గమనార్హం. 2014 తర్వాత 'గోడీ మీడియా' అనే పదం బాగా ప్రచారంలోకి వచ్చింది. మెగసెసే అవార్డు గ్రహీత, సీనియర్ పాత్రికేయుడు రవిష్ కుమార్ ఈ పదానికి సృష్టికర్త. ప్రధాని చెప్పుచేతల్లో నడుస్తూ అడుగులకు మడుగులొత్తే మీడియానే ఆయన గోడీ మీడియా అని సంబోధించారు.

బడా మీడియా సంస్థలు ఆదాయం కోసం కార్పొరేట్ ప్రయోజనాలకే కొమ్ము కాస్తుంటాయి. ప్రభుత్వ ప్రకటనలపై కూడా అవి ఆధారపడతాయి. ప్రభుత్వం కూడా తన మాట వినే మీడియా సంస్థలకే ప్రకటనలు జారీ చేస్తూ వాటికి ఆదాయాన్ని అందిస్తుంది. దీంతో ఆయా సంస్థలు విలువలతో రాజీ పడిపోయి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుంటాయి. ప్రతిపక్ష పార్టీలను పట్టించుకోవు. పైగా వాటిపై దుష్ప్రచారం చేస్తుంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అవి ప్రభుత్వానికి బాకా ఊదుతుంటాయి. ప్రజా సమస్యలను ఏ మాత్రం



పట్టించుకోవు. లైసెన్సులు, ప్రకటనల కోసం మీడియా సంస్థలు పాలకుల ముందు సాగిలపడుతున్నాయి.

గత పది సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం తరఫున వకాల్తా తీసుకొని వార్తలు అందించినప్పటికీ బడా మీడియా సంస్థల ఆదాయం పెద్దగా పెరిగిందేమీ లేదు. ఆరు లిస్టెడ్ మీడియా సంస్థల ఉమ్మడి అమ్మకాలు 2014లో రూ.6,325 కోట్లు ఉంటే 2023 నాటికి రూ.6,691 కోట్లకు మాత్రమే చేరాయి. వాస్తవానికి ఈ ఆరు సంస్థల మొత్తం లాభం ఇదే కాలంలో 761 కోట్ల నుండి రూ.254 కోట్లకు పడిపోయింది. దేశంలో అతి పెద్ద వార్తా పత్రికలు, ఛానల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఆరు లిస్టెడ్ కంపెనీలు ద్రవ్యోల్బణం దెబ్బకు కుదేలయ్యాయి. 2014తో పోలిస్తే వాటి సైజు కూడా తగ్గిపోయింది. మరి ఇంత జరుగుతున్నా 'గోడీ మీడియా' తన ప్రయోజనాలకు విరుద్ధంగా ఎందుకు వ్యవహరిస్తోంది?

కారణాలు ఇవే

గత పది సంవత్సరాల కాలంలో ఈ కంపెనీల సంపాదన పెద్దగా పెరిగింది లేదు. వ్యాపారంలో కూడా అవి ప్రయోజనం పొందలేకపోయాయి. వాస్తవానికి వాటి లాభాలు తగ్గి పోయాయి. గత ఇరవై సంవత్సరాల కాలంలో మీడియా స్వభావంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. పత్రికలు, ఛానల్స్‌కు వచ్చే ప్రకటనలు తగ్గాయి. ఆన్‌లైన్ ప్రకటనలకు ప్రాచుర్యం లభిస్తోంది. ఆ ప్రకటనల సొమ్ములో అధిక భాగం గూగుల్, ఫేస్‌బుక్ సంస్థలకు వెళుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి సరిగా లేకపోవడం కూడా మీడియా సంస్థల ఆదాయం పడిపోవడానికి కారణంగా కన్పి స్తోంది. ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ, ప్రతిపక్షాలపై దాడి చేస్తున్నందుకు వార్తా ఛానల్స్‌కు లభిస్తున్న ప్రోత్సాహకాలు ఏమిటి? ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల పైన ఏ మేరకు అవి ఆధారపడుతున్నాయి? అనే ప్రశ్నలకు ఛానల్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఇచ్చిన సమాధానాలు ఆసక్తికరంగా ఉన్నాయి.

ఆదాయం పడిపోవడానికి రాజకీయ ఒత్తిడులే కారణం కాదని, సహజంగానే ఆదాయాలు తగ్గిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వ ప్రకటనలపై వచ్చే ఆదాయమే ప్రధాన వనరు అవుతోందని, అది తగ్గడంతో మొత్తంగా రెవెన్యూ పడిపోయిందని వారు తెలిపారు. గౌతమ్ అదానీ, ముకేష్ అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తలు మీడియా అధిపతులు అయ్యారు. అయితే మీడియా అనేది కేవలం వారికి సైడ్ బిజినెస్‌గానే ఉంటోంది. కాబట్టి దానిపై వారు పెద్దగా దృష్టి పెట్టడం లేదు.

బాకా ఊదినా పెరగని రేటింగ్స్

మతపరమైన విభజనలు సృష్టించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వాటికి సంబంధించిన వార్తలకు టీఆర్‌పీ రేటింగ్స్ కూడా పెద్దగా ఉండడం లేదు. అయితే ఈ కార్యక్రమాలు చూస్తున్న ప్రేక్షకుల సంఖ్య గణనీయంగానే ఉంటోంది. విద్వేష పూరిత ప్రసంగాలను ప్రసారం చేసేటప్పుడు వీక్షకులు ఆసక్తిగా తిలకిస్తుంటారు. ఉదాహరణకు కోవిడ్ వ్యాప్తికి ముస్లింలే కారణమంటూ జరిగిన ప్రచారం జనంలోకి బాగానే వెళ్లింది. అయినప్పటికీ ప్రభుత్వాన్ని సమర్థించి, ప్రతిపక్షాలను విమర్శించినంత మాత్రాన ప్రేక్షకుల సంఖ్య పెరిగిన దాఖలాలు మాత్రం లేవు. కానీ ఇలా చేయడం వెనుక బడా మీడియా సంస్థలకు వేరే ఉద్దేశాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలు మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో ఇకపై 'గోడీ మీడియా' వైఖరి ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. భారతీయ జర్నలిజంలో ఇప్పటివరకూ దారుణమైన, సిగ్గుతో తలదించుకోవాల్సిన దశను చూశామని ఓ పాత్రికేయుడు వ్యాఖ్యానించారు.

పెన్ పింటర్ ప్రైజ్-2024 విజేతగా అరుంధతీ రాయ్



ఢిల్లీ : బుకర్ ప్రైజ్ గ్రహీత, ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్ ప్రతిష్టాత్మకమైన పెన్ పింటర్ ప్రైజ్ - 2024 విజేతగా నిలిచారు. ఆమె రాసిన తొలి నవల 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'కి ఈ అవార్డు గెలుపొందినట్టు ప్రకటించారు. 14 సంవత్సరాల క్రితం కాశ్మీర్‌పై చేసిన వ్యాఖ్యలపై తాజాగా ప్రాసిక్యూషన్ ఎదుర్కొంటున్న ఆమె పెన్ పింటర్ ప్రైజ్ విజేతగా నిలవడంతో పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇంగ్లీష్ పెన్ చైర్ రూత్ బోర్త్‌విక్ మాట్లాడుతూ అరుంధతీరాయ్ అంతర్జాతీయ ఆలోచనాపరురాలని, శక్తివంతమైన ఆమె స్వరం మౌనంగా ఉండకూడదని పేర్కొన్నారు. అరుంధతీరాయ్ స్పందిస్తూ "నేను పెన్ పింటర్ బహుమతిని అంగీకరించడం ఆనందంగా ఉంది. ప్రపంచం తీసుకుంటున్న దాదాపు అపారమయిన మలుపు గురించి రాయడానికి ఈరోజు 'హెరాల్డ్ పింటర్ మాతో ఉన్నారు' నేను కోరుకుంటున్నాను" అని అన్నారు. గతంలో సల్మాన్ రష్దీ, మార్గరెట్ అట్‌వుడ్, టామ్ స్టాపర్డ్, కరోల్ ఆన్ డఫీలు పింటర్ బహుమతిని అందుకున్నారు. అక్టోబర్ 10, 2024న బ్రిటిష్ లైబ్రరీ సహ-హోస్ట్ చేసే కార్యక్రమంలో రాయ్ ఈ బహుమతిని అందుకోనున్నారు. పెన్ పింటర్ ప్రైజ్ విజేత ఎంపికలో న్యాయమూర్తులుగా రూత్ బోర్త్‌విక్, నటుడు, ఉద్యమకారుడు ఖలీద్ అబ్దల్లా, రచయిత, సంగీతకారుడు రోజర్ రాబిన్సన్ వ్యవహరించారు.

ప్రజాగ్రహానికి తలొగ్గిన కెన్యా అధ్యక్షుడు

ఆర్థిక బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటన



నైరోబి : ప్రజలపై పన్నుల భారాన్ని పెంచుతూ తీసుకొచ్చిన ఆర్థిక బిల్లును ఉపసంహరించుకుంటున్నట్టు కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రకటించారు. ఈ బిల్లును పార్లమెంట్ ఆమోదించిన గంటల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం పెల్లుబికింది. రాజధాని నైరోబిలోని వీధుల్లో ఆందోళనలు చేస్తున్న వారిని పోలీసులు కాల్చివేశారు. మొత్తంగా 53మంది మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గిన అధ్యక్షుడు బిల్లును ఉపసంహరించారు.

పాలకవర్గాల ఉదాసీనత, అవినీతి నేపథ్యంలో ఇప్పటికే అధిక ధరలు, పెచ్చరిల్లిన నిరుద్యోగం ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ఈ పన్ను పెంపు ప్రతిపాదనలు తీవ్ర ఆగ్రహాన్ని రగిల్చాయి. ఆర్థిక బిల్లును వ్యతిరేకిస్తూ తలెత్తిన నిరసనలు చివరకు తిరుగుబాటుగా మారాయి. రూటో ప్రభుత్వాన్ని మాత్రమే కాకుండా 60ఏండ్ల నాటి స్వాతంత్ర్యానంతర పార్లమెంట్ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేశారు. దేశంలోని 37 కౌంటీల్లో లక్షలాదిమంది నిరసనలు తెలియజేశారు. రూటో రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. చివరకు కాల్పులు, బాష్పవాయు గోళాలతో పోలీసులు ఆందోళనలను అణచివేసేందుకు ప్రయత్నించారు. నైరోబి శివార్లలోని గితురాయ్ ప్రాంతంలో 30మంది మరణించగా, దేశవ్యాప్తంగా మిగిలిన ప్రాంతాల్లో మరో 23మంది చనిపోయారు. పోలీసుల అణచివేత చర్యలు చాలా కిరాతకంగా వున్నాయి. 17గంటల వ్యవధిలోనే రూటో బెదిరింపు స్వరం మారింది. రాజీ ధోరణిలో ప్రసంగిస్తూ, బిల్లును ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. హింసను రెచ్చగొడుతున్న వారిని, అరాచకాన్ని సృష్టిస్తున్న వారిని దారుణంగా అణచివేస్తామని హెచ్చరించారు. సైన్యాన్ని కూడా రంగంలోకి దించుతున్నామని ప్రకటించారు. కానీ బుధవారం పొద్దుపోయేసరికి పరిస్థితి మారింది. పెద్ద ఎత్తున సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టం పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ బిల్లును ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు. బిల్లుకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు రాబోయే రెండు వారాల్లో బహుళ రంగాలు, వర్గాలవారితో చర్చలు జరుపుతామని ప్రతిపాదించారు.

ఆ మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలును ఆపండి

సుప్రీంలో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ : మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై స్టే విధించాలని కోరుతూ సుప్రీం కోర్టులో గురువారం ఒక పిటిషన్ దాఖలైంది. ఈ మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం-2023లు జులై 1 నుంచి అమల్లోకి రావాల్సి వుంది. అంజలి పటేల్, ఛాయా మిశ్రాలు ఈ రిట్ పిటిషన్ వేశారు. క్రిమినల్ ప్రొసీజర్‌ను, న్యాయ వ్యవస్థను ప్రక్షాళనం చేస్తున్న ఈ మూడు కొత్త చట్టాల సాధ్యాసాధ్యాలను అంచనా వేసేందుకు తక్షణమే నిపుణుల కమిటీని నియమించాలని వారు సుప్రీం కోర్టును కోరారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ), భారతీయ సాక్ష్యాధారాల చట్టం స్థానంలో ఈ మూడు కొత్త చట్టాలను తీసుకువస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రతిపక్షాల సభ్యులను సస్పెండ్ చేసి, పార్లమెంట్‌లో సవివరమైన లేదా సమర్థవంతమైన చర్చ జరగకుండానే ఈ మూడు చట్టాలను ఆమోదించారని ఆ పిటిషన్ పేర్కొంది. బిల్లుల ఆమోదం సమయంలో చాలా కొద్దిమంది సభ్యులు మాత్రమే పాల్గొన్నారని తెలిపింది. 146మంది ప్రతిపక్షాల ఎంపీలను సస్పెండ్ చేయడంపై హిందూ పత్రికలో వచ్చిన వార్తలను ఆ పిటిషన్ ప్రస్తావించింది. కొత్త చట్టాలకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తమిళనాడు, బెంగాల్ ముఖ్యమంత్రులు హోం మంత్రికి



పంపిన లేఖలను కూడా పిటిషన్‌లో ఉటంకించారు.

కొత్త చట్టాలు అస్పష్టంగా, సందిగ్ధంగా ఉన్నాయని పిటిషన్ పేర్కొంది. పోలీసులకు విస్తృతాధికారాలను అప్పచెబుతున్నాయని, అరెస్టు సమయంలో చేతులకు బేడీలు వేయడం వంటి అమానవీయ పద్ధతులను పునరుద్ధరిస్తున్నారని పిటిషన్ పేర్కొంది. ఐపీసీ స్థానంలో తీసుకువస్తున్న భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) గ్యాంగ్, మొబైల్ ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్రూప్స్ వంటి పదాలను నిర్వచించలేదని తెలిపింది.

మానసిక అస్వస్థులుగా ఉన్నవారిని ప్రాసిక్యూషన్ నుంచి బిఎన్ఎస్ కాపాడుతోందని పిటిషన్ పేర్కొంది. అయితే ఆ మానసిక అస్వస్థత నిర్వచనంలో మానసికంగా సరైన ఎదుగుదల లేకపోవడం (మెంటల్ రిటార్డేషన్) అంశాన్ని మినహాయించారని పేర్కొంది.

దీనివల్ల మానసికంగా ఎదుగుదల లేని వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయవచ్చునని స్పష్టమవుతోంది. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతలకు ముప్పు కలిగించే దేశద్రోహ చర్యల స్థానంలో కొత్త నేరాన్ని ప్రవేశపెట్టారు. తీవ్రవాదం కూడా బిఎన్ఎస్ కింద నేరమే.

ఇక సీఆర్‌పీసీ స్థానంలో తీసుకువస్తున్న భారతీయ నాగరిక్ సురక్ష (సెకండ్) సంహిత-2023, 15 రోజుల పోలీసు కస్టడీకి ఒకేసారి అనుమతిస్తోంది లేదా దశలవారీగానైనా తీసుకోవడానికి అనుమతిస్తోంది.

వలసవాద వారసత్వమైన 144వ సెక్షన్‌ను ఈ కొత్త చట్టంలో కూడా కొనసాగిస్తున్నారని పిటిషన్ పేర్కొంది.

ఇక మూడవ చట్టమైన భారతీయ సాక్ష్య అధినియం, 2023 ప్రకారం ఎలక్ట్రానిక్ రికార్డులు ప్రాథమిక సాక్ష్యాధారాలుగా పరిగణిస్తారు. పాత చట్టంలో వీటిని సెకండరీ సాక్ష్యాలుగా పేర్కొన్నారు.

స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటి వాటిని స్వాధీనం చేసుకని, దర్యాప్తు చేసేటపుడు వాటిలో సమాచారం తారుమారు కాకుండా చూసేందుకు ఎలాంటి రక్షణలు కల్పించలేదని పిటిషన్ పేర్కొంది.

నీట్ పేపర్ లీకేజీ

ఇద్దరిని అరెస్టు చేసిన సీబీఐ



న్యూఢిల్లీ : నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ దేశవ్యాప్తంగా దుమారం రేగింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. రంగంలోకి దిగిన సీబీఐ ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. తొలుత పాట్నాకు చెందిన మనీష్ ప్రకాష్, అశుతోష్‌లు నీట్ పేపర్ లీకేజి పాల్పడినట్టుగా సీబీఐ గుర్తించింది. గురువారం ఈ ఇద్దరు నిందితులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఈ ఇద్దరు నిందితులు పేపర్‌ని లీక్ చేయడమే గాకుండా.. విద్యార్థులు చదువుకునేందుకు సురక్షిత గృహాలను కూడా ఏర్పాటు చేసినట్లు సీబీఐకి చెందిన సీనియర్ అధికారి తెలిపారు. మనీష్ ప్రకాష్, అశుతోష్‌లిద్దరూ నీట్ పేపర్‌ను లీక్ చేశారు. ఈ పేపర్ ఆధారంగా విద్యార్థులు నీట్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు మనీష్ ప్రకాష్, ఈ కేసులో మరో నిందితుడైన అశుతోష్ వాళ్ల ఇంటికి విద్యార్థులను తన కారులోనే తరలించినట్టు సీనియర్ అధికారి తెలిపారు. వీరిద్దరినీ కోర్టు ముందు హాజరుపరచనున్నట్టు అధికారి తెలిపారు. కాగా, నీట్ పేపర్ లీకేజీ దేశవ్యాప్తంగా దుమారం రేగింది. ప్రతిపక్షాలు విమర్శించడంతో కేంద్రం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. సీబీఐ దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసింది.

అమెరికాలో పెరుగుతున్న తెలుగు జనాభా..

ఎనిమిదేండ్లలో నాలుగురెట్లు

- 12 లక్షల మందికిపైగా తెలుగు వారు



వాషింగ్టన్: అమెరికాలో తెలుగు జనాభా ఏటికేడు పెరుగుతోంది. ఇక తెలుగు రాష్ట్రాలకు చెందిన యువత గురించి చెప్పాల్సిన పనిలేదు. పక్క రాష్ట్రానికి వెళ్లినట్లుగా బ్యాగ్‌లు సర్దుకుని వెళ్లిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన యువత ముఖ్యంగా చదువు కోసం అమెరికా వెళుతున్నారు.

అమెరికాలో ఉంటే వారి సొంత రాష్ట్రంలోనే ఉన్నట్టుగా.. అంతెందుకు వారి సొంత ఇంట్లోనే ఉన్నట్టుగా ఫీలవుతున్నారు. అందుకే ఏడాదికేడాది అమెరికాలో తెలుగు రాష్ట్రాల జనాభా పెరుగుతోందని నివేదికలు చెబుతున్నాయి. అక్కడ ఎనిమిదేండ్లలోనే నాలుగురెట్లు తెలుగు జనాభా పెరిగింది. 2016లో అమెరికాలో 3.2 లక్షల మంది తెలుగు జనాభా వుండగా, 2024 సంవత్సరానికి ఆ సంఖ్య 12.3 లక్షలకు చేరుకుందని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

కాగా, అమెరికా సెన్సస్ బ్యూరో నివేదిక ప్రకారం.. కాలిఫోర్నియాలో రెండు లక్షలు, టెక్సాస్ 1.5 లక్షలు, న్యూజెర్సీ 1.1లక్షల మంది తెలుగువారు ఉన్నారు. ఇల్లినాయిస్ రాష్ట్రంలో 83 వేలు, వర్జీనియా 78 వేలు, జార్జియా 52 వేలు మంది తెలుగు వారు ఉన్నారు.

దాదాపు 10 వేల మంది హెచ్1బి వీసా పొందిన వారితోపాటు ప్రతి సంవత్సరం 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు యుఎస్ వెళుతున్నారు. వీరిలో 80 శాతం మంది తమ వద్ద రిజిష్టర్ చేయించుకున్నవారేనని ఉత్తర అమెరికా తెలుగు సంఘం మాజీ కార్యదర్శి అశోక్ కొల్లా తెలిపారు.

ఇక్కడికి వచ్చిన వారిలో 75 శాతం మంది స్థిరపడ్డారు. ఎక్కువగా డల్లాస్, బే ఏరియా, నార్త్ కరోలినా, న్యూ జెర్సీ, అట్లాంటా, ఫ్లోరిడా, నాష్‌విల్లేలో స్థిరపడ్డారు. చాలాఏండ్ల క్రితమే ఇక్కడి కొచ్చిన తెలుగు వారు ఐటి అండ్ ఫైనాన్స్‌లో స్థిరపడ్డారు. అమెరికాలోని 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో ఉంది. హిందీ, గుజరాతీ భాషల కంటే.. తెలుగు మాట్లాడేవారే ఎక్కువ.

వృత్తిరీత్యా డేటా ఎనలిస్టుగా పనిచేస్తున్న కె. వినయ్‌కుమార్ మాటల్లో చెప్పాలంటే... 'తన చుట్టూ అనేక తెలుగు కుటుంబాలు నివశిస్తున్నాయి. తాను ఇక్కడ త్వరగా స్థిరపడడానికి ఈ అనుకూల వాతావరణం సహాయపడిందని, ఇంటిని విడిచి దూరంగా ఉన్నాననే భావన కలగలేదని' అన్నారు.

'మొదట అమెరికాకు నాలుగైదు తెలుగు కుటుంబాలే వచ్చాయి. ఆ తర్వాత్తర్వాత తెలుగు వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తర్వాత యుఎస్ తెలుగు వారికి ఇంకో రాష్ట్రంగా మారింది. ఈ కమ్యూనిటీ కోసం దేవాలయాలు కూడా వెలిశాయి' అని న్యూజెర్సీలో ఐదు దశాబ్దాలకుపైగా నివాసం వుంటోన్న వ్యాపారవేత్త టి.రాఘవేంద్రరావు తెలిపారు.

జీవిత కాల గరిష్టానికి సెన్సెక్స్, నిఫ్టీలు

న్యూఢిల్లీ : దేశీయ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలు గురువారం ప్రారంభ ట్రేడ్‌లో రికార్డు సృష్టించాయి. సెన్సెక్స్ 339 పాయింట్లు దాటి రూ. 79,000 జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ కూడా 97.6 పాయింట్లు దాటి రూ. 23,966 మార్కుతో ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. సెన్సెక్స్ కంపెనీలు అల్ట్రాటెక్ సిమెంట్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, బజాజ్ ఫినాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ మరియు టాటా స్టీల్ లాభపడ్డాయి. మారుతి, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ మరియు లార్సెన్ అండ్ టర్బోలు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. ఎక్స్ఛేంజ్ నివేదిక ప్రకారం.. విదేశీ సంస్థాగత పెట్టుబడి దారులు (ఎఫ్ఐఐఎస్) బుధవారం రూ. 3,535.43ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు.

కేరళలో భారీ వర్షాలు : స్కూళ్లు మూసివేత



తిరువనంతపురం : కేరళలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు కేరళ మీదుగా మరికొన్నిరోజులు కొనసాగే అవకాశం ఉందని, ఈ రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేరళకు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. కాగా, మహారాష్ట్ర-కేరళ తీరాల వెంబడి సముద్ర మట్టంలో ద్రోణి ఏర్పడిందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈ ద్రోణి వల్ల కేరళ తీరంలో గంటకు 35 కిలోమీటర్ల నుంచి 45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండి అధికారులు పేర్కొన్నారు. ఈ ద్రోణి కారణంగా మధ్య గుజరాత్‌లో, కేరళలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కేరళలోని ఆరు జిల్లాల్లో పాఠశాలలను అధికారులు మూసివేశారు. పతనంతిట్ట, కొట్టాయం, అలప్పుజ, ఇడుక్కి, ఎర్నాకుళం, వాయనాడ్‌లలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.

నో బెయిల్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో

ముగ్గురు పోలీసు అధికారులకు కోర్టు షాక్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులైన ముగ్గురు పోలీసు అధికారులు డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలకు నాంపల్లి కోర్టు షాకిచ్చింది. వారికి బెయిల్ నిరాకరిస్తూ న్యాయమూర్తి గురువారం ఆదేశాలు జారీ చేశారు. గత రెండు నెలల క్రితం ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఇదే విభాగంలో అదనపు ఎస్పీలుగా పని చేసిన బుజంగరావు, తిరుపతన్నలకు బెయిల్‌ను మంజూరు చేయాలని కోరుతూ వారి తరఫు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. అంతేగాక, వీరికి బెయిల్‌ను మంజూరు చేయాలనీ, ఫోన్‌ట్యాపింగ్ కేసులో వీరి నేరాన్ని నిరూపించే ఆధారాలేవి కూడా దర్యాప్తు అధికారులు కోర్టుకు సమర్పించలేదని నిందితుల తరఫు న్యాయవాదులు వాదించారు. అయితే, ఈ కేసులో ప్రధాన నిందితులైన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు, మరో నిందితుడు ఐ న్యూస్ శ్రవణ్ కుమార్‌లు పరారీలో ఉన్నారనీ, ఈ సమయంలో ఈ ముగ్గురు నిందితులకు బెయిల్ లభిస్తే వెలుపలికి వచ్చి, ఆధారాలను తారుమారు చేసే అవకాశమున్నదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. ఈ మేరకు వాదనలు విన్న న్యాయమూర్తి ముగ్గురు నిందితులకు బెయిల్‌ను నిరాకరిస్తూ తీర్పునిచ్చారు.

భావి తరాలకు రామోజీ స్ఫూర్తి

- అమరావతిలో విజ్ఞానకేంద్రం
- ఎన్‌టిఆర్‌తో పాటు ఆయనకూ భారతరత్న సాధించాలి : సంస్మరణ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి : రామోజీ రావు స్ఫూర్తిని భావితరాలకు అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభ కానూరులో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ, పాత్రికేయ రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రామోజీరావు పత్రికారంగంలో ఉండి నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడారని చెప్పారు. భావి తరాలు ఆయన్ను గుర్తించుకునేలా ఢిల్లీలో ఉన్న విజ్ఞాన్ భవన్ తరహాలో రాజధాని అమరావతిలో కూడా రామోజీరావు పేరుతో విజ్ఞాన్ భవన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమరావతిలోనే ఒక రోడ్డుకు కూడా ఆయన పేరు పెడతామన్నారు. విశాఖపట్నంలో రామోజీరావు చిత్రనగరి పేరుతో సినిమా షూటింగుల కోసం స్థలాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టిఆర్‌తో పాటు, రామోజీరావుకు కూడా భారత రత్న సాధించాలని తెలిపారు. ఇది తెలుగు ప్రజల అందరి బాధ్యతని అన్నారు. ఎంతోమంది నటులు, కళాకారులు, జర్నలిస్టులకు రామోజీరావు జీవితాన్ని ఇచ్చారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ఉన్నారని వివరించారు. ప్రజాస్వామ్యం అపహాస్యం అయినప్పుడల్లా తాను ఉన్నానంటూ ముందుకొచ్చి పోరాడారని చెప్పారు. పార్టీ స్థాపించిన ఆరు నెలల్లో ఎన్టీఆర్ అధికారంలోకి రావడానికి రామోజీ కూడా కారణమని చెప్పారు. రాజధాని నగరానికి అమరావతి అన్న పేరు పెట్టాలని తనకు సూచించిందికూడా ఆయనే అని అన్నారు. గడిచిన ఐదేళ్లల్లో అమరావతి ఇబ్బందులు పడిందని, రాబోయే రోజుల్లో దాని దశ, దిశ మారుతుందన్నారు. తెలుగుజాతి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని చెప్పారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటం: పవన్ కళ్యాణ్

ప్రజలకు ఇబ్బంది కలిగించిన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రామోజీరావు వార్తలతో మిగతా 2లోపోరాటం చేసేవారని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు తెలియాలని భావించారని తెలిపారు. కష్టాలు ఎన్ని వచ్చినా తన విలువలను వదులుకోలేదన్నారు. అమరావతిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

మీడియా స్వేచ్ఛకోసం పోరాడారు : ఎన్ రామ్

రామోజీరావు విలువలతో కూడిన ఇన్విస్టిగేషన్ జర్నలిజాన్ని నమ్మేవారని ది హిందూ పూర్వ సంపాదకులు ఎన్ రామ్ అన్నారు. 1980వ దశకంలో ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షులుగా రామోజీరావు మీడియా స్వేచ్ఛకోసం రాజీ పడకుండా పోరాడారని తెలిపారు. బోఫోర్స్ కుంభకోణంపై వచ్చిన వార్తలపై నాటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం మీడియాను లక్ష్యంగా చేసుకొని పరువునష్టం బిల్లును తెచ్చిందని తెలిపారు. ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షులుగా రామోజీరావు ఆబిల్లుకు వ్యతిరేకంగా పోరాడితే రాజీవ్‌గాంధీ ఆ బిల్లును ఉపసంహరించుకున్నారని చెప్పారు. రామోజీ రావు మీడియా రంగాన్ని గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లేలా మొదటిసారి జిల్లా టాబ్లాయిడ్‌లను తీసుకొచ్చారన్నారు.

రాజధానికి రూ.10కోట్ల విరాళం అందించిన కిరణ్

రాజధాని అమరావతి నిర్మాణం కోసం రామోజీరావు కుటుంబ సభ్యులు రూ.10కోట్ల విరాళాన్ని అందించారు. ఈ చెక్కును చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు అందజేశారు. తన తండ్రి పాటించిన విలువలను త్రికరణ శుద్ధిగా పాటిస్తామనిఆయన కుమారుడు కిరణ్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం జీవితాంతం రామోజీరావు పరితపించారని చెప్పారు. ఆయన నెలకొల్పిన విలువలను ముందుకు తీసుకుపోతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పార్థసారధి, కొల్లు రవీంద్ర,ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సినీ ప్రముఖులు జయసుధ, మురళీమోహన్, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, ఎస్ఎస్ రాజమౌళి, ఎంఎం కిరవాణీ తదితరులు మాట్లాడారు. మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

జనరిక్ ఔషధ ఎగుమతుల్లో విస్తృత అవకాశాలు

- లాటిన్ అమెరికా, ఆఫ్రికాపై కీలక దృష్టి
- ఈ ఏడాది రూ.2.58 లక్షల కోట్ల ఎగుమతులు : ఫార్మాక్సిల్ డైరెక్టర్ జనరల్ వెల్లడి



హైదరాబాద్ : జనరిక్ ఔషధ ఎగుమతుల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మాక్సిల్) డైరెక్టర్ జనరల్ ఉదయ భాస్కర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో సీనియర్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్నతో కలిసి ఉదయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ.. 2023 నుంచి 2029 వరకు ఈ రంగంలో 10 బిలియన్ డాలర్ల (రూ.83వేల కోట్లు) రెవెన్యూకు అవకాశాలున్నాయన్నారు. ఇందుకు 15 కీలక ఔషధాలు మద్దతును అందించనున్నాయని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మేలో భారత ఔషధ ఎగుమతులు 8.85 శాతం పెరిగి రూ.4.73 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు. గతేడాది ఇదే రెండు నెలల్లో 4.35 బిలియన్ల ఎగుమతులు జరిగాయన్నారు.

దేశంలో 748 యూనిట్లకు యుఎస్ఎఫ్‌డిఎ అనుమతులు ఉన్నాయని తెలిపారు. 2004-05లో 3.9 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఔషధ ఎగుమతులు.. 2023-24 నాటికి 27.85 బిలియన (రూ.2.32 లక్షల కోట్లు)కు చేరాయన్నారు. ఈ కాలంలో ప్రతీ ఏడాది సగటున 11 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 31 బిలియన్ డాలర్ల (రూ.2.58 లక్షల కోట్లు)కు చేరొచ్చని ఉదయ్ అంచనా వేశారు. కాగా.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలపై భారత ఫార్మా కంపెనీలు కీలక దృష్టిని సారించాయన్నారు.

ఆగస్టులో ఐపెక్స్..

ఫార్మెక్సిల్ ఆధ్వర్యంలో 10వ ఎడిషన్ ఇంటర్నేషనల్ ఫార్మా ఎగ్జిబిషన్ ఐపెక్స్ జరుగనుందని ఉదయ భాస్కర్ తెలిపారు. ఆగస్టు 28 నుంచి 30 వరకు గ్రేటర్ నోయిడాలోని ఐఇఎంఎల్‌లో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భారత్ నుంచి 440 ఎక్స్ పోర్టర్స్ పాల్గొని వారి ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని తెలిపారు. 120 దేశాల నుంచి 500 మంది ఓవర్సీస్ బిజినెస్ డెలిగేట్స్ ఇందులో పాల్గొనే అవకాశం ఉందన్నారు.

సెన్సెక్స్ @79వేలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో రోజుకో నూతన రికార్డ్‌ను సృష్టిస్తున్నాయి. గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 79వేలు, నిఫ్టీ 24వేల పాయింట్ల ఎగువన నమోదై.. మరో కీలక మైలురాయిని అధిగమించాయి. సెన్సెక్స్ ఉదయం ఒత్తిడిలోనే ప్రారంభమైనప్పటికీ.. ఆ తర్వాత పుంజుకుని.. తుదకు లాభాల్లో ముగిసింది. చివరికి 569 పాయింట్ల లాభంతో 79,243కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 176 పాయింట్లు పెరిగి 24,044.50 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30లో అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టిపిసి, జెఎస్‌డబ్ల్యు స్టీల్, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. మరోవైపు ఎల్అండ్‌టి, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, మారుతీ సుజుకీ అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

జులై 10న గెలాక్సీ కొత్త ఫోల్డబుల్ ఫోన్ల ఆవిష్కరణ

గూర్‌గావ్ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ వచ్చే జూలై 10న తదుపరి తరం గెలాక్సీ జడ్ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. పారిస్‌లో కొత్త ఫోన్ల గ్లోబల్ ఆవిష్కరణ ఉంటుందని పేర్కొంది. కృత్రిమ మేధా (ఎఐ) అనుభవాలతో ఈ ఫోల్డబుల్ ఫోన్లను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది. అత్యంత వైవిధ్యమైన, సౌకర్యవంతమైన, అధునాతన సాంకేతికతో వీటిని అభివృద్ధి చేశామని ఆ కంపెనీ పేర్కొంది.

4 నుండి ప్లాస్టిక్ రీసైక్లింగ్ అంతర్జాతీయ సదస్సు

న్యూఢిల్లీ : ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఎఐపిఎంఎ), కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ అసోసియేషన్ (సిపిఎంఎ)లు సంయుక్తంగా గ్లోబల్ కాన్క్లేవ్ ఆన్ ప్లాస్టిక్స్ రీసైక్లింగ్, సస్టైనబిలిటీ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాయి. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జులై 4 నుండి 7 వరకు దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు అరవింద్ మెహతా తెలిపారు. ఈ పరిశ్రమ 2033 నాటికి 6.9 బిలియన్ డాలర్ల (రూ.57వేల కోట్లు)కు చేరుకుంటుందని అంచనా వేశారు.

చిన్న పరిశ్రమల వృద్ధికి ఎఐ కీలకం : మెటా

న్యూఢిల్లీ : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఇ)ల వృద్ధికి కృత్రిమ మేధా (ఎఐ) మద్దతు ఎంతో అవసరం ఉందని మెటా పేర్కొంది. టెక్ ఎంఎస్ఎంఇలకు సాధికారత కల్పించేందుకు నాస్కామ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. ప్రపంచ ఎంఎస్ఎంఇ దినోత్సవం సందర్భంగా 'ఎంపవర్లింగ్ ఇండియాస్ గ్రోత్: టెక్-ఎనేబుల్డ్ ఎంఎస్ఎంఇలకు ఏఐ సామర్థ్యాలను అన్‌లాక్ చేయడం" అనే శీర్షికతో నాస్కామ్, మెటా సంయుక్తంగా ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేశాయి.

ఇది టెక్ ఎంఎస్ఎంఇలకు తమ వ్యాపార కార్యకలాపాలలో ఎఐని స్వీకరించడంలో ఎదుర్కొంటున్న కీలక అవకాశాలు, సవాళ్లను విశ్లేషించింది.

అత్యంత విలువైన బ్రాండ్‌గా టాటా గ్రూపు

న్యూఢిల్లీ: దేశంలో అత్యంత విలువైన బ్రాండ్‌లలో టాటా గ్రూప్ అగ్రస్థానంలో నిలిచింది. బ్రాండ్ ఫైనాన్స్ తాజా రిపోర్ట్ ప్రకారం.. డిజిటలైజేషన్, ఇ-కామర్స్, ఇవి, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలపై దృష్టి సారించిన టాటా గ్రూపు బ్రాండ్ విలువ గతంలో కంటే 9 శాతం పెరిగి రూ.2.3 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ దిగ్గజ సంస్థ గతేడాది కూడా తొలి స్థానంలో ఉంది. రూ.1.18 లక్షల కోట్లతో ఇన్ఫోసిస్ రెండో స్థానంలో ఉంది. రూ.86వేల కోట్ల హెచ్‌డిఎఫ్‌సి గ్రూపు మూడో స్థానంలో, ఎల్ఐసి గ్రూప్ ఐదో స్థానంలో నిలిచింది.

ఆ తర్వాత స్థానాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బిఐ గ్రూప్, ఎయిర్‌టెల్, హెచ్‌సిఎల్ టెక్, ఎల్అండ్‌టి, ఎంఅండ్ఎం ఉన్నాయి.

ఉప్పల్ భాగాయత్‌లో బజాజ్ ఆటో కొత్త షోరూం ఏర్పాటు

హైదరాబాద్ : ద్వి, త్రిచక్ర వాహన కంపెనీ బజాజ్ ఆటో లిమిటెడ్ తన నూతన షోరూంను ఉప్పల్ భాగాయత్ వద్ద ఏర్పాటు చేసింది. ఇక్కడ తమ నూతన కార్గో, ప్యాసింజర్ త్రీ వీలర్ ఆటోలను విక్రయానికి ఉంచింది. ఈ కొత్త డీలర్‌షిప్‌ను శ్రీ వినాయక బజాజ్ పేరిట ఏర్పాటు చేసింది. ఈ ప్రారంభోత్సవంలో బజాజ్ ఆటో ప్రతినిధులు అన్షుల్ చోప్రా, అనుపమ్ శ్రీవాస్తవ, శ్రీ వినాయక ఆటోమొబైల్స్ ఛైర్మన్ కెవి బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎవాస్ కొత్త ప్రచార క్యాంపెయిన్



ముంబయి : ప్రముఖ నిర్మాణ సామగ్రి కంపెనీ అయిన ఇన్‌ఫ్రా.మార్కెట్ తన డైరెక్ట్-టు-కన్స్యూమర్ (డి2సి) బ్రాండ్ ఎవాస్ ద్వారా బాలీవుడ్ నటీ శిల్పాశెట్టితో కొత్త 'ఘర్ ధడక్నే దో' కాంపెయిన్ ప్రారంభించినట్టు ప్రకటించింది. గృహిణులు వారి జీవిత కాలంలో ఎక్కువగా ఇంటిలోనే గడుపుతారన్న విషయాన్ని ఎవాస్ గుర్తిస్తోందని పేర్కొంది. ఇళ్లని మెరుగుపరుచుకోడాన్ని ప్రోత్సహించేలా ఎవాస్ క్యాంపెయిన్ ఉంటుందని ఇన్ఫ్రా.మార్కెట్ సహ వ్యవస్థాపకులు ఆదిత్య శర్మా పేర్కొన్నారు.

ఎంపీ అసద్ ఇంటిపై బ్లాక్ కలర్

- ఎంపీలు క్షేమంగా ఉన్నారా లేదా అని ఒవైసీ ఆగ్రహం





న్యూఢిల్లీ : లోక్‌సభ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఢిల్లీలోని తన నివాసంపై 'తెలియని దుండగులు' నల్ల ఇంకు విసిరారని గురువారం ఆరోపించారు. ఈ మేరకు ఓవైసీ ట్వీట్ చేశారు. ఈరోజు కొందరు 'తెలియని దుండగులు' నా ఇంటిపై నల్ల ఇంకు విసిరారని ఆయన తన ట్వీట్‌లో తెలిపారు. ఇప్పుడు ఢిల్లీలోని నా ఇల్లు ఎన్నిసార్లు టార్గెట్ చేయబడిందో లెక్కలేనన్ని. ఇదంతా ఎలా జరుగుతోందని ఢిల్లీ పోలీసు అధికారులను అడిగితే, వారు తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు.

మీ పర్యవేక్షణలోనే ఇదంతా జరుగుతోందని హెూంమంత్రి అమిత్ షాను ట్యాగ్ చేస్తూ ఓవైసీ ఆ ట్వీట్‌లో ప్రశ్నించారు. ఆయన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ట్యాగ్ చేస్తూ ఎంపీల భద్రతకు హామీ ఇస్తారో లేదో చెప్పండి.

నా ఇంటిని టార్గెట్ చేసే చిరుద్యోగులకు నేను భయపడను అని ఎంపీ అన్నారు. ఈ సావర్కర్ తరహా పిరికితనాన్ని ఆపి నన్ను ఎదుర్కొనే ధైర్యాన్ని కూడగట్టుకోండి. సిరా విసిరిన తర్వాత లేదా రాళ్లు రువ్విన తర్వాత పారిపోకండి. అని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఒవైసీ 'జై పాలస్తీనా' అనడంపై వివాదం చెలరేగడం గమనార్హం. దీనిని పార్లమెంటు లోపల, బయట ఖండించారు. అప్పటి నుంచి ఒవైసీపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఇంతకుముందు కూడా ...

ఈ దాడి ఒక్కటే కాదు. ఒవైసీ ఢిల్లీ నివాసంపై పలుమార్లు దాడులు జరిగాయి. గతేడాది ఆగస్టులో ఢిల్లీలోని అశోకారోడ్‌లోని హైసెక్యూరిటీ ఏరియాలో ఒవైసీ నివాసం తలుపులు పగలగొట్టిన రెండు అద్దాలు కనిపించాయి. అంతకుముందు ఫిబ్రవరిలో, ప్రవేశ ద్వారం వద్ద దుండగులు రాళ్లు విసిరి అతని నేమ్‌ప్లేట్‌ను పగులగొట్టారు. ఆ సమయంలో, ఒవైసీ ట్వీట్ చేస్తూ, 2014 నుంచి తన నివాసంపై ఇది నాల్గవ దాడి అని అన్నారు.

2022లో ఉత్తరప్రదేశ్‌లో మీరట్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న ఎంపీ కాన్వాయ్‌పై దాడి జరిగింది. దాడి నుంచి తటిలో ప్రాణాలతో బయటపడిన ఒవైసీ.. తన వాహనంపై నాలుగు రౌండ్ల బుల్లెట్లు దూసుకెళ్లాయని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి సచిన్ (25), శుభం (28) అనే ఇద్దరు యువకులను అరెస్టు చేశారు.

వేలం లేకుండానే సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించాలి

- కేంద్రం చర్యలపై జులై 1న నల్ల బ్యాడ్జీలతో నిరసన : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నేత రాజిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేలం లేకుండానే సింగరేణికి బొగ్గు బ్లాకులు కేటాయించాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నేత రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోల్ ఇండియాకు వేలం లేకుండానే బొగ్గు బావులను అప్పగిస్తున్న కేంద్రం సింగరేణి విషయంలో మాత్రం ఎందుకు పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని ప్రశ్నించారు. సింగరేణిని ప్రయివేటు పరం చేయాలనే కుట్రలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తున్నదని ఆరోపించారు. బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు అడ్డుకోవాలని సూచించారు.

సంస్థను నమ్ముకొన్న 40 వేల మంది కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సింగరేణిని నిర్వీర్యం చేసేందుకు చేస్తున్న కుట్రలకు నిరసిస్తూ తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. జూలై 1న నల్ల బ్యాడ్జీలతో నిరసన, 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దగ్ధం, 6న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం ఆఫీసుల ముందు ధర్నాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 9న గోదావరిఖనిలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ప్రకటించారు. సింగరేణి పరిధిలోని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు, హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్, ఢిల్లిలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. మీడియా సమావేశంలో టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ కాపు కృష్ణ, యూనియన్ నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామ్మూర్తి, కె.సురేందర్‌రెడ్డి, పి.లక్ష్మణ్, వి.శంకర్, జాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ఆ పోస్టులకూ పదోన్నతులివ్వాలి

- టీఎస్‌జీహెచ్ఎంఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆన్‌లైన్ విధానంలో ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతులను ఒకేసారి నిర్వహించడం వల్ల ఎక్కువ మంది ఉపాధ్యాయులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం (టీఎస్‌జీహెచ్ఎంఏ) తెలిపింది. ఒకే టీచర్‌కు ఎక్కువ సబ్జెక్టుల్లో పదోన్నతులు రావడం వల్ల ఒకే పోస్టులో చేరుతున్నారనీ, మిగిలిన పోస్టులు ఖాళీగా ఉంటున్నాయని పేర్కొంది. ఖాళీగా ఉన్న ఆ పోస్టులకూ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌జీహెచ్ఎంఏ అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక సబ్జెక్టులో పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం మరో సబ్జెక్టుకు పదోన్నతి ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. దీనివల్ల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇవ్వకుండా ఉండడం వల్ల సీనియార్టీ జాబితాలో ఉన్న తదుపరి ఉపాధ్యాయులకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు. లేదంటే మొదటి జాబితాలో పదోన్నతి పొందిన టీచర్లను రెండో జాబితాలో తొలగిస్తే మిగతా టీచర్లకు పదోన్నతి అవకాశాలుంటాయని తెలిపారు. ఒక టీచర్ ఒకే పోస్టును కోరుకుంటారు కాబట్టి మిగతా పోస్టులు ఖాళీగా ఉండే సమస్య తీరిపోతుందని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో సింగిల్ ప్యాటర్న్ అనంతరం సెకండ్ పోస్టు ఇవ్వడానికి అనుసరించే విధానం ప్రకారం అదే వరుసలో సబ్జెక్టుల వారీగా పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కువ మంది ఎస్జీటీలకు పదోన్నతులు రావడమే కాకుండా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరుతుందని తెలిపారు.

నిరుద్యోగులతో రాజకీయాలా? : చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నిరుద్యోగులతో రాజకీయాలు చేస్తారా? సిగ్గు అనిపిస్తలేదా? అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్‌తో ఉద్యోగాల భర్తీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ కేటీఆర్ నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.గతంలో ప్రవల్లిక ఆత్మహత్యను అవమానపరిచిన కేటీఆర్ నిరుద్యోగుల గురించి మాట్లాడటం అవివేకమన్నారు.

ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించాలి

- సీఎంకు రాకేష్ రెడ్డి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా ఎంజీఎం ప్రభుత్వాస్పత్రిని సందర్శించాలని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం వరంగల్ పర్యటనకు రావడం ముదావహమే కానీ, ఆయన కార్పొరేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వస్తున్నారని ఎద్దేవా చేశారు. అంతకంటే ముందు కేసీఆర్ ప్రారంభించిన ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు త్వరగా పూర్తయ్యేలా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎయిమ్స్ ఆస్పత్రిలో సమస్యలు తీర్చాలనీ, ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బంది కొరతతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బెడ్ల కోసం ప్రయివేటు సంస్థలపై ఆధారపడుతున్నారనీ, ఎంజీఎం ఆస్పత్రిలో బెడ్ల కొరత వేధిస్తున్నదని చెప్పారు. పనికిమాలిన పథకాల కోసం కాకుండా పేదల ఆరోగ్యం కోసం నిధులు ఖర్చు చేయాలని రాకేష్ రెడ్డి సూచించారు.

రాష్ట్రంలో విస్తారంగా వానలు

- 502 ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- వచ్చే రెండ్రోజులు వర్షసూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రం మీదుగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. దీని ఫలితంగా రాష్ట్రంలో గురువారం విస్తారంగా వర్షం కురిసింది. ఉదయం 8:30 నుంచి రాత్రి పది గంటల వరకు 502 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు పడ్డాయి. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఈదులగట్టెపల్లిలో అత్యధికంగా 8.1 సెంటీమీటర్లు, పోచంపల్లిలో 6.8 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. 92 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. రాష్ట్రంలో వచ్చే ఐదు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయి. అక్కడక్కడా భారీ వర్షం పడే అవకాశముంది. ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో బలమైన ఉపరితల గాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయి. రాబోయే 48 గంటల పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సాయంత్రం, రాత్రి సమయాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన పడే అవకాశముంది.

'యశస్విని' పథకంలో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి

- కేంద్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రికి శ్రీధర్ బాబు వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'యశస్విని' పథకం కింద రాష్ట్రానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల దినోత్సవం సందర్భంగా గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు తమ కాళ్లమీద తాము నిలబడేలా ఉపయోగపడే ఈ పథకాన్ని తెలంగాణలో త్వరితగతిన అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. మహిళా ఔత్సాహికులకు సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు మరిన్ని నిధులు కేటాయించి, ప్రస్తుత మార్కెట్ అవసరాలకు తగినట్టు ఆధునీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంఎస్ఎంఈలకు కేంద్రం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలను తక్షణం విడుదల చేయాలని విన్నవించారు. ఈ రంగం ద్వారా రాష్ట్రంలో 3.64 లక్షల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల చిరు వ్యాపారులు, సూక్ష్మ పరిశ్రమల నిర్వాహకులు ఎక్కువ ప్రయోజనం పొందుతున్నారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తెలంగాణను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను స్వయంగా వీక్షించాలని శ్రీధర్‌బాబు చేసిన అభ్యర్థనకు కేంద్ర మంత్రి మాంఝీ స్పందించారు. నెల రోజుల్లో రాష్ట్రాన్ని సందర్శిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

నేడు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు విడుదల కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫలితాలను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని తెలిపారు. www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈనెల మూడు నుంచి 13 వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 51,237 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కావడానికి దరఖాస్తు చేశారు. వారిలో 31,625 మంది అబ్బాయిలు, 19,612 మంది అమ్మాయిలున్నారు. వారి కోసం 170 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

3న బాసర త్రిపుల్‌ఐటీ సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) బాసర త్రిపుల్‌ఐటీలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరేండ్ల సమీకృత బీటెక్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి వచ్చేనెల మూడో తేదీన సీట్లు కేటాయింపు ఉంటుంది. ఈ మేరకు ఆర్జీయూకేటీ ఉపకులపతి (వీసీ) వి వెంకటరమణ గురువారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడారు. 15 వేల దరఖాస్తులొచ్చాయని వివరించారు. వచ్చేనెల మూడో తేదీన సీట్లు కేటాయిస్తామనీ, ఎంపికైన విద్యార్థుల తుదిజాబితాను ప్రకటిస్తామని తెలిపారు. అదేనెల ఎనిమిది, తొమ్మిది, పది తేదీల్లో కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

గెస్టు లెక్చరర్లను రెన్యూవల్ చేయాలి

- మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల్లో పనిచేస్తున్న గెస్టు లెక్చరర్లను వెంటనే రెన్యూవల్ చేయాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ ఒకటో తేదీనే కళాశాలలు ప్రారంభమైనప్పటికీ 35 శాతం స్టాఫ్, గెస్టు లెక్చరర్లను రెన్యూవల్ చేయకపోవడం దారుణమన్నారు. దీంతో విద్యార్థులు ప్రయివేటు కళాశాలలకు వెళ్తున్నారని చెప్పారు. పర్మినెంట్ లెక్చరర్లు లేని కళాశాలలు రాష్ట్రంలో 25 ఉన్నాయనీ, మూడు వేల మంది గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారు రోడ్డు పడుతున్నారని తెలిపారు. వారికి జీతభత్యాలు పెంచి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కయ్యారంటూ ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని మాజీ మంత్రి హరీష్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటే, రఘునందన్‌రావు సొంత నియోజకవర్గం దుబ్బాకతో పాటు మూడు చోట్ల బీఆర్ఎస్ మెజారిటీ సాధించిందని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో బీజేపీకి మెజారిటీ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. కాషాయం పంచన చేరి, మోడీ శరణుజొచ్చింది రేవంతే అన్న విషయం ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉంటూ బీజేపీ ఎజెండా అమలు చేస్తున్నారని ఆరోపించారు. నిండు సభలో మోడీని పెద్దన్న అని సంబోధించింది ఎవరో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మోడీ, రేవంత్ కుమ్మక్కై, సింగరేణిని ప్రయివేటు పరం చేస్తున్నారని విమర్శించారు. విభజన హామీలపై కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయడం లేదని విమర్శించారు. ఇరు పార్టీల మధ్య ఉన్న సయోధ్యకు ఇంతకన్నా నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెండు పార్టీలు అనైతిక పొత్తుకు పాల్పడి ప్రాంతీయ శక్తి అయిన బీఆర్ఎస్‌ను టార్గెట్ చేశాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇప్పటికైనా వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు.

పశ్చిమ దేశాలతో దౌత్య సంబంధాలు తగ్గించుకునే యోచనలో రష్యా



మాస్కో : పాశ్చాత్య దేశాలతో మాస్కో దౌత్య సంబంధాలు తగ్గించుకోవలసి వస్తుందని, అమెరికా, దాని మిత్రదేశాల శత్రుపూరిత విధానాలను ఉటంకిస్తూ రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ హెచ్చరించాడు. "పాశ్చాత్య దేశాలతో మా సంబంధాల్లో అత్యంత గందరగోళ దశకు సంబంధించిన అన్ని విషయాలు ఉన్నప్పటికీ మేమింకా అలాంటి దశను ప్రారంభించలేదు" అని దౌత్యవేత్త సెర్గీ ర్యాబ్కోవ్ గురువారం ప్రచురింపబడిన ఇజ్వెస్టియా వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. "దౌత్య సంబంధాల స్థాయిని తగ్గించే నిర్ణయం సాధ్యమేనా? మేము ఈ సమస్యను పరిశీలిస్తున్నామని నేను చెప్పగలను. ఇటువంటి నిర్ణయాలు అత్యున్నత స్థాయిలో తీసుకోబడతాయి" అని ర్యాబ్కోవ్ అన్నాడు.

ప్రపంచ అవనికపై పశ్చిమ దేశాల "శిక్షారహిత భావం" చివరికి రష్యాను మరింత నిర్ణయాత్మకంగా ప్రతీకారం తీర్చుకోవాలని బలవంతం చేస్తున్నది పరిస్థితి మారకపోతే, తప్పక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని డిప్యూటీ మంత్రి హెచ్చరించారు. మన ప్రత్యర్థులు అడుగడుగునా తిరుగులేని స్థితికి చేరుకుంటున్నారని తెలుసుకోవాలి. రష్యా భూభాగంపై దాడి చేయడానికి అమెరికా సరఫరా చేసిన దీర్ఘ-శ్రేణి ఏటీఏసీఎమ్ఎస్ క్షిపణులను ఉపయోగించినప్పుడు లక్ష్యాలను ఎంచుకునేందుకు ఉక్రేనియన్ దళాలకు వాషింగ్టన్ సహాయం చేస్తుందని సెర్గీ ర్యాబ్కోవ్ ఆరోపించాడు. గత వారం, క్షిపణి నుంచి క్లస్టర్ ఆయుధాలు క్రిమియాలోని ప్యాక్ బీచ్‌ను తాకడంతో నలుగురు వ్యక్తులు మరణించారు. ఈ సంఘటన మాస్కోకు అమెరికా రాయబారిని పిలిపించింది. "ఇది సంఘర్షణలో ప్రత్యక్ష అమెరికా ప్రమేయం స్పష్టమైన సందర్భం" అని ర్యాబ్కోవ్ చెప్పాడు.

ఉక్రెయిన్‌కు ఆయుధాల డెలివరీలు, విదేశాల్లో రష్యన్ ఆస్తులను జప్తు చేసే ప్రయత్నాలు, ఆయుధాల నియంత్రణ వంటి ఇతర రంగాల్లో సంభావ్య సంభాషణను బలహీనపరుస్తాయని సెర్గీ ర్యాబ్కోవ్ చెప్పాడు. "ఇది కేవలం అసాధ్యం అని వారు అర్థం చేసుకోవాలి," అని అతను నొక్కి చెప్పాడు. జూన్‌లో ముందుగా, ఉక్రెయిన్ పాశ్చాత్య మద్దతుదారులు మాస్కోతో పోరాటంలో కీవ్‌కు మద్దతును కొనసాగించడానికి తమ ప్రతిజ్ఞలను పునరుద్ధరించారు. ఉక్రెయిన్‌లో ఎలాంటి విదేశీ సహాయం అందించినా తన కార్యకలాపాలు ఆగవని, ఆయుధాల డెలివరీలు యుద్ధాన్ని మరింతగా తీవ్రతరం చేస్తాయని రష్యా పదేపదే పేర్కొంది.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

- గురుకులాల్లో స్పెషల్ కోటా ఇవ్వాలి :విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంను ఫెడరేషన్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, బి. రాజశేఖర్, కార్యదర్శులు బి. జగదీశ్వర్, గండ్ర నవీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, ఎం.రమేష్ ఇందులో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్నారనీ, ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేవారన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసేది జర్నలిస్టులేనని గుర్తు చేశారు. ఒక రకంగా అటు ప్రభుత్వంతో ప్రజలతో ఉంటూ సర్వీసు చేస్తున్న వారి జాబితాలో జర్నలిస్టులు ప్రధానంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు జిల్లా, మండల కేంద్రాల్లో పనిచేసే జర్నలిస్టులకు తక్కువ జీతాలు ఉండటంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని ఫెడరేషన్ నేతలు విద్యాశాఖ కార్యదర్శికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం భారీగా గురుకులాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన విద్యను అందిస్తోందనీ, అయితే తమ జర్నలిస్టుల పిల్లలకు ఈ గురుకులాల్లో ప్రత్యేక కోటా కింద అడ్మిషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకునే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇప్పించేలా ప్రభుత్వం నుంచి సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం తరఫున తమవంతు సహకారం అందించాలనీ, జర్నలిస్టుల సంక్షేమం కోసం మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. వీటిపై విద్యాశాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందిస్తూ పరిశీలిస్తామన్నారు.